నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
మంగళవారం | 13 మార్చి 2018 | విజయవాడ
సంపుటి 11 | సంచిక 135
| పేజీలు 12+16 | వెల: రూ. 5.00
Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

అనుగ్రహం

శ్రీ హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయనం, శిశిర రుతువు, ఫాల్గుణ మాసం, బహుళ పక్ష తిథి : ఏకాదశి మ.1.03, ఉత్తరాషాఢ ఉ.11.47, వర్జ్యం సా.4.15 నుంచి 6.01 వరకు, రాహుకాలం: మ.3.00 నుంచి 4.30 వరకు; దుర్ముహూర్తం: ఉ.8.24 నుంచి 9.12 వరకు, తిరిగి రా.10.46 నుంచి 11.36 వరకు సూర్యోదయం : ఉ.6.29 గం; సూర్యాస్తమయం: సా. 6.22 గం.

ప్రతీకారం తీర్చుకున్న టీమిండియా



12 లో

- తొలి టీ-ట్వంటీ ఓటమికి దీటైన జవాబిచ్చిన భారత్
- 9 బంతులు మిగిలి ఉండగానే శ్రీలంకపై విజయం
- సమష్టిగా రాణించిన భారత జట్టు
- ఫైనల్స్‌లో స్థానం దాదాపు ఖరారు

ఎంత త్యాగానికైనా సిద్ధం

అభివృద్ధి ఆగబోదు - హక్కులపై రాజీలేదు : చంద్రబాబు నాయుడు

- బీజేపీ రాష్ట్రాన్ని తీవ్రంగా మోసం చేసింది
- ప్రత్యేక హోదా ఇవ్వకపోగా, ఇస్తామన్న ప్యాకేజీ కూడా ఇవ్వలేదు
- రాష్ట్ర ప్రజల సెంటిమెంట్‌తో ఆటలా?
- న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగుతుంది
- కేంద్రం సహకారం లేకున్నా స్వయంకృషితో ముందుకుపోదాం
- వడగాలులు, అకాల వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి
- అసెంబ్లీ సమావేశాల తరువాత సీఎం జిల్లా పర్యటనలు
- 'నీరు-ప్రగతి' పురోగతిపై టెలికాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు



(అమరావతి, సూర్య ప్రధాన ప్రతినిధి) : "రాష్ట్రంలో అభివద్ధి ఆగడానికి వీల్లేదు, అదే సమయంలో మన హక్కులపై రాజీలేదు. కేంద్రంనుంచి సహకారం లేకున్నా స్వయం కషితో ముందుకుపోదాం. మీ అందరి సహకారంతో రెండంకెలవద్ధి మూడేళ్లుగా సాధిస్తున్నాం. ఇదే స్ఫూర్తితో మరింత వద్ధి సాధించాలి" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. సోమవారం తన నివాసం నుంచి నీరు-ప్రగతి, వ్యవసాయం పురోగతిపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఒకవైపు రాష్ట్ర హక్కుల కోసం పోరాటం చేస్తూనే, మరోవైపు రాష్ట్రాభివద్ధి, పేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి కోరారు. మన కష్టంతో మనం ముందుకు పోవాలని ఆకాంక్షించారు. ఎప్పటికైనా మన కష్టమే మనకు అక్కరకు వస్తుందన్నారు. వర్షపాతం లోటు ఉన్నప్పటికీ సమర్ధనీటి నిర్వహణ ద్వారా వ్యవసాయం అనుబంధ రంగాలలో దిగుబడులు తగ్గకుండా చేస్తున్న కషి ఫలించడం పట్ల సంత ప్తి వ్యక్తం చేశారు. శ్రీశైలం రిజర్వాయర్ లో ప్రస్తుత నీటిమట్టం 834 అడుగులకు చేరుకుందని, హంద్రీ-నీవా ద్వారా ఈ ఏడాది 170రోజులు సాగునీటిని ఇవ్వగలగడంపై రాయల సీమ రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోందని అన్నారు. "ఈ నెలాఖరుకల్లా నరేగా లక్ష్యాలను చేరుకోవాలి. రోజుకు 24లక్షల పనిదినాల లక్ష్యానికిగాను, 14లక్షల మేండేట్స్ కే చేరాం. మిగిలినవి కూడా ఈ నెలాఖరులోపు పూర్తిచేయాలని"ముఖ్యమంత్రి సూచించారు. ఉపాధి కూలీలకు వేతనాలు సక్రమంగా చెల్లించాలన్నారు. వేతనాల చెల్లింపులో ఏ విధమైన జాప్యం జరుగరాదన్నారు. వడగాలులు,అకాల వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి "వేసవిలో వడగాలులు, అకాల వర్షాల పట్ల అప్రమత్తంగా



వైకాపా తరపున రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న వేమగుంట, టీడీపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న సీఎం రమేష్, - వివరాలు లోపలి పేజీల్లో


రైల్వేజోన్ హుళక్కే

- స్పష్టం చేసిన కేంద్ర ప్రభుత్వం
- హోదాపై ఇప్పటికే హ్యాండిచ్చిన కేంద్రం
- ఇప్పుడు జోన్ కూడా ఇచ్చేది లేదని వెల్లడి
- సీఎస్ దినేష్ కుమార్‌కు వెల్లడించిన హోమ్ శాఖ కార్యదర్శి



(న్యూఢిల్లీ, సూర్య ప్రత్యేక ప్రతినిధి) : ఏపీకి కేంద్రం మరో షాక్ ఇచ్చింది. రాష్ట్రానికి రైల్వేజోన్ వస్తుందని గత కొన్నేళ్లుగా రాష్ట్ర ప్రజలు వేయికళ్లతో వేచి చూస్తున్న సంగతి తెలిసిందే. మరోవైపు నేతలు సైతం జోన్ కోసం అలుపెరగని పోరాటం చేస్తున్నారు. అయితే సోమవారం సాయత్రం ఎట్టకేలకు రైల్వే జోన్‌పై కేంద్రం తేల్చేసింది. ఏపీకి రైల్వే జోన్ లేనట్టేనని కేంద్రం తేల్చి సింది. అందుబాటులో ఉన్న నివేదిక ప్రకారం రైల్వేజోన్ సాధ్యం కాదని ఏపీ సీఎస్ దినేష్‌కుమార్‌కు కేంద్ర హోంశాఖ కార్యదర్శి స్పష్టం చేశారు. కాగా సోమావారం 13వ షెడ్యూల్‌పై ఇరు రాష్ట్రాల అధికారులతో చర్చ జరిగింది. ప్రత్యేక హోదా ఇవ్వకుండా ఏపీకి కేంద్రం అన్యాయం మిగతా 6లో

2జీ స్కామ్ విచారణ పూర్తికి ఆరు నెలల గడువు



5 లో

- 2జీ కేసులో కేంద్రానికి సుప్రీం మొట్టికాయలు
- కేసుల దర్యాప్తు నత్తనడకన సాగుతోందని సుప్రీం ధర్మాసనం సీరియస్
- ఆరు నెలల్లో పూర్తి చేయాలని సీబీఐ, ఈడీలకు ధర్మాసనం ఆదేశం

సాగని పార్లమెంట్

- ఉభయ సభలు నేటికి వాయిదా
- రిజర్వేషన్లపై టీఆర్ఎస్ ఎంపీల ఆందోళన
- ప్రత్యేక హోదాపై టీడీపీ ఎంపీల పోరు
- రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావిస్తూ జై తెలంగాణ నినాదాలు
- జీరో అవర్‌ను అడ్డుకున్న తెలంగాణ ఎంపీలు
- డిమాండ్లను నెరవేర్చేదాకా ఆందోళన విరమించేది లేదని వెల్లడి
- ప్లకార్డులు ప్రదర్శిస్తూ టీడీపీ ఎంపీల ఆందోళన
- సభను రెండుసార్లు వాయిదా వేసినా అదుపులోకి రాని పరిస్థితి
- నేడు కూడా ఆందోళనే



న్యూఢిల్లీ: పార్లమెంట్ ఉభయ సభలు వరుసగా ఆరో సెషన్‌లోనూ ఎలాంటి కార్యక్రమాలు జరగకుండానే వాయిదా పడ్డాయి. రిజర్వేషన్ల కేటాయింపు హక్కు రాష్ట్రాలకే ఉండాలంటూ టిఆర్ఎస్ ఎంపీలు లోక్‌సభను స్తంభింపజేశారు. మరోవైపు ప్రత్యేక హోదా కోరుతూ తెలుగుదేశం పార్టీ ఎంపీలు చేస్తున్న ఆందోళనతో పార్లమెంటు ఉభయసభలు వాయిదా పడ్డాయి. సభ ప్రారంభం కాగానే రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావిస్తూ టిఆర్ఎస్ ఎంపీలు మిగతా 6లో

బాబు పాలనలో అష్టకష్టాలు

- బాపట్ల బహిరంగ సభలో వై.ఎస్.జగన్
- 25 మంది ఎంపీలు రాజీనామా చేస్తే హెూదా ఎందుకు రాదు
- బాబు వచ్చారు రోజుకో బెల్ట్‌షాపు తెచ్చారు
- వైసీపీ పోరాటం వల్లే కేంద్రం నుంచి టీడీపీ తన మంత్రులను రాజీనామా చేయించింది: జగన్

చంద్రబాబు నాయుడు పాలనలో ప్రజల అష్ట కష్టాలు పడుతున్నారని ప్రతిపక్షనేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి విమర్శించారు. 110వ రోజు ప్రజాసంకల్పయాత్రలో భాగంగా సోమ వారం గుంటూరు జిల్లా బాపట్లలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. రైతులకు గిట్టు బాటు ధర లేక రైతులు అష్ట కష్టాలు పడుతున్నారని, వ్యవ సాయం పూర్తిగా అధ్వాన్నమైన పరిస్థితికి చేరుకుందన్నారు. చంద్రబాబు పాలనలో మత్స్యకారుల పరిస్థితి మరింత దారుణంగా తయారైందన్నారు.



(బాపట్ల నుంచి సూర్య పొలిటికల్‌బ్యూరో ప్రత్యేక ప్రతినిధి) : డీజిల్ రేటు భారీగా పెరిగిందని, సబ్సిడీ కింద డీజిల్ ఇవ్వడంలేదని రైతులు చెబుతుంటే మనసు కలిచి వేస్తుందన్నారు. కొత్త బోట్లు కొనుక్కుంటే డీజిల్ సబ్సిడీ ఇవ్వాల్సి వస్తుందని రిజిస్ట్రేషన్ చేయడం లేదన్నారు. నాలుగేళ్లుగా చంద్రబాబు పాలన చూస్తున్నా మని, అభివృద్ధి పేరుతో నోరు తెరిస్తే బాబు అబద్ధం చెబుతున్నారని మండిపడ్డారు. గిట్టుబాటు ధరల్లేక రైతన్నలు అల్లాడుతున్న పరిస్థితుల్లో కూడా బాబు వ్యవసాయం బ్రహ్మాండంగా ఉందంటున్నారని ధ్వజమెత్తారు. ఓ వైపు డిగ్రీలు చదివిన పిల్లలకు ఉద్యోగాల్లేక హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు వెళ్తూంటే ఈ పెద్దమనిషి మాత్రం విశాఖ సమ్మిట్‌లతో కోట్ల రూపాయల పెట్టుబడులు, పరిశ్రమలు వచ్చాయని ఊదరగొడుతున్నారని విమర్శించారు. ఉద్యోగ అవకాశాలు ఏమైనా వచ్చాయా అని ప్రజలనుద్దేశించి ప్రశ్నించారు. అప్పుల కోసం రూ.5 వేల మిగులు బడ్జెట్ చూపిస్తున్నారని, ఇలాంటి పరిస్థితులు మారాలన్నారు. నిన్నటి కన్నా ఈ రోజు బాగుంటేనే అభివృద్ధి అంటారని, కానీ ఈ నాలుగేళ్ల పాలనల్లో మీరు సంతోషంగా ఉన్నారా (ప్రజలనుద్దేశించి) అని మిగతా 6లో



నవ్యాంధ్రలో జనసేనాని నూతన గృహ శంకుస్థాపన

8 లో

- కాజ టోల్‌గేట్ సమీపంలో రెండు ఎకరాల్లో ఇల్లు
- సతీసమేతంగా భూమి పూజ చేసిన పవన్ కల్యాణ్



మార్కెట్ బుల్ జంప్

5 లో

- 600 పాయింట్లుకు పైగా పెరిగిన బీఎస్ఈ సెన్సెక్స్
- 250 పాయింట్లుకు పైగా పెరిగిన ఎన్ఎస్ఈ నిఫ్టీ
- దాదాపు ఏడాది తరువాత భారీ లాభం
- వెల్లువెత్తిన కొనుగోళ్లు - పెరిగిన సెంటిమెంట్

అంతా ఇంతే!



అందుకే మిమ్మల్ని హెల్మెట్ పెట్టుకుని వెళ్లమంది

అసెంబ్లీ రణరంగం



మండలి చైర్మన్ స్వామిగౌడ్ కంటికి గాయం

హెడ్‌ఫోన్ విసిరేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి

- తెలంగాణ అసెంబ్లీలో రచ్చ రచ్చ
- కాంగ్రెస్ సభ్యుల ఆందోళన
- గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకున్న విపక్ష ఎమ్మెల్యేలు
- నినాదాల మధ్యే కొనసాగిన నరసింహన్ ప్రసంగం
- బడ్జెట్ ప్రతులను చింపేసి గవర్నర్‌పైకి విసిరిన సభ్యులు
- మూడుసార్లు హెడ్‌ఫోన్లను విసిరిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- మండలి చైర్మన్ కంటికి గాయం
- సరోజినీ దేవీ ఆసుపత్రిలో చికిత్స
- గవర్నర్ ప్రసంగాన్ని బైయ్‌కాట్ చేసిన బీజేపీ
- సభ మధ్యలో బయటికి వెళ్లిన ప్రతిపక్ష నేత జానారెడ్డి
- నేడు కోమటిరెడ్డిపై స్పీకర్‌కు ఫిర్యాదు
- కఠిన చర్యలు తీసుకునే అవకాశం

ఎవరిపైనా దాడికి దిగలేదు: కోమటిరెడ్డి

మిగతా 3లో

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో తొలిరోజే రచ్చ రచ్చగా ప్రారంభమయ్యాయి. అసెంబ్లీ ప్రారంభం కాగానే గవర్నర్ నరసింహన్ ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగం ప్రారంభించారు. రైతులకు రూ.లక్ష మేరకు రుణాలు మాఫీ చేశామంటూ గవర్నర్ పేర్కొంటుండగా కొందరు కాంగ్రెస్ సభ్యులు తమ స్థానాల నుంచి బయటకు వచ్చి పోడియం వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. వీరి రాకను గమనించిన మార్షల్ వారిని అడ్డుకున్నారు. గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ప్లకా రులు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి, సీఎంకు వ్యతిరే కంగా నినాదాలు చేశారు. అడ్డుకుంటున్న మార్షల్స్ తోసేసి పోడియం వైపు వెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో సభలో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఇటీవల అధికార టీఆర్ఎస్, విపక్ష కాంగ్రెస్ పార్టీల మధ్య వాతావరణం ఉప్పు-నిప్పుగా మారిన సంగతి తెలిసిందే. ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టాలని కాంగ్రెస్, విపక్షాన్ని సమర్థంగా ఎదుర్కోవాలని టీఆర్ఎస్ అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకున్నాయి. బడ్జెట్ సమావేశాల తొలిరోజే ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీలో రచ్చకు దిగింది. టీఆర్ఎస్ సర్కారు వైఫ ల్యాలపై నినాదాలు చేస్తూ గవర్నర్ ప్రసంగాన్ని అడ్డు కునే ప్రయత్నం చేసింది. పెద్ద మిగతా 6లో



నేపాల్‌లో ఘోరం

విమానం కూలి 50 మంది మృతి

- త్రిభువన విమానాశ్రయంలో ప్రమాదం
- అదుపు తప్పి రన్‌వేపై కుప్పకూలిన విమానంలో సిబ్బందితో సహా 78 మంది
- సురక్షితంగా బయటపడిన 17 మంది

ఖాట్మండు : నేపాల్ రాజధాని ఖాట్మండులో ఘోర విమాన ప్రమాదం చోటు చేసుకుంది. త్రిభువన అంతర్జాతీయ విమానాశ్రయంలో బంగ్లాదేశ్ ఎయిర్‌లైన్‌కు చెందిన విమానం దిగుతుండగా అందులో మంటలు చెలరేగాయి. దీంతో 50 మందికి పైగా ప్రయాణికులు మృతి చెందినట్లు తెలిసింది. విమానంలో మొత్తం 78 మంది ప్రయాణికులు ఉన్నారని, మిగతా 6లో

ఇరాన్‌లో కూలిన విమానం


11 మంది టర్కీ అమ్మాయిల దుర్మరణం 6 లో..

'గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకోవడం దుర్మార్గపు చర్య'



హైదరాబాద్, మేజర్‌న్యూస్: రాజ్యాంగాధినేత అయిన గవర్నర్ ప్రసంగిస్తుంటే కాంగ్రెస్ అడ్డుకోవడం దుర్మార్గపు చర్య అని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ అన్నారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగాన్ని కాంగ్రెస్ పార్టీ అడ్డుకునే ప్రయత్నం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. గడచిన నాలుగేళ్లలో టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాల్ని ప్రవేశపెట్టిందని, వాటిగురించి గవర్నర్ ప్రసంగిస్తున్నప్పుడు అడ్డుకోవడాన్ని సరికాదన్నారు. కనీసం గవర్నర్ ఏం మాట్లాడుతున్నారో కూడా వినే పరిస్థితుల్లో కూడా కాంగ్రెస్ నేతలు లేరని కర్నె ప్రభాకర్ మండిపడ్డారు. ఈ చర్య ద్వారా కాంగ్రెస్ పార్టీ తన ధోరణిని మరోసారి నిరూపించుకుందన్నారు. గవర్నర్ ప్రసంగం సమయంలో వారిలో వారే కొట్టుకోవడం, పేపర్లు విసురుకోవడం వంటి చర్యలకు పాల్పడ్డారన్నారు. టీఆర్ఎస్ లక్ష్యం రాష్ట్ర అభివృద్ది కాదని, అయితే కొంతమంది వ్యక్తులు రాజకీయ కుట్రతో రాష్ట్రాన్ని సోమాలియా, ఉగాండా దేశాలలాగా మార్చాలని ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు.

'రైతుల ఆదాయం రెట్టింపు చేయడమే లక్ష్యం'



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: తెలంగాణలో 2022 సంవత్సరం నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్‌శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు ఉద్ఘాటించారు. బషీర్‌బాగ్‌లోని వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో రైతు సమన్వయ సమితుల అధ్యక్షుడిగా గుత్తా సుఖేందర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కేటీఆర్ ప్రసంగించారు. రైతులను సంఘటిత శక్తిగా మార్చేందుకే సమన్వయ సమితులు ఏర్పాటు చేశారని తెలిపారు. చరిత్రలో ఎక్కడా లేని విధంగా రైతులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. చెట్ల పెంపకంతో హరిత విప్లవం, చేపల పెంపకంతో నీలి విప్లవం, గొర్రెల పెంపకంతో పింక్ విప్లవం, పాల ఉత్పత్తితో శ్వేత విప్లవానికి శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని గుర్తు చేశారు. పంట పెట్టుబడి పథకం, బీమా పథకం త్వరలోనే అమలు చేస్తామన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టం చేసేందుకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని కేటీఆర్ స్పష్టం చేశారు.

ప్రభుత్వ హామీల ప్రస్తావనే లేని గవర్నర్ ప్రసంగం



హైదరాబాద్, మేజర్‌న్యూస్: గవర్నర్ ప్రసంగంలో ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రస్తావన ఎక్కడా లేదని కాంగ్రెస్ శాసనసభాపక్షనేత జానారెడ్డి విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రస్తావన లేకపోవడం వల్లే తమ సభ్యులు ఆవేదనతో నిరసనను వ్యక్తం చేశారని తెలిపారు. సభలో తమ శాసనసభ్యుల పట్ల మార్షల్స్ దురుసుగా ప్రవర్తించారని అన్నారు. మార్షల్స్ టేబుల్స్‌ను తన్నిపైనే తోయడం వల్ల పక్కకు వచ్చారని జానారెడ్డి తెలిపారు. సభలో తమ ఎమ్మెల్యేల పట్ల మార్షల్స్ దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు. అయినా, తాము ప్రజాస్వామికంగానే సభలో నిరసన తెలిపామని ఆయన అన్నారు. కాంగ్రెస్ సభ్యులు మద్యం తాగి వచ్చారన్న టీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఆరోపణలను ఖండిస్తున్నట్లు చెప్పారు. మద్యం తాగి సభకు వచ్చారన్న ఆరోపణలు అవాస్తవమని ఆయన అన్నారు. ఈ వ్యాఖ్యల ద్వారా సభ్యులను అవమానించినట్టేనని జానా అన్నారు. పార్లమెంట్‌లో అధికార పార్టీ ఎంపీలు ఏవిధంగా నిరసనలు తెలిపింది, అధికారపార్టీ గుర్తుంచుకోవాలని సూచించారు. టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ సభలో మండలి చైర్మన్ స్వామిగౌడ్‌కు అసలు గాయమే కాలేదని విమర్శించారు. ఆయన బయటకు రాగానే గాయమైనట్లు చెప్పున్నారని ఆయన విమర్శించారు. గతంలో టీఆర్ఎస్ ఎలా వ్యవహరించిందో అందరికీ తెలుసునని అన్నారు. కనీసం పోడియం వద్దకు ప్రతిపక్ష సభ్యులను అనుమతించకపోవడం దారుణమని అన్నారు. స్పీకర్ వద్ద ఉండాల్సిన మార్షల్స్ తమ వద్దకు ఎందుకు వచ్చారని భట్టి ప్రశ్నించారు. ప్రజల బాధలు గవర్నర్ ప్రసంగంలో లేకపోవడం మమ్మల్ని తీవ్ర నిరాశకు గురి చేసిందన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలోనే తాము నిరసన తెలిపామని చెప్పారు. అయినా తమని పోడియం వద్దకు కూడా వెళ్లకుండా అడ్డుకున్నారని మల్లుభట్టివిక్రమార్క అన్నారు. ప్రభుత్వం తమపట్ల కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. గవర్నర్ ప్రసంగాన్ని గతంలో టీఆర్ఎస్ ఎన్నో రెట్లు అడ్డుకున్నదని ఆయన గుర్తు చేశారు. సభ్యులపై నడుచుకుంటూ సీఎల్పీ గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకున్న విషయం తెలిసిందేనన్నారు. ప్రసంగం తరువాత గవర్నర్, మండలి చైర్మెన్ బయట వరకూ సాగనంపి వచ్చారన్న ఆయన, సభలో ప్రతిపక్షం లేకుండా చేసేందుకే చైర్మన్‌కు గాయమైనట్లు ప్రభుత్వం చెబుతోందన్నారు. ప్రభుత్వం హుందాగా వ్యవహరించాలని సూచించారు. సభలో ఈరోజు జరిగిన సంఘటనకు ముఖ్యమంత్రి కేసీఆర్‌దే బాధ్యత అని సీఎల్పీ ఉపనేత జీవన్‌రెడ్డి అన్నారు. ఈఘటనకు కుట్ర టీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో జరిగిందని ఆయన ఆరోపించారు. సభలో కాంగ్రెస్ సభ్యుల గొంతు నొక్కే ప్రయత్నాన్ని ప్రభుత్వం చేస్తోందన్నారు. సభకు గవర్నర్ ఆలస్యంగా రావడం విడూరకరమన్నారు. సభలో సభ్యులకు ఆవేదన వ్యక్తం చేసే హక్కులేదా? అని జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. అసెంబ్లీ ఏమి టీఆర్ఎస్ భవన్ కాదని ముఖ్యమంత్రి గుర్తుంచుకోవాలన్నారు. ప్రతిపక్షంలో సభలో ప్రజాసమస్యలను ప్రస్తావించరాదా? అని జీవన్‌రెడ్డి ప్రశ్నించారు.

27 వరకు తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

- 12 రోజులు పనిదినాలు
- బడ్జెట్ సమావేశాల నిర్వహణపై విపక్షాల పెదవి విరుపు



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః తెలంగాణ అసెంబ్లీ సమావేశాలను ఈ నెల 27 వరకు నిర్వహించాలని నిర్ణయించారు. సోమవారం మధ్యాహ్నం జరిగిన బీఏసీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. 13,14 తేదీల్లో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ జరపనున్నారు. 15న ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. ఈ నెల 25 వ తేదీ(ఆదివారం) కూడా సభను నడపాలని బీఏసీలో నిర్ణయించారు. సోమవారం ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాల్లో మొదటి రోజు గవర్నర్ నరసింహన్ ప్రసంగించారు. అనంతరం సభ వాయిదా పడింది.

కాగా, గవర్నర్ ప్రసంగానికి కాంగ్రెస్ అడ్డుతగలడంతో తోపులాట చోటుచేసుకుంది. ఈ ఘటనపై బీఏసీ సమావేశంలో చర్చ జరిగింది. కాంగ్రెస్ సభ్యులు ప్రవర్తించిన తీరుపై సభ్యులు బీఏసీ సమాచవేశంలో విచారం వ్యక్తం చేశారు. అయితే మండలి ఛైర్మన్ స్వామిగౌడ్‌కు గాయాలు అవడంపై చింతిస్తున్నామని కాంగ్రెస్ నేత జానారెడ్డి తెలిపారు. మరో వైపు ఈ ఘటనపై పోలీసులకు పిర్యాదు చేయాలని మజ్లిస్ శాసనసభా పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ సూచించారు. వీటిపై స్పందించిన సభాపతి మధుసూదనచారి అన్నీ పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు. 27న ద్రవ్య వినిమయ బిల్లుకు సభ ఆమోదం తెలుపనుంది. మొత్తం 12 పని దినాలుగా బీఏసీ సమావేశంలో నిర్ణయించారు. ఈ నెల 16, 18, 26 తేదీలను సభకు సెలవు దినాలుగా ప్రకటించారు. శాసనసభలో దాడి ఘటనపై మరోమారు భేటీ కావాలని నిర్ణయం తీసుకున్నారు. స్పీకర్ మధుసూదనచారి అధ్యక్షతన జరిగిన బీఏసీ సమావేశంలో డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి, మంత్రులు హరీష్‌రావు, కడియం శ్రీహరి, తుమ్మల నాగేశ్వర్‌రావు, ఈటల రాజేందర్, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు జానారెడ్డి, భట్టి విక్రమార్క, టీడీపీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, బీజేపీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి, సీపీఎం ఎమ్మెల్యే సున్నం రాజయ్య, ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ పాల్గొన్నారు.

12రోజుల పనిదినాలపై విపక్షాలు ఆగ్రహం...

తెలంగాణ బడ్జెట్ సమావేశాలను కేవలం 12రోజులు మాత్రమే నిర్వహించాలని నిర్ణయించడంపై కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, ఎంఐఎం సభ్యులు సైతం బీఏసీ సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. బడ్జెట్ సమావేశాలు కనీసం 30రోజుల పాటు నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. ఇంత తక్కువ సమయం నిర్ణయించడంపై ప్రజా సమస్యలు ఏ మేరకు ప్రస్తావనకు వస్తాయని టీడీపీ సభ్యుడు సండ్ర వెంకటవీరయ్య స్పీకర్‌ను ప్రశ్నించారు. గవర్నర్ విదేశీ పర్యటనకు వెళ్తున్నారని దీంతో 27న ద్రవ్యవినిమయ బిల్లుకు ఆమోదం తెలుపాల్సి ఉందని శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నట్లు సమాచారం. ఏప్రిల్‌లోనే సమావేశాలు ప్రారంభించాల్సి ఉందని, గవర్నర్ విదేశీపర్యటను వెళ్తున్న విషయం ప్రభుత్వానికి తెలియదా? అని సండ్ర ప్రశ్నించినట్లు సమాచారం. అయితే ఏప్రిల్‌లో మరోమారు సమావేశం నిర్వహించుకుందామని హరీశ్ అన్నట్లు సమాచారం. ద్రవ్యవినిమయ బిల్లు ఆమోదం తెలిపిన తర్వాత సభ నిర్వహిస్తే ఏం లాభమని సండ్ర అన్నట్లు సమాచారం. సభలో జరిగిన సంఘటనకు కారకులైన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని మజ్లీస్‌పక్షనేత అక్బరుద్దీన్ ఓవైసీ కోరారు. సభలో జరిగిన సంఘటనగురించి సీసీ ఫుటేజీ పరిశీలించి, చర్యలు తీసుకునే బాధ్యతను స్పీకర్‌కు అప్పగించారు.

స్వామిగౌడ్‌ను పరామర్శించిన కాంగ్రెస్ నేతలు



హైదరాబాద్, మేజర్‌న్యూస్: తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ స్వామిగౌడ్‌ను పరామర్శించేందుకు కాంగ్రెస్ నేతలు సరోజినీ ఆసుపత్రికి వెళ్లారు. సోమవారం శాసనసభలో గవర్నర్ ప్రసంగం సందర్భంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి మైక్ హెడ్‌సెట్‌ను విసిరివేయగా...స్వామిగౌడ్ కుడి కన్నుకు గాయమైంది. దీంతో ఆయనను వెంటనే సరోజనీ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న స్వామిగౌడ్‌ను పరామర్శించేందుకు కాంగ్రెస్ నేతలు షబ్బీర్ అలీ, పొంగులేటి సుధాకర్ రెడ్డి ఆసుపత్రికి వెళ్లారు. దీంతో ఆసుపత్రి వద్ద టీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు కాంగ్రెస్ నేతలను అడ్డుకున్నారు. దీంతో సరోజినీ ఆసుపత్రిలో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా టీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో ఆసుపత్రి ప్రాంగణంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఆసుపత్రిలోనే ఉన్న పోలీసులు టీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలను శాంతింపజేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. కాంగ్రెస్ నేతలు పరామర్శించడానికి వచ్చారన్న విషయాన్ని పోలీసులు స్వామిగౌడ్‌కు తెలియజేయడంతో ఆయన కాంగ్రెస్ నేతలను లోపలికి పంపించాలని ఆదేశించారు. దీంతో కాంగ్రెస్ నేతలు ఆసుపత్రి లోపలికి వెళ్లి స్వామిగౌడ్‌ను పరామర్శించారు. కాగా.. కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి ఉద్దేశ్యపూర్వకంగా చేసిన తప్పిదం కాదని కాంగ్రెస్ నేతలు స్వామిగౌడ్‌కు వివరించినట్లు తెలిసింది.

గవర్నర్ ప్రసంగాన్ని బహిష్కరించిన బీజేపీ



హైదరాబాద్, మేజర్‌న్యూస్: తెలంగాణ బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభం అయ్యాయి. గవర్నర్ నరసింహన్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తున్నారు. గవర్నర్ ప్రసంగంలో ప్రభుత్వం అన్నీ అబద్దాలనే చెప్పిస్తోందని ప్రతిపక్షాలు సభలో ఆందోళన చేపట్టాయి. ఒక వైపు కాంగ్రెస్ సభ్యులు ఆందోళన కొనసాగిస్తుండగా.. మరోవైపు మధ్యలోనే సభ నుంచి బీజేపీ వాకౌట్ చేసింది. ఈ సందర్భంగా బీజేఎల్పీ నేత జి.కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ చేత చెప్పిస్తోన్న అబద్ధాలను భరించలేకపోతున్నామని, గవర్నర్‌తో గత నాలుగేళ్ళుగా ఇదే ప్రసంగాన్ని ప్రభుత్వం చెప్పిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు, నిరుద్యోగ సమస్యలు గవర్నర్ ప్రసంగంలో లేవని, సీఎం సచివాలయానికి రాకపోవడాన్ని గవర్నర్ ప్రస్తావించలేదని కిషన్‌రెడ్డి అన్నారు. అనంతరం లక్ష్మణ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం గవర్నర్ ద్వారా అబద్ధాలను చెప్పిస్తోందని, టీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో వైఫల్యం చెందిందని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని కేసీఆర్ మాట తప్పారని, ఎస్సీ, ఎస్టీలకు మూడెకరాల భూమి ఇవ్వలేదంటూ ప్రభుత్వంపై ఆయన నిప్పులు చెరిగారు. బీసీ సబ్‌ప్లాన్‌ను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, గవర్నర్ అబద్దాల ప్రసంగాన్ని వినలేకే సభను వాకౌట్ చేశామని లక్ష్మణ్ తెలిపారు.

'టీఆర్ఎస్ విధానాలను సభలో నిలదీస్తాం'



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను సభలో టీడీపీ శాసనసభాపక్షం నిలదీస్తుందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రమణ అన్నారు. టీడీపీ ఎమ్మెల్యేలు ఈరోజు ఉదయం ఎన్టీఆర్ సమాధి వద్ద నివాళులు అర్పించిన అనంతరం శాసనసభ సమావేశాలకు బయలుదేరారు. కర్షకుల కడగండ్లు తీర్చలేని కేసీఆర్ మాయమాటలతో ప్రజలను మోసం చేస్తున్నారని రమణ ఆరోపించారు. ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ...శాసనసభ సమావేశాలను నడపాలనే చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేదన్నారు. ఎన్ని రోజులైనా అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తామని చెప్పిన ప్రభుత్వం గత సమావేశాల్లో బీఏసీ సమావేశం నిర్వహించకుండానే అర్ధాంతరంగా సమావేశాలను వాయిదా వేసిందన్నారు. ఈసారి కూడా అలానే జరుగుతుందని విమర్శించారు.

వైసీపీ అవిశ్వాసం ఓ పెద్ద డ్రామా

కాంగ్రెస్ నేత జేడీ శీలం



గుంటూరు, మేజర్‌న్యూస్ : వైసీపీ అవిశ్వాసం ఓ పెద్ద డ్రామా అని మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత జేడీ శీలం అన్నారు. వైసీపీ అధినేత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై అవిశ్వాసానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో జేడీ శీలం ఈ విధంగా స్పందించారు. ఇంకా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక హోదా పేరుతో జగన్ నాటకాలు కట్టిపెట్టాలని చురకలు అంటించారు. బీజేపీతో చీకటి ఒప్పందాన్ని జగన్ బహిర్గతం చేయాలని దుయ్యబట్టారు. రాష్ట్రానికి హోదా ఎలా సాధిస్తారో జగన్ బహిరంగంగా చెప్పాలని జేడీ శీలం డిమాండ్ చేశారు.



అసెంబ్లీలో ఎవరిపైనా మేము దాడి చేయలేదు : కోమటిరెడ్డి

హైదరాబాద్, మేజర్‌న్యూస్: తాము అసెంబ్లీలో ఎవరిపైనా దాడి చేయలేదని, అధికారపార్టీ సభ్యులే దాడికి పాల్పడ్డారని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. గవర్నర్ ప్రసంగంలో ఉన్న దంతా అసత్యమేనని ఆయన విమర్శించారు. అందుకే గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశామని కోమటిరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వాన్ని ప్రజలు సస్పెండ్ చేసే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు. గవర్నర్ అసెంబ్లీకి రావడమే ఐదు నిముషాలు ఆలస్యంగా వచ్చార న్నారు. ఇదే చివరి బడ్జెట్అని, కనీసం ఈ బడ్జెట్ లోనైనా రైతులకు, నిరుద్యోగులకు, వెనుకబడిన వర్గాలకు మంచి చేస్తారని ఆశించామన్నారు. కానీ గవర్నర్ ప్రసంగం ఓ చిత్తు కాగితంతో సమానమని, 25 నిముషాల్లో బడ్జెట్ ప్రసంగం ముగించారని కోమటిరెడ్డి విరుచుకుపడ్డారు. ఈ ప్రభుత్వానికి ప్రజలపై ప్రేమ లేదని, దానిపై నిరసన తెలపడానికి పోడియం వద్దకు వెళ్లడం ఆనవాయితి అని గుర్తు చేశారు. తమను పోడియం వద్దకు వెళ్లనీయకుండా 50 మంది మార్షల్స్‌ను పెట్టి రౌడీల్లా వ్యవహరించారన్నారు. తనను, రామ్మోహన్‌ను నెట్టి, కొట్టి, కిందపడేశారన్న ఆయన, తన కాళ్లకు గాయాలు అయ్యాయని చెప్పారు. ఆ సందర్భంగానే తాను హెడ ఫోన్ విసిరానని కోమటిరెడ్డి వివరిం చారు. దీనికి కారణం సీఎం కేసీఆర్‌అని, ఆయన నియంతలా పాలిస్తున్నారని కోమటి రెడ్డి విమర్శించారు. ఇది కావాలని చేసిందికాదని అన్నారు. గతంలో ఇదే గవర్నర్‌ను మంత్రి హరీష్‌రావు పిడిగుద్దులు గుద్దారని, అప్పుడు తెలం గాణ సమస్య తీవ్రతను బట్టి అలా జరిగిందన్నారని గుర్తు చేశారు. ఇప్పుడు రైతులు ఆకలి తో అలమ టిస్తున్నారని, వాళ్లకు ఈ ప్రభుత్వం మద్దతు ధర ఇవ్వడం లేదని కోమటిరెడ్డి అన్నారు. రైతులకు మద్దతు ధర పెంచితే కేసీఆర్ అయ్య సొమ్ము ఏమైనా పోతుందా? అని కోమటిరెడ్డి ప్రశ్నించారు. సీఎం ఇవ్వరు గానీ, బయటవాళ్లమీద నిందలు వేస్తారని ఆయన తీవ్ర స్థాయిలో విమర్శించారు.

ఘనంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవాలు

- ప్రజా సంకల్ప యాత్రలో కేక్ కట్‌చేసిన వై.ఎస్. జగన్
- వాడవాడలా రెపరెపలాడిన వైసీపీ జెండాలు
- పార్టీ నేతల స్వచ్ఛంద కార్యక్రమాలు

(ఏపీ–పొలిటికల్‌బ్యూరో) : ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయంగా ఎన్‌టీఆర్ నేతృత్వంలోని తెలుగుదేశం పార్టీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పుట్టుకొస్తే, అదే ప్రభంజనంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పుట్టుకొచ్చింది. ఈ పార్టీ ఏర్పడిన రోజు మార్చి 12వ తేదీ. దీంతో రెండు తెలుగు రాష్ట్రాలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 8వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వైసీపీ కేంద్ర కార్యాయంలో సీనియర్ నేత, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ ఆశయ సాధనకు వైసీపీని స్థాపించడం జరిగిందని, అందుకు అనుగుణంగా కృషి చేద్దామని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రత్యేక హోదాను ఎన్నికల తరువాత పాలకులు మర్చిపోయారని మండిపడ్డారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీని గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇలా రెండు తెలుగు రాష్ట్రాలలో, దేశ రాజధాని ఢిల్లీలోనూ వైసీపీ నేతలు పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు.

ప్రకాశంలో: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా కార్యకర్తలు నిర్వహించిన వేడుకల్లో పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ప్రస్తుతం ఆయన ప్రజాసంకల్పయాత్రలో భాగంగా ప్రకాశం జిల్లా లో పాదయాత్ర చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆయన సోమవారం ఉదయం ఈపురుపాలెంలో భారీ కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు. సరిగ్గా 8 ఏళ్ల క్రితం ఇదే రోజు విలువలతో కూడిన రాజకీయాలను అందించేందుకు మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలను నెరవేర్చేందుకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పురుడు పోసుకుంది. ఆంధ్ర ప్రదేశ్ ప్రజల హక్కుల సాధన కోసం అండగా నిలుస్తూ పోరాడుతూనే రాజన్న రాజ్యాన్ని తిరిగి తెస్తాం అని ఆయన ట్విటర్‌లో పేర్కొన్నారు.

ఢిల్లీలో: వైసీపీ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. ఎంపీలు మేకపాటి రాజమోహన్ రెడ్డి, విజయసాయిరెడ్డి, వరప్రసాద్, మిథున్ రెడ్డి కార్యాలయంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. పార్టీకి బంగారు భవిష్యత్తు ఉంటుందని, పోరాట పటిమ కలిగిన వైఎస్ జగన్ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటారని ఈ సందర్భంగా నేతలు కొనియాడారు.

తూర్పు గోదావరి జిల్లాలో: జిల్లాలో ఘనంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరిగాయి. రాజమండ్రిలో పార్టీ కోఆర్డినేటర్ రౌతు సూర్య ప్రకాశరావు ఆధ్వర్యంలో, రాజోలులో కో ఆర్డినేటర్ బొంతు రాజేశ్వరరావు ఆధ్వర్యంలో, పి.గన్నవరం నియోజకవర్గంలో కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో ఘనంగా పార్టీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు.

అనంతపురం జిల్లాలో: జిల్లాలోని వైసీపీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ



దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ శ్రేణులు వైసీపీ జెండా ఆవిష్కరించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మాజీ ఎంపీ అనంత వెంకట్రామిరెడ్డి, అనంతపురం సమన్వయకర్త నదీం, రాష్ట్ర ప్రధాన కార్య దర్శులు రాగేపరశురాం, కృష్ణప్ప, అనంతపురం,హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గాల సమన్వయకర్త బోయరంగయ్యలు తదితరలు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. వైసీపీలో పనిచేయడం గర్వంగా ఉందని, ప్రజల పక్షాన పోరాడుతున్న ఏకైక పార్టీ వైసీపీ అని అనంత వెంకట్రామి రెడ్డి తెలిపారు. చంద్ర బాబు కుట్రలు, కుతంత్రాలను ధీటుగా ఎదుర్కొన్న నేత వైఎస్ జగన్ అని, ప్రత్యేక హోదా సాధించేవరకూ పోరాటాలు ఆపేది లేదని ఆయన స్పష్టం చేశారు.

కడప జిల్లాలో: పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరించిన కార్యకర్తలు కేక్ కటింగ్ చేసి సంబరాలు చేసుకున్నారు. రాయచోటి కార్యాలయంలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మున్సిపల్ ఛైర్మన్ నసీబున్ ఖానం, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. వేంపల్లిలోని నాలుగు రోడ్ల కూడలిలో పార్టీ నేతలు జెండాను ఆవిష్కరించారు.

కృష్ణా జిల్లాలో: పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేలు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డిలు వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పించి, జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమలో నేతలు పార్థసారధి, ఉదయభాను, మల్లాది విష్ణు, జోగి రమేష్, తోట శ్రీనివాస్, వెల్లంపల్లిలతో పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. వైసీపీ ప్రజల పక్షాన ముందుండి పోరాడుతుందని పార్థసారధి తెలిపారు. జగన్ చేస్తున్న ఉద్యమాలు, కార్యక్రమాలు ఏ ఒక్కరూ చేయలేదని, ప్రజల కోసం నిరంతరం పాటుపడే వ్యక్తి జగన్ అని ఉదయభాను తెలిపారు.

కర్నూలు జిల్లాలో: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరిగాయి. ముఖ్యనేతలు పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ వేడుకల్లో బి.వై.రామయ్య, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, కర్నూల్ అసెంబ్లీ ఇంచార్జ్ హాఫీజ్ ఖాన్, అన్నీ కులసంఘాలు నాయకులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు. దేశంలో విశ్వసనీయత, విలువల పునాదులపై ఏర్పడిన పార్టీ వైసీపీ అని బి.వై.రామయ్య పేర్కొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని తెలిపారు. ప్రజాసంక్షేమం కోసం ప్రతిక్షణం పోరాడుతున్న ఒకే ఒక నాయకుడు జగన్ మోహన్ రెడ్డి మాత్రమే అని ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. ఆత్మకూరులో జరిగిన ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో శిల్ప చక్రపాణి రెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాఖజిల్లాలో: జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 8వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పాడేరు మోద కొండమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏరియా ఆసుపత్రిలో రోగులకు రొట్టె, పాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. భీమిలి అసెంబ్లీ పరిధిలో వాడవాడలా వేడుకలు జరిపారు. పార్టీ నాయకులు అక్కరమాని వెంకటరావు అధ్వర్యంలో జెండా ఆవిష్కరణ, కేక్ కటింగ్, బైక్ ర్యాలీ నిర్వహించారు. పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్ రాయవరం మండలాల్లో ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

చిత్తూరు జిల్లాలో: జిల్లా వ్యాప్తంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగాయి. చంద్రగిరిలో పార్టీ కన్వీనర్ చిలకూరి యుగందర్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. రామచంద్రపురం మండలం సూరావారిపల్లిలో పార్టీ కన్వీనర్ బ్రహ్మనందరెడ్డి ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఎర్రవారిపాళెంలో పార్టీ కన్వీనర్ నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. సంతపేటలోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి పురుషోత్తంరెడ్డి జెండా ఆవిష్కరించారు.

మహబూబ్‌నగర్ జిల్లాలో: జిల్లా కేంద్రంలో వైసీపీ ఆవిర్భావ దినోత్సవం జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు మరియమ్మ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి, పార్టీ జెండాను ఎగరవేశారు.

ఢిల్లీలో వైసీపీ ఆవిర్భావ వేడుకలు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం ఢిల్లీలో ఘనంగా జరిగాయి. ఢిల్లీలోని పార్టీ కార్యాలయంలో వైసీపీ ఎంపీలు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా విజయసాయి రెడ్డి మాట్లాడుతూ దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డిలాగే వైఎస్ జగన్ విశ్వసనీయత కలిగిన నేత అని కొనియాడారు. 2019 ఎన్నికల్లో ప్రజలు తప్పకుండా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎంపీ మిథున్ రెడ్డి మాట్లాడుతూ అనుకున్న లక్ష్యం కోసం వైఎస్ జగన్ దేనికి భయపడకుండా నిరతరం శ్రమిస్తున్నారన్నారు. ప్రజల ఆశీర్వాదంతో జగన్ తప్పకుండా ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు. వైఎస్ జగన్ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటారని, పార్టీకి బంగారు భవిష్యత్తు ఉంటుందని మేకపాటి రాజామోహన్ రెడ్డి అన్నారు. వైసీపీ విలువలు కలిగిన పార్టీ అని, మొదటి నుంచి ప్రత్యేక హోదా కోసం పోరాడుతూనే ఉందని ఎంపీ వరప్రసాద్ అన్నారు.

ప్రజా సంకల్ప యాత్ర 111వ షెడ్యూల్



ఒంగోలు, మేజర్‌న్యూస్ : ప్రజాసమస్యలపై పోరాడుతూ, ప్రభుత్వం అసమర్ధతను ఎండగ డుతూ ప్రతిపక్షనేత, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర ప్రకాశం జిల్లా పూర్తి చేసుకొని గుంటూరు జిల్లాలో ప్రవేశించింది. వై.ఎస్. జగన్‌కు ప్రజలు అడుగడుగునా నీరాజనాలు పలుకుతున్నారు. ఈ మేరకు జననేత పాద యాత్ర, ప్రజాసంకల్పయాత్ర 111వ రోజు షెడ్యూ ల్ ఖరారు అయింది. వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం పాదయాత్ర షెడ్యూల్‌ను విడుదల చేశారు. వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి మంగళవారం ఉదయం బాపట్ల శివారు నుంచి పాదయాత్రను ప్రారంభిస్తారు. అక్కడ నుంచి మూర్తి నగరం మీదుగా కొండుగట్ల పాలెం చేరుకుంటారు. 11 గంటలకు భోజన విరామం తీసుకుంటారు. అనంతరం మధ్యాహ్నం 2.45 గంటలకు పాదయాత్ర తిరిగి ప్రారంభమౌతుంది. అప్పికట్ల, పుండ్లం క్రాస్ మీదుగా ఏతూరు చేరుకొని సాయంత్రం 5.30 గంటలకు పాదయాత్ర ముగిస్తారు.

గవర్నర్ ప్రసంగం నిరాశ కలిగించింది: టీడీపీ



హైదరాబాద్, మేజర్‌న్యూస్: తెలంగాణ శాసనసభలో ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ చేసిన ప్రసంగం తీవ్ర నిరాశ కలిగించిందని తెలంగాణ తెలుగుదేశం పార్టీ విమర్శించింది. కాగా.. తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలు సోమ వారం ప్రారంభమయ్యాయి. గవర్నర్ చేసిన ప్రసంగం నిరాశ కలిగించిందని తెలంగాణ తెలుగు దేశం పార్టీ ఎమ్మెల్యే ర్యాగ కృష్ణయ్య అన్నారు. ఈ మేరకు ఆయన మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. ఉద్యోగాల కల్పన, రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం వంటి హామీల ప్రస్తావనే లేకుండా మొక్కుబడిగా ప్రసంగం సాగిందని ఆయన విమర్శించారు.

అసెంబ్లీ ఘటనపై తీవ్రంగా స్పందించిన అక్బరుద్దీన్



హైదరాబాద్, మేజర్‌న్యూస్: ప్రార్థనా మందిరాల కంటే అసెంబ్లీ తక్కువ కాదని ఎంఐఎం నేత, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ అన్నారు. అసెంబ్లీ ఘటనపై అన్ని పార్టీల నేతలు బీఏసీ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా అక్బరుద్దీన్ మాట్లాడుతూ బాధ్యులను సెషన్ మొత్తం సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. గవర్నరే మా టార్గెట్ అని కోమటిరెడ్డి ఎలా మాట్లాడతారని ఆయన ప్రశ్నించారు. స్పీకర్ ఎలాంటి చర్యలు తీసుకున్నా తాము మద్దతు ఇస్తామని అక్బరుద్దీన్ స్పష్టం చేశారు.

సంపాదకీయం

editpage@suryaa.com

“ వాస్తవానికి అమెరికా, ఉత్తర కొరియా మధ్య చర్చలకు రంగం సిద్ధం కావడమనేది ఒక్క రాత్రిలో చోటు చేసుకున్న పరిణామం కాదు. ఉత్తర కొరియా ప్రత్యక్షంగా కయ్యానికి కాలు దువ్వుతున్న దక్షిణ కొరియా ఇందుకు తెర వెనుక చాలా కృషి చేసింది. కిమ్‌ను దారిలోకి తీసుకువచ్చేందుకు దక్షిణ కొరియా ప్రభుత్వం బాగా శ్రమ పడింది. శీతాకాల ఒలింపిక్స్‌లో ఉత్తర, దక్షిణ కొరియా జట్లు కలసి మార్చిపాస్ట్‌లో పాల్గొన్నాయి. ఆ క్రీడలకు తన సోదరి నేతృత్వంలో ఒక ప్రతినిధివర్గాన్ని పంపారు. ఇక ట్రంప్ ఆ ఒలింపిక్స్ ముగింపు వేడుకలకు తన కుమార్తె ఇవాంకాను పంపారు. అప్పటి నుంచే ఉత్తర కొరియా నుంచి ఈ రాజీ సూచనలు రాసాగాయి. అయితే, వాస్తవ పరిస్థితుల్లో లవలేశమైనా మార్పు రాలేదు. కిమ్‌తో చర్చలకు సిద్ధమేనని ట్రంప్ చెప్పినప్పటికీ, ఉత్తర కొరియాపై అమెరికా ఆంక్షలు కొనసాగనున్నాయి. ఉత్తర కొరియాతో అణ్వస్త్రాలకు స్వస్తి చెప్పించాలన్న తమ లక్ష్యం సాధించేందుకు 'గరిష్ఠ స్థాయిలో ఒత్తిడి' తీసుకువస్తూనే ఉంటామని ట్రంప్ ప్రభుత్వం స్పష్టం చేసింది. అమెరికా, ఉత్తర కొరియా మధ్య ఒప్పందం కుదురుతుందా లేక అసలు చర్చలు జరుగుతాయా అనేది ఊహించి చెప్పడం కష్టమే. ఉభయ దేశాల అధినేతలు ఎటువంటి చంచల స్వభావులో ప్రపంచానికి ఇటీవలి కాలంలో దృగ్గోచరమైంది. ఆ ఇద్దరి మధ్య సమావేశం తలపెట్టిన మే నెలకు ఇంకా ఆరు వారాలకు పైగా వ్యవధి ఉన్నది. ”

ట్రంప్, కిమ్ దౌత్యం ఫలించేనా?

ఈమధ్య కాలం వరకు పరస్పరం తీవ్ర హెచ్చరికలు చేసుకున్న అమెరికా, ఉత్తర కొరియా చర్చల మార్గం పట్టబోతున్నాయి. పరస్పరం చర్చలకు దిగే అవకాశం కూడా లేదని ఉభయ దేశాల అధినేతలు ప్రకటనలు కూడా చేసుకున్నారు. అటువంటిది ఉభయులు మాటల తూటాలకు స్వస్తి పలికి ప్రత్యక్ష సంభాషణలకు సిద్ధం కావడం హర్షణీయం. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్‌తో తాను సమావేశం అవుతానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం 1945 అనంతర ప్రపంచంలో చరిత్రాత్మక పరిణామంగా పరిగణించాలి. అణ్వాయుధాలతో సర్వనాశనం చేస్తామని హెచ్చరికలు జారీ చేసుకున్న అమెరికా, ఉత్తర కొరియా చర్చలకు సుముఖత వ్యక్తం చేయడంతో రెండు దేశాధినేతల మధ్య చర్చలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. గత 70 సంవత్సరాలలో అమెరికా అధ్యక్షుడు ఎవ్వరూ ఉత్తర కొరియా ప్రభుత్వాధినేతలతో సంభాషణలకు సిద్ధం కాలేదు. అమెరికా అధ్యక్షుడుగా ట్రంప్ వ్యవహరిస్తున్న తీరును పరిగణనలోకి తీసుకుంటే ఇటువంటి క్షణం వస్తుందని ఎవ్వరూ ఊహించి ఉండరనాలి. అసలు ట్రంప్ ప్రభుత్వ యంత్రాంగమే ఆయన హఠాత్ ప్రకటనకు దిగ్భ్రాంతి చెందింది. ఎందుకంటే, ఉత్తర కొరియాకు జరుగుతున్న అక్రమ నౌకా రవాణాపై క్రితం నెలలోనే అమెరికా కొత్త ఆంక్షలు ప్రకటించింది. అంతకు కొన్ని వారాలకు ముందు దక్షిణ కొరియాలో శీతాకాల ఒలింపిక్ క్రీడోత్సవాల సమయంలో అమెరికా ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ ఉత్తర కొరియాతో సంబంధాల విషయమై విస్పష్ట ప్రకటన ఒకటి చేశారు. ఉత్తర కొరియాతో సంబంధాలు మెరుగు పడతాయని అమెరికా భావించడం లేదని పెన్స్ స్పష్టం చేశారు. ఇంకా చెప్పాలంటే, క్రితం సంవత్సరం చాలా వరకు ట్రంప్, కిమ్ ట్విటర్‌లో పరస్పరం చాలా దారుణంగా దూషణలు చేసుకున్నారు. కిమ్‌ను 'పొట్టి రాకెట్ మనిషి' అని అమెరికా అధ్యక్షుడు అభివర్ణించారు. ఇక ఉత్తర కొరియా అధ్యక్షుడైతే ట్రంప్‌ను 'మానసిక స్వస్థత లేని అమెరికన్ వృద్ధుడు' అని అవహేళన చేశారు. ఆ మాటల తూటాల పరిస్థితి రాత్రికి రాత్రి మారిపోతుందని ఏ ఒక్కరూ ఊహించలేదు. ప్యాంగ్‌యాంగ్‌కు దక్షిణ కొరియా ప్రతినిధివర్గం వెళ్లడం, ఆ తదుపరి అమెరికాతో ఉత్తర కొరియా చర్చలకు ప్రతిపాదన చేయడం ఆ ప్రాంతంలో ఉద్రిక్తతలు తగ్గించేందుకు ఒక దశాబ్ది కాలంలో పట్టుదలతో జరిగిన ప్రయత్నంగా భావించవచ్చు. ఉత్తర కొరియాతో ఉద్రిక్తతలు కొనసాగుతున్నా, ఆ దేశం, అమెరికా మధ్య రణన్నినాదాలు కొనసాగుతున్నా దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జే ఇన్ నిరుడు వేసవిలో పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత దౌత్య మార్గాలను తెరచే ఉంచారు.

అయితే, వాస్తవానికి అమెరికా, ఉత్తర కొరియా మధ్య చర్చలకు రంగం సిద్ధం కావడమనేది ఒక్క రాత్రిలో చోటు చేసుకున్న పరిణామం కాదు. ఉత్తర కొరియా ప్రత్యక్షంగా కయ్యానికి కాలు దువ్వుతున్న దక్షిణ కొరియా ఇందుకు తెర వెనుక చాలా కృషి చేసింది. కిమ్‌ను దారిలోకి తీసుకువచ్చేందుకు దక్షిణ కొరియా ప్రభుత్వం బాగా శ్రమ పడింది. శీతాకాల ఒలింపిక్స్‌లో ఉత్తర, దక్షిణ కొరియా జట్లు కలసి మార్చిపాస్ట్‌లో పాల్గొన్నాయి. ఆ క్రీడలకు తన సోదరి నేతృత్వంలో ఒక ప్రతినిధివర్గాన్ని పంపారు. ఇక ట్రంప్ ఆ ఒలింపిక్స్ ముగింపు వేడుకలకు తన కుమార్తె ఇవాంకాను పంపారు. అప్పటి నుంచే ఉత్తర కొరియా నుంచి ఈ రాజీ సూచనలు రాసాగాయి. అయితే, వాస్తవ పరిస్థితుల్లో లవలేశమైనా మార్పు రాలేదు. కిమ్‌తో చర్చలకు సిద్ధమేనని ట్రంప్ చెప్పినప్పటికీ, ఉత్తర కొరియాపై అమెరికా ఆంక్షలు కొనసాగనున్నాయి. ఉత్తర కొరియాతో అణ్వస్త్రాలకు స్వస్తి చెప్పించాలన్న తమ లక్ష్యం సాధించేందుకు 'గరిష్ఠ స్థాయిలో ఒత్తిడి' తీసుకువస్తూనే ఉంటామని ట్రంప్ ప్రభుత్వం స్పష్టం చేసింది. అమెరికా, ఉత్తర కొరియా మధ్య ఒప్పందం కుదురుతుందా లేక అసలు చర్చలు జరుగుతాయా అనేది ఊహించి చెప్పడం కష్టమే. ఉభయ దేశాల అధినేతలు ఎటువంటి చంచల స్వభావులో ప్రపంచానికి ఇటీవలి కాలంలో దృగ్గోచరమైంది. ఆ ఇద్దరి మధ్య సమావేశం తలపెట్టిన మే నెలకు ఇంకా ఆరు వారాలకు పైగా వ్యవధి ఉన్నది. ట్రంప్ నిర్ణయం వెనుక ఉద్దేశాలేవో తెలుసుకోవడం తేలికే. అధ్యక్ష పదవికి ఎన్నికల సమయంలో తనకు రష్యా నుంచి పరోక్షంగా మద్దతు లభించిందనే విమర్శలు, ఆ తరువాత రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో సంబంధాలు చెదిరి తనకు ఇబ్బందులు ఎదురైన నేపథ్యంలో వాటి నుంచి ప్రజల దృష్టిని మళ్లించడం ట్రంప్ ఆంతర్యం కావచ్చు. అయితే, అమెరికా, ఉత్తర కొరియా మధ్య చర్చలు సత్ఫలితాన్ని ఇచ్చిన పక్షంలో అమెరికా 45వ అధ్యక్షుడు ఇప్పటి వరకు వ్యవహరించిన తీరును మించి ఆయనను మరింత సకారాత్మకంగా చరిత్ర గుర్తుంచుకోవచ్చు. అలా జరగాలంటే ముందు ట్రంప్ ప్రభుత్వం పూర్వపు నిక్సన్ ప్రభుత్వంలా చర్యలు తీసుకోవాలసిన అవసరం ఉంటుంది. 1972లో చైనాతో శాంతియుత సంబంధాలు నెలకొల్పుకోవడానికి నిక్సన్ ప్రభుత్వం పింగ్ పాంగ్ దౌత్యం నెరపిన సంగతి ఈ సందర్భంగా ప్రస్తావనార్హం. అంతిమ ఫలితం ఎల్లప్పుడూ అనిశ్చితమే అయినా వివాదాల పరిష్కారానికి చర్చలను ఒక మార్గం అనేది ఇంకా కాలం చెల్లని పద్ధతి అని ఈ పరిణామం సూచిస్తోంది. కాగా, ట్రంప్ కూడా తాము జరిపే చర్చల ఫలితం ఎలా ఉంటుందనేది అప్పుడే ఊహించలేమని ఒక సందర్భంలో చెప్పారు. అమెరికాలో రిపబ్లికన్ పార్టీ నేత రిక్ సాకోన్ నిర్వహిస్తున్న ర్యాలీలో పాల్గొన్న ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'కిమ్ జాంగ్ ఉన్‌తో జరిగే సమావేశంలో ఎలాంటి ఒప్పందమూ జరగకపోవచ్చు. లేదా ప్రపంచం మొత్తానికి మేలు జరిగే నిర్ణయం తీసుకోవచ్చు' అని ట్రంప్ పేర్కొన్నారు. కిమ్‌తో చర్చల్లో ఇది జరగవచ్చని ముందుగా ఫలితాన్ని ఊహించలేమని ఆయన అన్నారు. అయితే, ఆ చర్చలు ఎలాంటి ఫలితాన్నీ ఇవ్వని పక్షంలో తాను వెంటనే బయలుదేరి వచ్చేస్తానని ఆయన చెప్పారు. గత నవంబర్ నుంచి ఉత్తర కొరియా ఎలాంటి అణ్వాయుధ పరీక్షలూ నిర్వహించడం లేదని, ఇకపై కూడా వారు ఆ పరీక్షలు నిర్వహించరని ఆశిస్తున్నానని ట్రంప్ తెలిపారు. సరైన వారసత్వాన్ని ఇవ్వాలని ఆకాంక్షించే నేతలు పోరు కన్నా భుజం భుజం కలిపి సాగవలసిన అగత్యం ఉందని ఇప్పటికీ భావిస్తున్నారు.

'పెద్దల సభ' సీట్ల కుస్తీ ముగిసినట్టేనా?

ఎం.వి.ఎస్. సత్య, హైదరాబాద్
833011972

- తెలుగు రాష్ట్రాలలో ఆరు సీట్లన్నీ ఏకగ్రీవమే
- మూడు సీట్లలో బిసిలకు ప్రాధాన్యమిచ్చిన కేసీఆర్
- పోటీకి సిద్ధమైనా వెనక్కి తగ్గిన తెలంగాణ కాంగ్రెస్
- రెండు సీట్లకే అభ్యర్థులను ప్రకటించిన తెలుగుదేశం
- చంద్రబాబు నిర్ణయంతో ఊపిరి పీల్చుకున్న వైఎస్సార్సీ



మొత్తానికి ఇటు తెలంగాణలోనూ అటు ఆంధ్రప్రదేశ్‌లోనూ రాజ్యసభ ఎన్నికకు పార్టీల అభ్యర్థుల ఎంపిక పూర్తి కావటంతో ఖాళీ అయిన స్థానాలకు సరిపడ అభ్యర్థులు మాత్రమే రంగంలో ఉండే అవకాశాలున్నాయి. దీంతో ఎలాంటి ఎన్నికల ప్రక్రియ లేకుండానే అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నిక య్యే అవకాశాలు ఉన్నాయి. తెలంగాణలో ఖాళీ అయిన మూడు సీట్లకు కేసీఆర్ బిసిలకు అగ్రపీఠమేస్తూ ముగ్గురికి చోటు ఇచ్చారు. అయితే ఓ సీటుపై కన్నేసిన కాంగ్రెస్ పార్టీ అవసరమైన మద్దతు కూడగట్టుకుని తన అభ్యర్థిని నిలపాలని చూసింది. ముస్లిం ఓట్లపై దృష్టి పెట్టి మాజీ క్రికెటర్ అజహరుద్దీన్‌ని రంగంలోకి దింపాలని సిద్ధమైనా, చివరి నిమిషంలో స్థానిక ముస్లిం వర్గాలకు ప్రధాన ప్రాతినిధ్యం వహిస్తున్న మజ్లిస్ కూడా తెలంగాణ రాష్ట్రసమితికి జై కొట్టడంతో వెనకడుగు వేసింది. నిజానికి కాంగ్రెస్ పార్టీ నుంచి తెరాసలోకి వెళ్లిపోయిన శాసనసభ్యులను ఇరుకున పెట్టాలన్నది ఆ పార్టీ లక్ష్యం ఎన్నికంటూ జరిగితే విప్ జారీ చేసి, తద్వారా చర్యలకు మరింత పట్టు పట్టేందుకు ఆస్కారం దక్కుతుందని ఆ పార్టీ పెద్దలు భావించినా ఫలితం దక్కకుండా పోయిందన్నది నిజం. ఇక ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు వస్తే, సభలో బలాబలాలను ఆసరా చేసుకుని ఖాళీ అయిన మూడు సీట్లలో రెండు తెలుగుదేశం పార్టీ, ఒకటి విపక్ష వైసిపి దక్కించుకునేందుకు ఆస్కారం ఉంది. ఇటీవల కొంత కాలంగా తెలుగుదేశం పార్టీలోకి పలువురు వైసిపి శాసనసభ్యులు చేరిపోవటంతో మరొక సభ్యుడు ఓటుకు గాలం వేస్తే చాలు మూడో సీటుకు కావాల్సిన బలం రెండో ప్రాధాన్యతా ఓట్లతో ఖచ్చితంగా గెలిపించుకోగలమన్న ధీమా తెలుగుదేశం పార్టీలో కనిపించింది. అయితే ప్రస్తుతం రాష్ట్రంలోని పరిణామాల క్రమంలో అభ్యర్థిని ప్రకటిస్తే మొదటికే మోసం వస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భావించారని అందుకే మూడో అభ్యర్థిని నిలపేందుకు నిరాకరించారని ఆ పార్టీ వర్గాలు చెపుతున్నాయి. అయితే గత కొద్ది రోజుల క్రితం అధికార పార్టీకి చెందిన మంత్రి ఓకరు తమ సభ్యులతో మాట్లాడిన ఓటు బేరాలను రికార్డులు చేసామని, త్వరలోనే వాటిని బైట పెడతామంటూ వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయ సాయి రెడ్డి పదే పదే ప్రకటనలు చేయటంతో పాటు మూడో అభ్యర్థిని నిలబెటడం ద్వారా బేరసారాలు చేయడానికి చంద్రబాబు తెరలేపారంటూ చేస్తున్న ఆరోపణల పరంపరని జనం నమ్మేందుకు ఆస్కారం ఉందని వెనక్కి తగ్గినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికే వైసిపి తన పార్టీ శాసనసభ్యులందరినీ ప్రత్యేక హోదా ధర్నా పేరుతో ఢిల్లీ తీసుకు వెళ్లి, అడక్క నుంచి నేపాల్, భూటాన్ తదితర దేశాలకు విహార యాత్రలకి పంపేసింది ఆపార్టీ. అయితే చంద్రబాబునాడు చివరి వరకు అభ్యర్థుల విషయంపై పూర్తి స్థాయిలో కసరత్తులు చేసి రెండు సీట్లకే పోటీ చేస్తున్నామని, మూడో సీటు పోటీ లేనే లేదని స్పష్టం చేయటంతో వైసిపి వర్గాలు ఊపిరి పీల్చుకున్నాయి. అయితే చంద్రబాబు నాయుడు గతంలోలా తమ పార్టీ శాసనసభ్యులను కొల్లగొట్టేందుకు యత్నిస్తే, టిట్ ఫర్ టాట్ లాగా తాము కూడా అదే పని చేసి బుద్ధి చెప్పడానికి వైయస్సార్ కాంగ్రెసు సిద్ధపడినట్లు సమాచారం. వైయస్సార్ కాంగ్రెసుకు చెందిన శాసనసభ్యులు జారిపోతారనుకుంటే తాను తెలుగుదేశం పార్టీలోని కొందరు ఎమ్మెల్యేలకు ఎర వేసినట్లు అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి భరోసాతో ఉన్నట్లు చంద్రబాబుకు స్పష్టమైన సమాచారం అందిన నేపథ్యంలోనే ఆ జోలికి వెళ్లకుండా మిన్నకుండిపోయారని... అని పార్టీ వర్గాలలో విస్తృతంగా చర్చ జరుగుతోంది.అయితే రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాల దృష్ట్యా తెలుగుదేశం పార్టీ ఖచ్చితమైన నిర్ణయం తీసుకుందని, రాజ్యసభ సీటు అవతలి పార్టీకి పోనివ్వ కుండా చేయడం వల్ల అధికార పార్టీకి ఒరిగేదేమీ లేదు. ప్రతిపక్ష పార్టీకి అధికం గా చేకూరేదీ కూడా గణనీయంగా ఏమిలేదు కనుకనే మూడో స్థానంలో పోటీకి దిగలేదన్నది తెలుగుదేశం పార్టీ వర్గాలలో చర్చ జరుగుతోంది. మూడో సీటుకు ఓ వేళ పోటీ చేస్తే, దానిని ఆసరాగా తీసుకుని జగన్ తనదైన తప్పుడు ప్రచారం ప్రారంభించే ఆస్కారం ఉందని, దీని వల్ల పార్టీపై చెడు సంకేతాలు పంపేందుకు అవకాశం ఇవ్వటం అనవసరమైందిగా అభ్యర్థుల చర్చలలో సిఎం చంద్రబాబు వెల్లడించిన అభిప్రాయంపై అంతా తమ అమోదం తెలియజేసినట్లు తెలియవచ్చింది. ఆ విధంగా.. అంతా సవ్యంగా.. రాజ్యసభ ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిసే పరిస్థితి ఏర్పడటంతో జగన్ తన పాదయాత్రని నిశ్చింతగా కొనసాగించుకునేందుకు ఆస్కారం ఏర్పడుతుంది. అసెంబ్లీకి వెళ్లకూడదన్న తన భీషణ ప్రతిజ్ఞను కొనసాగించినట్లు అవుతుందని సామాజిక మీడియాలో సెటైర్లు వినిపిస్తున్నాయి.

కరీంనగర్ సెంటిమెంట్ కేసీఆర్‌కు కలసి వచ్చేనా?

గుర్రంపల్లి మాణిక్యప్రభు
'సూర్య' తెలంగాణ బ్యూరో ఇంచార్జీ

- పార్లమెంటుకు అక్కడి నుంచే పోటీకి నిర్ణయం
- ఇక పూర్తి స్థాయిలో జాతీయ రాజకీయాలపైనే దృష్టి
- రాష్ట్రాలకు మరిన్ని అధికారాలే లక్ష్యంగా ముందుకు
- పేరుకు తృతీయమే అయినా మేమే ప్రథమమన్న కేసీఆర్
- రెట్టించిన ఉత్సాహంతో కదంతొక్కుతున్న గులాబీ దళం



గులాబిదళపతి, ఉద్యమ నాయకుడు కేసీఆర్‌కు కరీంనగర్ జిల్లా అంటే ఇష్టం. ఆయనకు ఈ జిల్లా సెంటిమెంట్ జిల్లా అని చెబుతారు. జాతీయ రాజకీయాలలో క్రియాశీల పాత్ర పోషించేందుకు సమాయత్తమ వుతు న్న కేసీఆర్.. సెంటిమెంట్ గడ్డ కరీంనగర్ నుంచే భవిష్యత్ జాతీయ రాజకీయ వ్యవహారాలకు శ్రీకారం చుట్టేందుకు సమాలోచనలు చేస్తున్నట్లు సమాచారం. ఉద్యమం మొదలు అధికారం చేపట్టే వరకు అన్ని రకాలుగా కలిసొచ్చిన జిల్లాగా ఆయన కరీంనగర్ ఎంపీ స్థానం నుంచి పోటీ చేసేందుకు మళ్లీ దృష్టి పెట్టినట్లు పార్టీ నేతలు గుసగుసలాడుకుంటున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఆయన కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసే అవకాశం ఉందని పార్టీ సీనియర్ నేతలు పేర్కొంటున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాకు చెందిన మం త్రులు, ప్రజాప్రతినిధులు కేసీఆర్‌ను కరీంనగర్ నుంచి పోటీ చేయాలని కోరిన ట్లు కూడా పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఉద్యమ పార్టీగా బలంగా ఎదిగిన టీఆర్ఎస్ 2004లో కాంగ్రెస్ పార్టీ అలయెన్స్‌తో ఎన్నికల బరిలోకి దిగింది. పొత్తుల్లో భాగంగా టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మొదటిసారి కరీంనగర్ లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి సీహెచ్ విద్యాసాగర్‌రావుపై పోటీకి దిగారు. ఆ ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు 4,51,199 ఓట్లు రాగా, సాగర్‌జీకి 3,20,031 ఓట్లు వచ్చాయి. 1,31,168 ఓట్ల ఆధిక్యతతో గెలిచిన కేసీఆర్ కేంద్ర కార్మికశాఖ మంత్రిగా కేబినేట్‌లో చేరారు. ఆ తర్వాత 2006లో జరిగిన కరీంనగర్ పార్లమెంట్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి టీ.జీవన్‌రెడ్డి ప్రత్యర్థి కాగా, టీఆర్ఎస్ అభ్యర్థిగా కేసీఆర్ 2,01,582 ఓట్ల ఆధిక్యం సాధించారు. తెలంగాణ ఉద్యమంలో భాగంగా రాజీనామాల నేపథ్యంలో మరోసారి 2008లో ఉప ఎన్నికలు వచ్చాయి. ఈ ఎన్నికల్లో కేసీఆర్‌కు 15,765 స్వల్ప ఆధిక్యత వచ్చింది. కేసీఆర్‌కు 2,69,452 ఓట్లు రాగా, కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన టి. జీవన్‌రెడ్డికి 2,53,687 ఓట్లు వచ్చాయి. దీంతో మనస్థాపానికి గురైన కేసీఆర్ 2009 మహబూబ్‌నగర్ నుంచి ఎంపీగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి దేవరకొండ విఠల్‌రావుపై 20,184 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత వచ్చిన 2014 సార్వత్రిక ఎన్నికల్లో మెదక్ ఎంపీగా, గజ్వేల్ ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన సీఎంగా ఎన్నికై మెదక్ ఎంపీ స్థానానికి రాజీనామా చేశారు. అనంతరం వచ్చిన ఉప ఎన్నికలో కొత్త ప్రభాకర్‌రెడ్డి ఎన్నికయ్యారు. అయితే.. ఇటీవలి రాజకీయ పరిణామాలు నేపథ్యంలో జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పాలని చూస్తున్న కేసీఆర్ ఈ మేరకు ఐదు రోజుల కిందట స్వయంగా ప్రకటన చేశారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ కేడర్ ప్రగతిభవన్‌కు వెళ్లి ఆయనను అభినందించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి కూడా తరలిన నేతలు మళ్లీ కరీంనగర్ నుంచి ఎంపీగా పోటీ చేయాలని కేసీఆర్‌ను కోరడం.. ఆయన సమాలోచనల చేస్తుండటం చర్చనీయాంశంగా మారింది.

టీఆర్ఎస్ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు జాతీయ రాజకీయాలపై దృష్టి సారించడంపై పార్టీ కేడర్‌లో రెట్టింపు ఉత్సాహం కనిపిస్తోంది. ఇదే సమయంలో 2019 సార్వత్రిక ఎన్నికల్లో కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారని పార్టీ వర్గాల్లో జరుగుతున్న ప్రచారం కూడా ఇందుకు తోడవుతోంది. వాస్తవానికి మహబూబ్‌నగర్ ఎన్నికల్లో సైతం పెద్దగా మెజార్టీ రాని సందర్భంలో 2014లో ఎంపీ, ఎమ్మెల్యేగా పోటీ చేయాలనుకున్న ఆయన తిరిగి కరీంనగర్‌నే ఎంచుకుంటారన్న ప్రచారం జరిగింది. అయితే.. చివరి నిమిషంలో కరీంనగర్ ఎంపీ అభ్యర్థిగా వరంగల్ జిల్లాకు చెందిన బోయినపల్లి వినోద్‌కుమార్‌ను రంగంలోకి దింపిన కేసీఆర్ ఎమ్మెల్యేగా ఉమ్మడి మెదక్ జిల్లా గజ్వేల్ నుంచి, ఎంపీగా మెదక్ నుంచి పోటీ చేశారు. ఇప్పుడు తాజాగా కరీంనగర్ లోక్‌సభా స్థానం నుంచి పోటీ చేయడం వల్ల పార్టీకి బహుళ ప్రయోజనాలు ఉంటాయన్న యోచనతో కేసీఆర్‌ను ఆహ్వానించడం చర్చకు తెరలేపింది. కేసీఆర్ ఎంపీగా కరీంనగర్ నుంచి బరిలోకి దిగితే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్‌లో 13 నియోజకవర్గాలపై ప్రభావం ఉంటుందని, దీంతో అన్నింట్లో టీఆర్ఎస్ అభ్యర్థులు గెలుస్తారని జిల్లా నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

రాజీ'డ్రామా'ల హోదా ఉద్యమం

ఆంధ్ర ప్రదేశ్ రాజకీయాలలో రాజీనామాలు అనేది సర్వసాధారణమైన విషయం. 2014 ఎన్నికల సమయంలో సమైక్యఉద్యమం ఉధృతంగా సాగు తున్న నేపథ్యంలో సీమాంధ్ర కాంగ్రెస్ నేతలు మూకుమ్మడి రాజీనామాలుచేసి తన తప్పిదాలను ఇతర పార్టీల పై నెట్టి రాష్ట్రంలో తన ఉనికిని కాపాడుకునేందుకు చేసిన ప్రయత్నాలన్ని ప్రజలఆగ్రహం ముందు విఫలం అయ్యాయి.

ఇవాళ ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాడు ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రకటిం చిన వాగ్దానాలు అమలు చేయడంలో విఫలం అయ్యాయనే భావన ప్రజల్లో బలంగా ఉంది .రాష్ట్ర విభజన లో ద్వంద్వ వైఖరి అవలంబించిన తెలుగుదేశం పార్టీ కఠిన పరిస్థితులు ఎదుర్కొన్నా అనంతర రాజకీయపరిణామాలు, కాంగ్రెస్‌పై వ్యతిరేకత, చంద్రబాబు అనుభవం కలగలిసి అధికారంలోకి వచ్చేందుకు దోహదం చేశాయి. కానీ ప్రత్యేక హోదాపై తెలుగు దేశం ద్వంద్వ వైఖరి ఆ పార్టీ కి తీవ్ర నష్టం కలగజేసెలా ఉంది. ఒకసారి ప్రత్యేకప్యాకేజి సరిపోతుందని, మరొకసారి ప్రత్యేక హోదాఅని చెప్పడం ప్రజల్లో వ్యతిరేకతనుకూడగట్టుకుం ది.ఈ సమస్య తెలుగుదేశం పార్టీకి మాత్రమే క్లిష్టమైనది. ఎందుకంటే, బి. జె. పి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చే అవకాశంలేనందున ప్రత్యేక హోదా ఉద్య మం యొక్క ప్రభావం ఆ పార్టీ పైన ఉండదు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రత్యేక హోదాఇచ్చేది లేదు అని స్పష్టం చేసిన నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటుంది.ఒకవైపు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ కేంద్ర మంత్రి వర్గం నుండి బయటకు వచ్చినా, రాజ కీయ పరిసితుల దృష్ట్యా తెలుగు దేశం బి. జె. పి. కూటమి నుంచి బయటకు వచ్చే అవకాశం లేదు. ఈరాజీనామాలను ప్రజలు ఎంత మాత్రం విశ్వసిస్తారు అనేది ప్రశ్న.ప్రతిపక్ష పార్టీ అయిన వైఎస్ఆర్ సీపీ నాడు సమైక్య ఉద్యమంను సమర్థించి, నేడు ప్రత్యేక హోదా ఉద్యమం నడువుతూ వెళ్తోంది. ఒక అడుగు ముందుకేసి కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాసం పెడతామని, అంతే కాకుండాచివరి అస్త్రంగా తన ఎం.పిలతో రాజీనామాలు చేయిస్తానని రాష్ట ప్రభుత్వం పై ఒత్తిడి పెంచి, ఒక వైపు పాదయాత్ర మరో వైపు తన పార్టీ సభ్యులతో పార్లమెంటు ఎదటు ప్రత్యేక హోదా ఉద్యమం నడిస్తోంది. అయితే ప్రధాని మోడీపై నమ్మకం ఉందని చెపుతూ, ఆ ప్రభుత్వంపై అవిశ్వాసం పెడితే ఎవరు సమర్ధిస్తారో, అస లు స్పీకర్ అనుమతిస్తారో లేదో చూడాలి. ఇక, పదవి కోసం కాదు ప్రశ్ని స్తాను అనే నినాదంతో కొత్తగా వచ్చిన జనసేన పార్టీ సంస్థాగత నిర్మాణం లేక పోవ డంమరియు తొందర పాటు చర్యల వలన నాడు బీజేపీ-టి.డి.పి కూట ముల తరువున ప్రచారం చేసి నేడు హామీలను అమలుచేయని ప్రభుత్వాలను ప్రశ్నిం చాల్సిందిపోయి వాటిని అమలు చేశారో లేదో తెలుసుకోవడం కోసం కమిటీ లు, మీటింగులపేరుతో కాలయాపన రాజకీయాలతో జనం పట్టించుకుంటారా అన్నదే ప్రశ్న.మొత్తానికి పాలక పక్షం, ప్రతిపక్షం రాజీనామాలతో ఆంధ్ర ప్రదే శ్ రాజకీయాలు సంవత్సరం ముందుగానే ఎన్నికలహడావుడిని ప్రారంభమై నట్టే కనిపిస్తోంది.

– దండు చిన్నా, హైదరాబాద్, 7989670811.

నష్టమనుకున్నా బాబుకు లాభమైంది

ఒక తలుపు మూసుకుంటే మరో తలుపు తెరుచుకుంటుంది' అన్నది పెద్దల మాట. ఒక పని చేయడంవల్ల నష్టం జరిగిందని కొందరు అనుకుంటే, అదే పనివల్ల మరో లాభం కలగుతుందన్నది ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచన. బిజెపికి బై కొట్టిన తెలుగుదేశం పార్టీకి ఇలాంటి లాభమే కలగబోతోందా? అవుననే అంటున్నాయి ఆ పార్టీ వర్గాలు. విభజిత ఆంధ్రప్రదేశ్‌ని అన్ని విదాలా ఆదుకుంటాయని తిరుపతి వెంకన్న సాక్షిగా భీషణ ప్రతిజ్ఞలు చేసిన ప్రధాని మోడీ. ఆ దేవదేవుని చెంత ఇచ్చిన మాటకు విలువలేకుండా చేయటంతో పాటు హోదా కాదు సరికదా చివరికి ప్రకటించిన ప్యాకేజీకూడా ఇచ్చే పరిస్థితి లేకపోవటంతో పాటు ప్రజలలోనూ హోదా, అభివృద్ధి అంశాలపై చర్చ జరుగుతు చివరికి తెలుగుదేశం మెడకు చుటుకోవటం ప్రారంభించేసరి తప్పని సరి పరిస్థితిలో ఎన్‌డీఏలోనే కొనసాగుతునే కేంద్రంలో మంత్రులతో రాజీనామాలు చేయించింది. ఈ పరిణామం వల్ల రాష్ట్రం ఎంతవరకు నష్టపోతుందనే విషయం అలా ఉంచితే, రాజకీయ కోణంలో చూస్తే ఎన్నికలనాటికి దేశంపార్టీ ఎన్‌డీఏలో నుంచి బైట పడితే ఎన్నికల్లో మరింత ప్రయోజనం కలగే అవకాశముందని విశ్లేషకులు చెప్తున్నారు. రాష్ట్ర మంత్రి వర్గం నుంచి బీజేపీ మంత్రులు వెళ్లిపోవటంతో బీజేపీ అడ్డు యాభై శాతం తొలగింది కాబట్టి ఇంతకాలం దూరమైన కొన్ని సామాజికవర్గాలు, ముస్లిం మైనారిటీలు టీడీపీకి దగ్గరయ్యే అవకాశం ఉందని, వారిని సంతృప్తిపరిచేందుకు బాబు పదవులు ఇవ్వాలని ఆలోచిస్తున్నారని సమాచారం. బీజేపీతో చెలిమి కారణంగానే ఏపీ మంత్రి వర్గంలో ముస్లింలకు స్థానం ఇవ్వదంటూ సహజంగానే ముస్లింలు ఆగ్రహంగా ఉన్నారు. ఈ పరిస్థితి వైకాపా క్యాష్ చేసుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఇప్పుడు దీన్ని మార్చుకునేందుకు టీడీపీకి అవకాశం దొరికింది. రాజ్యసభకు ఎంపికైన ఇద్దరు అభ్యర్థులూ అగ్రవర్ణాలవారే కావటంతో గాలి ముద్దుకృష్ణమనాయుడు మరణంతో ఖాళీ అయిన ఎమ్మెల్సీ పోస్టును బీజేపీ మంత్రుల స్థానంలో ఇద్దరిని తిరుమల తిరుపతి దేవస్థానాల ఛైర్మన్ పదవుల నియామకంలో ముస్లింలకు, బీసీ, ఎస్సీలకు ప్రాధాన్యం ఇవ్వాలని బాబు అనుకుంటున్నారు. ఏం జరగనుందో చూడాలి

– వైశ్యరాజు జగదీశ్, పాలకొండ, శ్రీకాకుళం జిల్లా.

మీ లేఖలు, వ్యాసాలు పంపవలసిన చిరునామా
Editor, Surya, Surya Soudha, Plot.No.185,
MCH no. 258/1/185, Siddi vinayk nagar,
Opp:Hi-Tech City, Hyd-57
Mail: e d i t p e @ y a a .

చరిత్రలో ఈరోజు

మార్చి 13

జననాలు
1733: జోసెఫ్ ప్రీస్ట్‌లీ, ఆక్సిజన్ ను కనిపెట్టిన శాస్త్రవేత్త
1854: కోలాచలం శ్రీనివాసరావు న్యాయవాది.
1911: శ్రీనివాస చక్రవర్తి, అభ్యుదయ రచయిత, నాటక విమర్శకులు
1937: వల్లంపాటి వెంకటసుబ్బయ్య, ప్రముఖ సాహితీ విమర్శకుడు
మరణాలు
1901: అమెరికా మాజీ అధ్యక్షుడు బెంజమిన్ హారిసన్.
1955: నేపాల్ రాజుగా పనిచేసిన త్రిభువన్.
1973: ముహమ్మద్ గులాం మొహియుద్దీన్ భారత విభజన సందర్భంగా విజయవాడలో ఏర్పడిన మతవైషమ్యాల నివారణకు నడుం కట్టారు

వల్లంపాటి వెంకటసుబ్బయ్య


వల్లంపాటి వెంకటసుబ్బయ్య (మార్చి 15, 1937– జనవరి 2, 2007) ప్రముఖ సాహితీ విమర్శకుడు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత. వల్లంపాటి 1937, మార్చి 15 న చిత్తూరు జిల్లా రొంపిచర్ల లో జన్మించాడు. పరిష్కారం, మిథ్య మొదలైన కథానికలు 40 దాకా ప్రచురించాడు. ఆయన రాసిన ఇంద్రధనస్సు, దూర తీరాలు నవలలు ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో బహుమతులు పొందాయి. వల్లంపాటి సాహితీ విమర్శకుడిగా సుప్రసిద్ధుడు. ఆయన రాసిన కథా శిల్పం, నవలాశిల్పం, విమర్శా శిల్పం పుస్తకాలు తెలుగు సాహిత్య విమర్శకు ప్రామాణికాలు. తస్లీమా నస్రీన్ రచించిన లజ్జ, బ్రిటిష్ రచయిత ఇ.హెచ్.కార్ రచించిన చరిత్ర అంటే ఏమిటి...? ఆయన చేసిన అనువాద రచనలలో కొన్ని. కథాశిల్పం రచనకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది.

కోలాచలం శ్రీనివాసరావు



కోలాచలం శ్రీనివాసరావు (మార్చి 13, 1854– జూన్ 20, 1919) బళ్ళారికి చెందిన సుప్రసిద్ధ నాటక రచయిత మరియు న్యాయవాది. రామరాజు చరిత్రము ఆయన ప్రముఖ రచన. శ్రీనివాసరావు మల్లినాథసూరి వంశీయుడు. ఇతడి పూర్వీకులు విజయనగర సంస్థాన పండితులు. బళ్లారిలో సుమనోరమసభ అనే నాటకసమాజాన్ని స్థాపించాడు. ఆయన రాసిన రామరాజుచరిత్ర చారిత్రక రచన. తళ్ళికోట యుద్ధంలో కీర్తిశేషుడైన రామరాజుకథ ఇందులో వర్ణించబడుతుంది. అలాగే మైసూరు రాజ్యము, ప్రతాపాక్బరీయము కూడా చారిత్రక రచనలే. ప్రపంచ నాటకచరిత్ర అనే గ్రంథాన్ని ఆంగ్ల భాషలో రాశారు. తెలుగులో వీరు సునందినీ పరిణయము, సుఖమంజరీ పరిణయము మొదలైన నాటకాలు రాశాడు. తెలుగులో మొదటి చారిత్రక నాటకం రాసింది కూడా ఆయనే.

ప్రీస్ట్‌లీ



జోసెఫ్ ప్రీస్ట్‌లీ (మార్చి 13, 1733 ఫిబ్రవరి 6, 1804) 18వ శతాబ్దానికి చెందిన ఆంగ్ల శాస్త్రవేత్త, తత్వవేత్త, రాజనీతిజ్ఞుడు. వాతావరణంలో సహజంగా కొద్దిగా మాత్రమే లభించే ఆక్సిజన్ ను ప్రయోగశాలలో కృత్రిమంగా తయారు చేసే విధానాన్ని కనుగొన్నది ఈయనే. కార్బన్ దయాక్సైడును కృత్రిమంగా చేయడాన్ని కనిపెట్టింది కూడా ఈయనే. ఇవే కాదు కార్బన్ మోనాక్సైడు, నైట్రస్ ఆక్సైడు (లాఫింగ్ గ్యాస్)లను కూడా ఈయనే ఆవిష్కరించారు. ఇవన్నీ వేర్వేరు సందర్భాలలో ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఇంగ్లండ్‌లోని లీడ్స్ నగరానికి దగ్గర్లోని ఓ గ్రామంలో 1733 మార్చి 13న పుట్టిన జోసెఫ్ ప్రీస్ట్‌లీ ఏడాదికే తల్లిని, ఏడేళ్లకల్లా తండ్రిని కోల్పోయి అనాథయ్యాడు. మేనత్త దగ్గర పెరుగుతూ ఫ్రెంచ్, ఇటాలియన్, జర్మన్, అరబిక్ భాషలపై పట్టు సాధిం చాడు. ప్రఖ్యాత శాస్త్రవేత్త బెంజిమెన్ ఫ్రాంక్లిన్ ఇంగ్లండు పర్యటనతో స్ఫూర్తి పొంది విద్యుత్‌పై అధ్యయనం చేసి 'హిస్టరీ అండ్ ప్రెజెంట్ స్టేట్ ఆఫ్ ఎలక్ట్రిసిటీ' గ్రంథాన్ని రాయడం విశేషం. ఇందుకు గుర్తింపుగా రాయల్ సొసైటీ ఫెలోగా ఎంపికయ్యారు. జీవితకాలంలో ఆయన మొత్తం 150 పుస్తకాలు రాశారు



ఏఐకి కేంద్రం బకాయి రూ. 325 కోట్లు

న్యూఢిల్లీ: భారీ అప్పుల్లో కూరుకుపోయిన ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిరిండియాకు కేంద్ర ప్రభుత్వం వందల కోట్లలో బకాయిలు పడినట్లు వెలుగులోకి వచ్చింది. వీవీఐపీ ఛార్టెడ్ విమానాలకుగానూ కేంద్రం రూ. 325కోట్లకు పైనే ఎయిరిండియాకు చెల్లించాలట. ఈ మేరకు సమాచారహక్కు చట్టం ద్వారా ఈ విషయాలు బహిర్గతమయ్యాయి. ఎయిరిండియాకు రావాల్సిన మొత్తంపై వివరాలు తెలియజేయాలంటూ సమాచారహక్కు చట్టం ద్వారా దరఖాస్తు నమోదైంది. దీంతో సంబంధిత అధికారులు ఈ వివరాలను దరఖాస్తుదారుడికిచ్చిన సమాధానంలో పేర్కొన్నారు. దీని ప్రకారం.. పలు మంత్రిత్వ శాఖల నుంచి వందల కోట్ల రూపాయలు ఎయిరిండియాకు రావాలి. జనవరి 31, 2018 నాటికి విమానయాన సంస్థకు రూ. 325.81కోట్ల పెండింగ్ బిల్లులున్నాయి. ఇందులో రూ. 84.01కోట్లు గతేడాది ప్రయాణాలకు సంబంధించిన బిల్లులు కాగా.. మిగతా మొత్తం ఈ ఏడాదికి చెందినవే. ఇవన్నీ వీవీఐపీ ఛార్టెట్ విమానాలకు సంబంధించినవి. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి తదితరులు విదేశాలకు వెళ్లినప్పుడు ఎయిరిండియా ఈ ఛార్టెడ్ విమానాలను అందజేస్తుంది. ఇందుకోసం రక్షణశాఖ, విదేశీ వ్యవహారాల శాఖ, ప్రధానమంత్రి కార్యాలయం, కేబినెట్ సెక్రటేరియట్ ఖజానాల నుంచి ఎయిరిండియాకు చెల్లిస్తారు. గతేడాది వీవీఐపీ ప్రయాణాలకు సంబంధించి కేంద్రం ఎయిరిండియాకు ఇంకా రూ. 451.71కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉంది.

యునిటెక్ ఆస్తులను వేలం వేయిస్తాం


● కస్టమర్లను మీరు మోసం చేశారు ● ఆస్తులు వేలం వేయాల్సిందే
● యునిటెక్ లిమిటెడ్‌పై సుప్రీం కోర్టు వ్యాఖ్యలు
● 2జీ కేసులో కేంద్రానికి సుప్రీం మొట్టికాయలు ● దర్యాప్తు ముగింపుకు ఆరు నెలల గడువు ● 2జీ కేసుల దర్యాప్తు నత్తనడకన సాగుతోందని సుప్రీం ధర్మాసనం సీరియస్ ఆరు నెలల్లో పూర్తి చేయాలని సీబీఐ, ఈడీలకు హుకుం
● రెండు వారాల్లోగా స్టేటస్ నివేదిక సమర్పించాలని కేంద్రానికి ఆదేశం



న్యూఢిల్లీ: రియల్ ఎస్టేట్ సంస్థ యునిటెక్ లిమిటెడ్‌పై సుప్రీంకోర్టు మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది. గృహ కొనుగోలుదారులను యునిటెక్ మోసం చేసిందని.. వారి డబ్బులను రీఫండ్ చేయాలంటే సంస్థ ఆస్తులను వేలం వేయాలని స్పష్టం చేసింది. కొనుగోలుదారుల నుంచి డబ్బులు తీసుకుని, వారికి సరైన సమయంలో ఇళ్లను నిర్మించి ఇవ్వలేదన్న ఆరోపణలతో యునిటెక్ లిమిటెడ్‌పై పలు కేసులు నమోదయ్యాయి. దీనిపై సర్వోన్నత న్యాయస్థానం నేడు విచారణ చేపట్టింది. కొనుగోలుదారుల డబ్బులు తిరిగి చెల్లించేందుకు గాను యునిటెక్ ఆస్తులను వేలం వేయాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. కంపెనీ డైరెక్టర్ల వ్యక్తిగత ఆస్తులు సహా సంస్థ ఆస్తులను గుర్తించి వాటిని వేలం వేయాలని పేర్కొంది. అయితే ఆ ఆస్తులు ఎలాంటి వివాదాల్లో చిక్కుకుని ఉండరాదని స్పష్టం చేసింది. ఆస్తుల వివరాలను ఇవ్వాల్సిందిగా యునిటెక్ సంస్థనూ ఆదేశించింది. ఇప్పటికే వీటికి సంబంధించిన వివరాలను సమర్పించినా అవి అసంపూర్ణంగా ఉన్నాయనీ, పూర్తి జాబితాను ఇవ్వాలనీ సూచించింది. విచారణ సమయంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్‌మిశ్రా మాట్లాడుతూ..ఇళ్లు కొనుక్కోవాలనుకున్న వారిని మీరు మోసం చేశారు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై తదుపరి విచారణను న్యాయస్థానం మార్చి 26కు వాయిదా వేసింది. ఈ కేసులో ఇప్పటికే కంపెనీ ఎండీ సంజయ్ చంద్రాను పోలీసులు అరెస్టు చేశారు.

కాగా, దేశవ్యాప్తంగా సంచలనం రేపిన 2జీ స్పెక్ట్రమ్ కుంభకోణానికి సంబంధించిన కేసుల దర్యాప్తులో జాప్యానికి కేంద్రంపై సుప్రీంకోర్టు ఈ రోజు సీరియస్ అయింది. దర్యాప్తును ఆరు నెలల్లోగా పూర్తి చేయాలని సీబీఐ, ఈడీలను ఆదేశించింది. ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ ఒప్పందం సహా 2జీ స్పెక్ట్రమ్ కుంభకోణంతో పాటు దానికి సంబంధించిన కేసుల దర్యాప్తు తాలూకూ పురోగతి (స్టేటస్) నివేదికను రెండు వారాల్లోగా సమర్పించాలని అరుణ్ మిశ్రా, నవీన్ సిన్హాలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. 2 జీ కేసుల దర్యాప్తు నత్తనడకన సాగుతోందని బెంచ్ అభిప్రాయపడింది. ఇలాంటి సున్నితమైన అంశాల్లో దేశ ప్రజలను మభ్యపెట్టడాన్ని తీవ్రంగా పరిగణించింది. మరోవైపు 2014లో ఈ కేసులో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా తాను నియమించిన సీనియర్ న్యాయవాది ఆనంద్ గ్రోవర్‌ని కూడా ఆ బాధ్యత నుంచి తప్పించింది. ఆయన స్థానంలో కేంద్రం సిఫారసు చేసిన అడిషినల్ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా నియామకానికి అంగీకరించింది.

4 నెలల కనిష్ఠానికి రిటైల్ ద్రవ్యోల్బణం



న్యూఢిల్లీ: గడచిన 2018 జనవరిలో పారిశ్రామికాభివృద్ధి రేటు గరిష్టంగా 7.5శాతంగా నమోదుకాగా, అంతకుముందు ఏడాదిలో అది 3.5శాతంగా నమోదైంది. ముఖ్యంగా వినియోగితా వస్తువులు, క్యాపిటల్ గూడ్స్ ఉత్పత్తి మంచి ప్రతిఫలాలను కనబరిచింది. ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ సూచీ(ఐఐపీ) డిసెంబరు 2017లో 7.1శాతం వృద్ధి రేటును చూపించిందని సెంట్రల్ స్టాటస్టిక్స్ ఆఫీస్(సీఎస్ఓ) విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. ఈఏడాది జనవరిలో ఉత్పత్తిరంగానికి సంబంధించిన ఐఐపీ గ్రోత్ ఈ సూచీ ప్రకారం 77.63శాతం వద్ద స్థిరంగా నమోదైంది. ఇది 2017 జనవరిలో పోల్చి చూస్తే అప్పుడు 2.5శాతంగా నమోదుకాగా, తాజాగా 8.7శాతంగా నమోదైంది. ఇక రిటైల్ ద్రవ్యోల్బణం విషయానికొస్తే ఇంధన ధరలు, ఆహార ఉత్పతుల ధరల తగ్గుదలతో గడచిన ఫిబ్రవరిలో 4 నెలల కనిష్టానికి 4.44శాతంగా నమోదైంది. కన్స్యూమర్ ప్రైజ్ ఇండెక్స్(సీపీఐ)ని ఆధారంగా చేసుకుని చూస్తే ఇది గడచిన జనవరిలో 5.07శాతంగా నమోదుకాగా, 2017 ఫిబ్రవరిలో ఇది 3.65శాతంగా నమోదైంది.

'గ్రాబ్ ఆన్ రెంట్' కన్వర్టబుల్ ఫర్నీచర్



హైదరాబాద్: ప్రముఖ రెంటల్ మార్కెట్ ప్లేస్ అయిన గ్రాబ్ ఆన్ రెంట్ గృహోపకరణాలను అద్దెకు ఇవ్వడంలో పేరుగాంచింది. తాజాగా చిన్నపాటి స్పేస్‌లకు అనువుగా గ్రాబ్ ఆన్‌రెంట్ మల్టీఫంక్షనల్, ఇన్నోవేటివ్ ఫర్నీచర్‌ను ది కన్వెర్టబుల్ ఫర్నీచర్ పేరిట అద్దెకు ఇవ్వనున్నట్లు వెల్లడించింది. ఈ నూతన పథకంలో భాగంగా బూమరాంగ కన్వెర్టబుల్ టేబుల్, కాఫీ డైనింగ్ టేబుల్ మొదలైనవి కూడా అద్దెకు ఇవ్వనున్నట్లు తెలిపింది. అలాగే మల్టీపర్పస్ ఫర్నీచర్‌ను అందుబాటులో ఉంచినట్లు సంస్థ తెలిపింది. అలాగే కాఫీ టేబుల్‌ను మూడు సులభ విధానాలతో డైనింగ్ టేబుల్‌గా మార్చుకునేలా ఉంటే ఫరీచర్‌ను అందుబాటులో ఉంచినట్లు తెలిపింది. కాగా ఈ ఫర్నీచర్ హీట్ ప్రూఫ్, వాటర్ ప్రూఫ్, డస్ట్‌ప్రూఫ్‌గా ఉంటుందని సంస్థ తెలిపింది.

హైదరాబాద్‌లో జిరాక్స్ ఉత్పాదనల ప్రదర్శన



హైదరాబాద్: ప్రింట్‌ఫెయిర్ 18లో జిరాక్స్ ఇండియా వినూత్న సాంకేతికత, కొనుగోలుదారుల నేటి, రేపటి అవసరాలను తీర్చగల తన విస్తృత శ్రేణి ఉపకరణాలను ప్రదర్శించింది. మార్కెట్‌పై కంపెనీ పట్టును పునరుద్ఘాటించేందుకు, నూతన, ప్రస్తుత కస్టమర్లను ఆకర్షించేందుకు ఒక వేదికగా ఈ కార్యక్రమం తోడ్పడింది. కంపెనీ ప్రజాదరణ పొందిన వెర్సంట్ శ్రేణికలర్ సి70తో పాటు వెర్సంట్ 180, వెర్సంట్ 3100లను ప్రదర్శించింది. కాగా డిజిటల్ ప్రెస్‌లలో జిరాక్స్ ఏవిధంగా నైపుణ్యం, నాయకత్వస్థానం పొందిందనే దాని గురించి సంస్థ ప్రతినిధి బాలాజీ మాట్లాడారన్నారు. వినియోగదారులకు విజయం చేకూర్చేలా మా ప్రొడక్షన్ ప్రెస్‌లు, వర్క్‌ఫ్లో సొల్యూషన్స్‌తో ఈ విభాగంలో వేగాన్ని మరింత ముమ్మరం చేసేందుకు మేము ప్రయత్నిస్తున్నామన్నారు.

సౌత్ స్కోప్ క్యాలెండర్ ఆవిష్కరణ



హైదరాబాద్: సినీ తార లావణ్య త్రిపాఠి నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో భాగంగా బోల్స్ సౌత్ స్కోప్ క్యాలెండర్ 2018 ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కిండల్ గ్రూప్ బ్రాండ్ డైరక్టర్ పుష్పాంజిలి బెనర్జీ, అరుణ ఆర్ కృష్ణన్, పూనం షా, శ్రీనాద్ తదితరులు పాల్గొన్నారు. బోల్స్ సౌత్ స్కోప్ క్యాలెండర్ అనేది భారతదేశంలో సినిమా రంగంలో పేరు పొందిన వ్యక్తులతో రూపొందించిన క్యాలండర్. ఈ సంవత్సరం క్యాలండర్‌లో ప్రభుదేవా, రానా దగ్గుపాటి, త్రిష కృష్ణన్, విక్రమ్ ప్రభు, లక్ష్మి మంచు, కీర్తి సురేష్ తదితరులు కనువిందు చేయనున్నారు. బోల్స్ సౌత్ స్కోప్ క్యాలెండర్ 2018 ను ప్రఖ్యాత ఫోటోగ్రాఫర్లు ఐన జి వెంకట్ రామ్ కార్తిక్ శ్రీనివాస్ రూపొందించారు.

భారీ లాభాల్లో స్టాక్‌మార్కెట్లు

611 పాయింట్లు ఎగబాకిన సెన్సెక్స్ - ఏడాది తరువాత అత్యధిక రోజువారీ లాభం



ముంబై: దలాల్ స్ట్రీట్ ధగధగలాడింది. బుల్ పరుగులు పెట్టింది. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలను అందిపుచ్చుకున్న దేశీయ మదుపర్లు కొనుగోళ్ల బాట పట్టారు. అటు విదేశీ పెట్టుబడులు కూడా పెరగడం మార్కెట్ సెంటిమెంట్‌కు బాగా కలిసొచ్చింది. దీంతో గత కొన్ని రోజులుగా లాభనష్టాల్లో ఊగిసలాడుతూ వస్తోన్న దేశీయ మార్కెట్లు.. సోమవారం భారీ లాభాల దిశగా దూసుకెళ్లాయి. బాంబే స్టాక్ ఎక్ఛ్సేంజీ సెన్సెక్స్ ఏకంగా 600 పాయింట్లు ఎగబాకగా.. నిఫ్టీ కూడా దాదావు 200 పాయింట్లు లాభపడింది.

అమెరికా ఉద్యోగ నివేదిక అంచనాలకు మించి ఆశాజనకంగా ఉండటంతో ప్రపంచ మార్కెట్లు లాభాల దిశగా సాగాయి. ఆ సానుకూల ప్రభావంతో దేశీయ సూచీలు కూడా ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. 250 పాయింట్లకు పైగా లాభంతో ట్రేడింగ్‌ను మొదలుపెట్టిన సెన్సెక్స్ ఆ తర్వాత వెనుదిరిగి చూడలేదు. అటు ఐటీ, టెక్, చమురు, లోహ, బ్యాంకింగ్ తదితర రంగాల్లోనూ పెట్టుబడులు వెల్లువెత్తడం సూచీలకు కలిసొచ్చింది. దీంతో సోమవారం నాటి ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 611 పాయింట్లు లాభపడి 33,918 వద్ద స్థిరపడింది. 2016 మార్చి తర్వాత ఒక రోజు ట్రేడింగ్‌లో ఇంతటి అత్యధిక లాభాలను నమోదు చేయడం ఇప్పుడే కావడం విశేషం. అటు నిఫ్టీ కూడా 10,400పైన ట్రేడ్ అయ్యింది. 194 పాయింట్లు ఎగబాకిన సూచీ 10,421 వద్ద ముగిసింది. మఎన్ఎస్ఈలో ఎయిర్‌టెల్ రాణించింది. సంస్థ ఒక్కో షేరు విలువ 5శాతానికి పైగా పెరిగింది. అటు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, ఐటీసీ, వేదాంతా లిమిటెడ్, ఎన్టీపీసీ షేర్లు లాభపడగా.. కోల్ ఇండియా, అరబిందో ఫార్మా, టెక్ మహింద్రా షేర్లు నష్టపోయాయి.

పార్కోస్‌తో అమెజాన్ భాగస్వామ్యం

బెంగళూరు:దేశంలో అతిపెద్ద పెర్ఫ్యూమ్ అండ్ కాస్మొటిక్ రిటైలర్‌గా పేరుగాంచిన పార్కోస్ తాజాగా అమెజాన్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా అమెజాన్ ఇండియా బ్యూటీ క్యాటగిరీ లీడర్ మేఘన అప్పారావు మాట్లాడుతూ పార్కోస్ సంస్థ బ్యూటీ ఉత్పత్తులలో పేరుగాంచిన సంస్థ. ఈ సంస్థతో భాగస్వామ్యం ఏర్పరుచుకుని మా ప్లాట్ ఫారంపై విక్రయాలు నిర్వహించడం గర్వంగా భావిస్తున్నాం. ఈ భాగస్వామ్యంతో ఈ అంతర్జాతీయ ఉత్పత్తులు దేశవ్యాప్తంగా ఉన్న వినియోగదారులకు అందుబాటులోకి రానున్నాయన్నారు. పార్కోస్ సీఎంఓ టోని పారిసి మాట్లాడుతూ అమెజాన్‌తో భాగస్వామ్యం మా అభివృద్ధికి దోహదపడుతుందని భావిస్తున్నాం. అమెజాన్‌తో కుదుర్చుకున్న ఈ భాగస్వామ్యంతో వినియోగదారులకు మరింత చేరువవుతామన్నారు.

పల్ప్ ఉడ్ సేకరణ బలోపేతం చేసిన ఐటీసీ

హైదరాబాద్: ఐటీసీకి చెందిన పేపర్ బోర్డ్స్ అండ్ స్పెషాలిటీ పేపర్స్ డివిజన్, పల్ప్ ఉడ్ ప్లాంటేషన్‌ను సాగుచేస్తున్న రైతులకు గిట్టుబాటు ధరలను అందించేందుకు పలు చర్యలను తీసుకుంటోంది. పల్ప్ ఉడ్ సేకరణకు సంబంధించిన పలు అంశాలను సైతం బలోపేతం చేసేందుకు ఐటీసీ చర్యలు చేపట్టింది. ఐటీసీ అధికారులు నిరంతరం రైతులతో మాట్లాడుతుండటంతో పాటు, సిద్ధమైన వారి పంటను సారపాక, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కంపెనీ మిల్లుకు సరఫరా చేసేలా తగిన ప్రయత్నాలు చేస్తున్నారు. నేరుగా రైతులు సరఫరా చేయడంవల్ల పర్చేజ్ ఆర్డర్‌ను రైతులకు నేరుగా విడుదల చేయడంతో పాటుగా చెల్లింపులను సైతం మిల్ నిర్ణయించిన ధరలకు అనుగుణంగా చెల్లించనున్నట్లు తెలిపింది.

మహిళా దినోత్సవాన్ని నిర్వహించిన కానన్ ఇండియా



న్యూఢిల్లీ: ఇమేజింగ్ టెక్నాలజీలో అగ్రగామి సంస్థగా పేరొందిన కానన్ ఇండియా ఇటీవల దేశవ్యాప్తంగా ఉమెన్స్ డేను ఘనంగా నిర్వహించింది. దీనికితోడు సంస్థ 20 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా సంస్థలో 5, 10, 15 సంవత్సరాల సర్వీసు పూర్తిచేసుకున్న సిబ్బందికి పురస్కారాలు అందించారు. ఈ సందర్భంగా కానన్ ఇండియా సీఈఓ అండ్ ప్రెసిడెంట్ కజుతోడా కొబయాషి మాట్లాడుతూ సంస్థ అభివృద్ధికి సిబ్బంది అంకితభావమే కారణమన్నారు. తాజాగా ఫ్యూచర్ ఉమెన్ లీడర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును అందించామన్నారు. సంస్థలో పనిచేస్తున్న మహిళా సిబ్బందికి సౌకర్యాల కల్పనకు పెద్దపీట వేస్తామని తెలిపారు. సంస్థగతంగా వారికి పనిచేసే చోట ప్రోత్సాహాన్ని అందిస్తామని తెలిపారు.

సేవెక్స్ టెక్నాలజీతో హువావే భాగస్వామ్యం



హైదరాబాద్: ప్రముఖ హువావే ఎంటర్‌ప్రైజెస్ బిజినెస్ గ్రూప్(ఈబీజీ) తాజాగా సేవెక్స్ టెక్నాలజీస్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యంలో భాగంగా సేవెక్స్.. హువావేకి సాంకేతిక సాయం అందిస్తూ సంస్థ అభివృద్ధికి దోహదపడనుంది. కాగా సేవెక్స్ అనేది దేశంలో మూడవ అతిపెద్ద ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ డిస్ట్రిబ్యూటర్‌గా పేరొందింది. ఈ సందర్భంగా హువావే ఇండియా ఎంటర్‌ప్రైజెస్ బిజినెస్ గ్రూప్ ప్రెసిడెంట్ డేరెక్ హువా మాట్లాడుతూ ప్రస్తుతం డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అన్నిరంగాల్లో కీలకపాత్ర పోషిస్తోంది. ఈ నేపథ్యంలో సేవెక్స్ టెక్నాలజీతో భాగస్వామ్యం సంస్థ అభివృద్ధికి దారితీస్తుందన్నారు.

సూర్య
విజయవాడ
మంగళవారం
13 మార్చి 2018

'స్కాంగ్రెస్' మట్టికరువక తప్పదు

మంత్రి కేటీఆర్ ఆగ్రహం

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః బడ్జెట్ సమావేశాల తొలిరోజు సందర్భంగా అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీ సభ్యులు వ్యవహరించిన తీరుపై తెలంగాణ ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్‌శాఖ మంత్రి కేటీ రామారావు తీవ్రంగా స్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీని స్కాంగ్రెస్ పార్టీగా అభివర్ణిస్తూ.. ఘాటైన విమర్శలు ఆయన ఎక్కుపెట్టారు. స్కాంగ్రెస్ పార్టీకి చర్చించేందుకు సబ్జెక్టు లేదు. కనీసం హుందాగా అసమ్మతి తెలిపే నైతిక అధికారం కూడా లేదు. స్కాంగ్రెస్ విఫల ప్రభుత్వాన్ని తెలంగాణ ప్రజలు చూసి, విసిగిపోయి, ఆ పార్టీని చెత్తకుప్పలో విసిరేశారు. ఆ పార్టీ ఎంత రౌడీయిజానికి దిగినా.. మట్టికరువక తప్పదు అంటూ కేటీఆర్ ఘాటుగా ట్వీట్ చేశారు.బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా తెలంగాణ అసెంబ్లీలో సోమవారం తీవ్ర ఘటనలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకునే క్రమంలో విపక్ష కాంగ్రెస్ సభ్యుల్లో కొందరు దురుసుగా ప్రవర్తించారు. ముఖ్యంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తన హెడ్‌సెట్‌ను విసిరికొట్టడంతో.. మండలి చైర్మన్ స్వామిగౌడ్ కంటికి స్వల్ప గాయమైంది. కోమటిరెడ్డి హెడ్‌సెట్ విసిరేసిన దృశ్యాలు అసెంబ్లీ కెమెరాల్లో రికార్డయ్యాయి. అసెంబ్లీలో తాజా పరిణామాలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తున్నదని, కాంగ్రెస్ సభ్యులపై సీరియస్ యాక్షన్ తీసుకునే అవకాశముందని తెలుస్తోంది.



10 రోజుల్లో నివేదిక సమర్పించండి

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి : రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖలు,ఏజన్సీల వెబ్ సైట్లను ఐటి శాఖ ద్వారా నిర్వహించే విషయమై తగు నివేధికను 10 రోజుల్లోగా సమర్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. ఎస్.కె.జోషి ఆదేశించారు.

సోమవారం సచివాలయంలో ప్రభుత్వ వెబ్ సైట్లు, పోర్టల్‌కు సంబంధించి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఐటి శాఖ ముఖ్యకార్యదర్శి జయేష్ రంజన్, ఐటి డైరెక్టర్ దిలీప్ కొణతం తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో వివిధ శాఖలకు సంబంధించి 265 వెబ్ సైట్లు/పోర్టల్స్ ఉన్నాయని వీటి నిర్వహణ, సమాచార ఆధునీకరణ, కేంద్ర ప్రభుత్వం నిర్ధేశించిన మేర నిబంధనల పాటింపు, అనువైన నూతన టెక్నాలజి వినియోగం, మొబైల్ ఫ్రెండ్లి విధానం తదితర అంశాలతో నివేధికను రూపొందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఐటి శాఖ ఐటి సర్వీసు ప్రొవైడర్ గా పనిచేయాలన్నారు. అవసరమైతే సహకారాన్ని తీసుకోవాలన్నారు వెబ్ సైట్ల నిర్వహణ, సమాచారం అప్ డేషన్ కు సంబంధించి ప్రభుత్వం తరవున చేపట్టవలసిన చర్యలు, ప్రతి వెబ్ సైట్ లలో ఉండవలసిన అంశాల టెంప్ లేట్ , వివిధ శాఖల సర్వీసుల వివరాలు, అవసరమైన సిబ్బంది, బడ్జెట్, వెండర్ ఎంపిక తదితర అంశాలు నివేధికలో ఉండాలన్నారు. ప్రతి శాఖకు సంబంధించి ట్విట్టర్, ఫేస్ బుక్ అకౌంట్ ఉండేలా చూడాలన్నారు. ప్రభుత్వ లోగో, ముఖ్యమంత్రి ఫోటో ఉండాలన్నారు. వెబ్ సైట్ల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. అన్ని శాఖల వెబ్ సైట్లకు రాష్ట్ర ప్రభుత్వ పోర్టల్ కేంద్ర స్ధానంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మక కార్యక్రమాల వివరాలు, ప్రభుత్వ జివోలు తెలుగులో అప్ లోడింగ్, వివిధ శాఖల కార్యక్రమాల వివరాలు, తెలియజేసేలా వెబ్ సైట్లు ఉండాలన్నారు

ఐటి శాఖ ముఖ్యకార్యదర్శి జయేష్ రంజన్ మాట్లాడుతూ ఐటి శాఖ ద్వారా రాష్ట్ర పోర్టల్, ఐటి శాఖ పోర్టల్ ను నిర్వహించడంతో పాటు వివిధ శాఖలకు సహకారం అందిస్తున్నామన్నారు. డిజిటల్ మీడియా విభాగం ద్వారా ముఖ్యమంత్రి, రాష్ట్ర ఐటి శాఖ మంత్రితో నిర్వహిస్తున్నామన్నారు. వివిధ శాఖలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ నిబంధనలు, ఫేస్ బుక్ నిర్వహణపై శిక్షణను ఇచ్చామన్నారు. వెబ్ సైట్లను మొబైల్ ఫ్రెండ్లీ గా నిర్వహించే విషయమై గూగుల్ సహకారంతో వర్క్ షాప్ నిర్వహించామన్నారు.



ప్రజా సమస్యల ఫిర్యాదులు,వాటి పరిష్కారం కోసం సూర్యాపేట జిల్లాలో అమలు చేస్తున్న జనహితవిధానాన్ని సమీక్షించారు. ప్రజలు తమ ఫిర్యాదులను ప్రత్యక్షంగా ఇవ్వడంతో పాటు ఇ-మెయిల్,ఆన్ లైన్, వాట్సాప్, మొబైల్ ద్వారా చేస్తున్నారని, 40శాతం మంది వీటి మీద ఆధారపడుతున్నారని అధికారులు సి.యస్ కు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పద్ధతిని అమలు చేసే విధానంపై చర్చించారు. ప్రజల ఫిర్యాదులను వేగవంతంగా, పారదర్శకంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

మొదటి పేజీ తరువాయి

అసెంబ్లీ రణరంగం



సంఖ్యలో లోపలికి వచ్చిన మార్షల్.. కాంగ్రెస్ సభ్యులను అడ్డుకు న్నారు. దీంతో సభలో గందరగోళవాతావరణం నెలకొంది. నినాదాల నడుమ గవర్నర్ తన ప్రసంగాన్ని కొనసాగించారు.

సోమవారం ఉదయం 10.10 గంటలకు జాతీయ గీతాలాపనతో బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశి గవర్నర్ నరసింహన్ ప్రసంగాన్ని చదవడం మొదలుపెట్టిన కాసేపటికే.. కాంగ్రెస్ సభ్యులు తమ స్థానాల్లో నిలబడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గవర్నర్ నిల్చున్న వెల్‌లోకి చొచ్చుకొచ్చే ప్రయత్నం చేశారు. అంతలోనే వారిని మార్షల్స్ అడ్డుకున్నారు. ఈ క్రమంలో కొందరు సభ్యులు బడ్జెట్ ప్రతులను చింపేసి గవర్నర్‌పైకి విసిరే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే రెండు హెడ్‌ఫోన్‌లను గవర్నర్‌పైకి విసిరేశారు. ఇందులో ఒకటి అసెంబ్లీ కార్యదర్శి టేబుల్ వద్ద పడగా, మరొకటి మండలి చైర్మన్ స్వామిగౌడ్‌పై పడింది. ప్రసంగం పూర్తైన అనంతరం సభ రేపటికి వాయిదాపడింది.

సీఎం సీరియస్ వార్నింగ్ : నేటి గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకుంటామని ప్రతిపక్ష కాంగ్రెస్ ఇంతకుముందే ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే, ఈ విషయంలో కాంగ్రెస్ పట్ల కఠినంగా వ్యవహరించాలని సీఎం కేసీఆర్ భావించారు. గవర్నర్ ప్రసంగానికి అడ్డుతగిలే సభ్యులను.. సమావేశాలు ముగిసేంతవరకూ సస్పెండ్ చేస్తామని కేసీఆర్ హెచ్చరించిన విషయం తెలిసిందే.

సరోజిని ఆసుపత్రిలో చికిత్స

తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో తొలిరోజే అనూహ్య సంఘటన చోటుచేసుకుంది. గవర్నర్ ప్రసంగ ప్రతులను చించి పారవేశారు. అదే సమయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి హెడ్‌ఫోన్ విసరగా అది గవర్నర్ పక్కనే ఉన్న మండలి ఛైర్మన్ స్వామిగౌడ్‌కు కంటికి తగిలింది. గవర్నర్ ప్రసంగం ముగిసిన తర్వాత ఆయన నేరుగా సరోజినీ కంటి ఆస్పత్రికి వెళ్లి చికిత్స తీసుకున్నారు.

అనంతరం స్వామిగౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ సభ్యులు విసిరిన మైక్ నేరుగా తన కంటికి తగిలిందని తెలిపారు. బాధ కలుగుతున్నప్పటికీ గవర్నర్ ప్రసంగం పూర్తయ్యేవరకు ఓర్చుకున్నానన్నారు. అనంతరం సీఎం కేసీఆర్ సూచన మేరకు సరోజిని కంటి ఆస్పత్రికి వెళ్లి పరీక్ష చేయించుకున్నట్లు తెలిపారు. కంటికి ఎలాంటి ప్రమాదం లేదని.. కొద్దిగా వాపు రావడంతో కాస్త జాగ్రత్త తీసుకోవాలని వైద్యులు సూచించినట్లు తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఎవరికైనా తమ నిరసన తెలిపే హక్కు ఉంటుందని.. అయితే ఇలాంటి చర్యలు మాత్రం సరికాదని స్వామిగౌడ్ అన్నారు.

బీజేపీ బైకాట్

గవర్నర్ ప్రసంగం అంతా అబద్దాలతో కూడుకోవడంతో బాధ భరించలేక సభ నుంచి వాకౌట్ చేసినట్లు బీజేపీ పక్ష నేత కె.లక్ష్మణ్ తెలిపారు. గవర్నర్ ఉభయ సభలనుద్దేశించిచేసిన ప్రసంగంలో ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం పేర్కొనలేదన్నారు. ప్రజా సమస్యలు పరిష్కారంపై కూడా ప్రస్తావించలేదన్నారు. ఇదిలా ఉండగా గవర్నర్ ప్రసంగంపై కాంగ్రెస్ పక్ష సభ్యులు ఆందోళన చేస్తుండగా ప్రతిపక్ష నేత జానారెడ్డి తన ముందు సీటు నుంచి వచ్చి వెనక సీట్లో కూర్చునున్నారు. కొద్ది సేపు అక్కడ కూర్చొని సభ నుంచి బయటికి వెళ్లిపోయారు. మిగతా కాంగ్రెస్ సభ్యులు గవర్నర్ ప్రసంగం పూర్తి అయిన తర్వాత సభ వాయిదా పడ్డ అనంతరం సభ నుంచి వెళ్లిపోయారు.

బాబు పాలనలో అష్టకష్టాలు



అడిగారు. రుణమాఫీ పేరుతో రైతులకు, డ్వాక్రా మహిళలకు బాబు కుచ్చుటోపి పెట్టారని విమర్శించారు. బాబు వస్తే రుణ మాఫీ అన్నారు. ఏ ఒక్కరికైనా ఒక్క రూపాయి రుణ మాఫీ అయిందా, రుణమాఫీ ఏమో కానీ బ్యాంకు నోటీసులు వస్తున్నాయని ఎద్దేవా చేశారు. జాబు రావాలంటే బాబు రావాలని, ప్రతి ఇంటికో ఉద్యోగం ఇస్తానని, చదువుకోకపోయినా ఉపాధి కల్పిస్తానని, లేకుంటే నిరుద్యోగి భృతి ఇస్తానని బాబు హామి ఇచ్చారని, అధికారంలోకి రాగానే ఆ హామీలను అటకెక్కించారని మండిపడ్డారు. నాలుగేళ్లుగా మీకు రావాల్సిన నిరుద్యోగ భృతి 94 వేల రూపాయలు బాకీ పడ్డట్లు బాబును నిలదీయండని ప్రజలకు సూచించారు. అధికారంలోకి రాక ముందు యువత మద్యం తాగి చెడిపోతున్నారని, మద్యం షాపులు తగ్గిస్తానన్న బాబు అధికారంలోకి రాగానే ఏం చేశాడని ప్రశ్నించారు. ఊరికో మినరల్ వాటర్ ప్లాంట్ ఉందో లేదో కానీ బెల్ట్ షాప్ మాత్రం ఉందని ఎద్దేవా చేశారు. ఫోన్ కొడితే మందు బాటిల్ ఇంటికొచ్చె పరిస్థితి తీసుకొచ్చారని విమర్శించారు. ప్రత్యేక హోదా విషయంలో చంద్రబాబు డ్రామాలాడుతున్నారని విమర్శించారు. ప్రత్యేక హోదాకు, ఆర్థిక సంఘానికి సంబంధంలేదని, 2014 మార్చిలో హోదాను కేబినెట్‌లో ఆమోదించిన వెంటనే ప్రణాళికా సంఘానికి ఆదేశాలు పంపారన్నారు. 2014 డిసెంబర్ వరకు 14వ ఆర్థిక సంఘం అమల్లో ఉందని అయినా చంద్రబాబు పట్టించుకోలేదని, హోదా గురించి ఆలోచించలేదన్నారు. హోదాకు 14వ ఆర్థిక సంఘం ఒప్పుకోలేదని, ఢిల్లీ పెద్దలు చెప్పగానే చంద్రబాబు గంగిరెద్దులా తలూపారన్నారు. గతంలో అర్ధరాత్రి ఏం చెప్పారో మొన్న కూడా అదే విషయాన్ని జైట్లీ చెప్పారని స్పష్టం చేశారు. నాలుగేళ్లు డ్రామాలు చేసిన చంద్రబాబు వైసీపీ పోరాటంతో ఒక్కసారిగా ఉలిక్కిపడి మంత్రులను కేంద్రం నుంచి ఉపసంహరించారని దుయ్యబట్టారు. సిగ్గులేకుండా ఇంకా ఎన్డీఏలోనే కొనసాగుతున్నారని, అవిశ్వాసానికి మద్దతు ఇవ్వమని అడిగితే వెనకడుగు వేశారని, 25 మంది ఎంపీలు ఒక్కతాటిపై నిలబడితే కేంద్రం దిగిరాదా అని ప్రశ్నించారు. చంద్రబాబుకు రాష్ట్ర ప్రయోజనాలు పట్టడం లేదని విమర్శించారు.

దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఆరోగ్యశ్రీ ఎలా ఉండేదని, బాబు హయాంలో ఎంత దయనీయంగా మారిందో చెప్పాలని ప్రజలను ప్రశ్నించారు. 108 కాల్ చేస్తే అంబులెన్స్ వచ్చేదని, ఇప్పుడు చేస్తే డ్రైవర్లకు జీతాల్లేక సమ్మెలో ఉన్నారని చెబుతున్నారని వివరించారు. ఆరోగ్యశ్రీ హైదరాబాద్‌లో చెల్లడం లేదని, కిడ్నీ, క్యాన్సర్, చిన్నపిల్లలకు వైద్యం అందక నానా కష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మీ అందరి దీవెనలతో మనందరి ప్రభుత్వం వస్తే వెయ్యి రూపాయలు దాటితే ప్రతి పేదవాడికి వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా వైద్యం అందిస్తామన్నారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు సహా ఎక్కడ ఆపరేషన్ చేయించుకున్నా ఆరోగ్యశ్రీ వర్తింప చేస్తామన్నారు. అంతేగాకుండా ఆపరేషన్ సమయంలో కుటుంబ పెద్దకు విశ్రాంతి అవసరమైతే ఆర్థిక సాయం చేసి అన్ని విధాల ఆదుకుంటామన్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు రూ.10 వేల పెన్షన్ ఇస్తామని, వైద్యం కోసం ఎవరూ అప్పులు చేసే పరిస్థితి రానివ్వమని, నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపుతామన్నారు. నవరత్నాలపై సలహాలు, సూచనలివ్వాలని ఈ సందర్భంగా వైఎస్ జగన్ ప్రజలను కోరారు.

రైల్వేజోన్ హుళక్కే




చేసిందంటూ ఇప్పటికే రాష్ట్ర ప్రజలు, పార్టీలు మండిపడుతున్నాయి. హోదా ఇవ్వకపోయినా ఇవ్వాల్సినవన్నీ అటు బీజేపీ నేతలు కూడా చెప్పుకొచ్చిన సంగతి తెలిసిందే.

వుండు మీద కారం చల్లారు...

ఏపీకి రైల్వేజోన్ ఇచ్చేయడం గ్యారెంటీ అని ఒడిశాతో చర్చలు జరిపాక పరిధిని కుదించి విశాఖ రైల్వేజోన్‌ను ప్రకటిస్తామని కొద్దిరోజుల క్రితమే కేంద్ర పెద్దలు స్పష్టం చేశారు. కానీ ఆ తర్వాత జరిగిన పరిణామాల్లో కేంద్ర కేబినెట్ నుంచి టీడీపీ వైదొలిగింది. ఇటు ఏపీలో అటు కేంద్రంలో ప్రత్యక్ష పోరాటానికి దిగారు. ఈ సమయం లోనే రైల్వేజోన్ ఇవ్వటం సాధ్యంకాదని వుండు మీద కారం చల్లింది.


చర్చ సాగిందిలా... 13వ షెడ్యూల్‌లో ఉన్నటువంటి ఎడ్యుకేషన్‌కు సంబంధించి ఐదు అంశాలు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు సంబంధించిన 12 అంశాలు.. మొత్తం 17 అంశాలపై సుదీర్ఘమైన చర్చ జరిగింది. ఇందులో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో 8వ అంశంగా ఉన్నటువంటి రైల్వే జోన్ ప్రస్తావనకు వచ్చింది. ప్రస్తుతమున్న పరిస్థితుల్లో ఏపీకి రైల్వేజోన్ ఇచ్చేది లేదని ఏపీ సీఎస్‌కు.. కేంద్ర హోంశాఖ కార్యదర్శి తేల్చి చెప్పేసింది . అయితే ఈ తరుణంలో అధి కారులతో ఏపీ సీఎస్ వాగ్వా దానికి దిగినట్లు తెలిసింది. నిన్న మొన్నటి వరకు విశాఖ కేంద్రంగా గుంటూరు, విజయవాడ, గుంతకల్లు డివిజన్లతో కొత్త జోన్ ఏర్పాటు చేయడానికి కేంద్రం సుముఖంగా ఉన్నట్లు వార్తలు వచ్చాయి. అయితే తాజాగా రైల్వేజోన్‌పై కేంద్రం చేతులెత్తేసింది.

20 ఏళ్ల పార్టీ సేవ, విధేయత వల్లే రాజ్యసభ సభ్యత్వం : చంద్రబాబు



(అమరావతి, సూర్య ప్రత్యేక ప్రతినిధి) : కనకమేడల రవీంద్ర కుమార్ 20 ఏళ్ల నుంచి పార్టీకి సేవ చేస్తున్నారని ముఖ్య మంత్రి చంద్రబాబు కొనియాడారు. సోమ వారం ఆయన మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో పార్టీకి సంబంధించిన పలు కేసులు వాదిస్తున్నారని అన్నారు. ప్రతి పార్టీకి లాయర్ ఉన్నారని, అలాగే తమ పార్టీకి కూడా ఒక లాయర్ అవసరమని అన్నారు. పార్టీ పట్ల విధేయత, అలాగే పార్టీకి చేసిన సేవ కారణంగానే రవీంద్రకు రాజ్యసభ సభ్యత్వం ఇవ్వదల్చుకున్నామని అన్నారు. విభజన హామీలపై న్యాయ పోరాటం చేసేందుకు కూడా రవీంద్రకుమార్ లాంటి వ్యక్తులు అవసరమని చంద్రబాబు అన్నారు. సీఎం రమేష్ కూడా పార్టీ పట్ల విధేయుడేనని చంద్రబాబు కొనియాడారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం రాజ్యసభలో పోరాటం చేశారని గుర్తు చేశారు. ఇదిలా ఉండగా తెలంగాణ అసెంబ్లీలో సంఘటలను మీడియా చంద్రబాబు ద ష్టికి తీసుకెళ్లింది. మండలి ఛైర్మన్ స్వామిగౌడ్గ కన్ను పోయిందని మీడియా ఆయనకు తెలిపింది. దీనిపై బాబు స్పందిస్తూ కన్నుకు దెబ్బ మ్రామే తగిలిందని త్వరగా కోలుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎంత త్యాగానికైనా సిద్ధం



ఉండాలి. పంటనష్టం, జననష్టం జరగకుండా అన్నిచర్యలు తీసుకోవాలి, ముందు జాగ్రత్తలు తీసుకోవాలి" అని ముఖ్యమంత్రి ఆదేశించారు. భవిష్యత్తులో రాష్ట్రంలో నీటి సమస్య అనేదే ఉత్పన్నం కాకూడదన్నారు. 'పంట సంజీవని' కార్యక్రమం చురుకుగా చేపట్టాలని, పంటకుంటల తవ్వకం పనులు ముమ్మరంగా నిర్వహించాలని అన్నారు. వర్మికంపోస్ట్ పిట్ల పనులు వేగవంతం చేయాలన్నారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు చురుకుగా, ఉత్సాహంగా చేపట్టాలన్నారు. వేసవిలో తాగునీరు, విద్యుత్, పశుగ్రాస కొరత లేకుండా చూడాలన్నారు.

కరవు ప్రాంతాలలో సూక్ష్మసేద్యాన్ని ప్రోత్సహించాలి

సూక్ష్మ సేద్యం లక్ష్యంలో 70 శాతం మ్రామే చేరామంటూ, మిగిలిన లక్షా 40వేల ఎకరాల్లో కూడా పూర్తిచేయాలన్నారు. కరవు మండలాలలో సూక్ష్మసేద్యాన్ని మరింతగా ప్రోత్సహించాలన్నారు. రాష్ట్రంలో ఉద్యాన పంటల సాగు కోటి ఎకరాలకు చేరాలన్నదే తన ఆకాంక్షగా పేర్కొన్నారు. హార్టీకల్చర్ రంగంనుంచి రాష్ట్రానికి 25 శాతం ఆదాయం వచ్చేదిశగా కార్యక్రమాలు ముమ్మరం చేయాలన్నారు. జీబా వినియోగంపై రైతులను చైతన్యపరచాలని కోరారు.ఈ ఏడాది ప్రయోగాత్మకంగా అనంతపురం జిల్లాలో 2 లక్షల ఎకరాలలో జీబా వినియోగం ద్వారా కరవును అధిగమించేందుకు కషి చేస్తున్నట్లు తెలిపారు. ఎకరానికి జీబా వినియోగానికి రూ.2,500 ఖర్చు అవుతుందని, కానీ దానివల్ల నాలుగైదు రోజులపాటు నీటి తడులు భూమిలోకి ఇంకకుండా సమర్ధనీటి నిర్వహణకు అవకాశం ఉంటుందన్నారు. ప్రతి గ్రామంలో పోషకాహార ఉద్యానవనాలను(న్యూట్రిటీ గార్డెన్స్) పెంచాలని సూచించారు. తల్లులకు,చిన్నారులకు పోషకాహారం వీటినుండే పొందేలా శ్రద్ధ చూపాలన్నారు. అసెంబ్లీ సమావేశాల తరువాత సీఎం జిల్లా పర్యటనలు...

ప్రస్తుతం జరుగుతున్న రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగియగానే జిల్లాల పర్యటనలు చేపడుతున్నట్లుగా ముఖ్యమంత్రి తెలిపారు. అభివద్ధి పనులు,ప్రాజెక్టుల నిర్మాణ పనులను స్వయంగా పరిశీలిస్తాం అన్నారు. అన్ని పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. 7మిషన్లు, 5గ్రిడ్లలు, 5ఉద్యమాల పనులు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అభివద్ధి, సంక్షేమంపై ఉదాసీనత సహించేది లేదని హెచ్చరించారు.ఈ టెలికాన్ఫరెన్స్‌లో గ్రామీణాభివద్ధి, వ్యవసాయ శాఖల కమిషనర్లు రామాంజనేయులు, హరి జవహర్ లాల్, రియల్ టైం గవర్నెన్స్ ఎండి అహ్మద్ బాబు, జలవనరుల శాఖ,ఉద్యాన శాఖ, పట్టణాభివద్ధి శాఖల ఉన్నతాధికారులు శశిభూషణ్, చిరంజీవి చౌదరి, కరికాల వలవన్, వివిధ జిల్లాల కలెక్టర్లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

షార్జాలో 11 మంది అమ్మాయిల బ్యాచిలర్ పార్టీ

టెహ్రాన్ : షార్జా నుంచి టర్కీకి వెళుతున్న బొంబార్డియర్ టీసీ – టీఆర్బీ జెట్ విమానం, ఇరాన్‌లోని జాగ్రోస్ పర్వతాల్లో కుప్పకూలగా, కొద్ది రోజుల్లో పెళ్లి నిశ్చయమైన టర్కీ యూత్ ఐకాన్ మీనా బషరన్ (28) సహా 11 మంది యువతులు దుర్మరణం పాలయ్యారు. బషరన్ బిజినెస్ గ్రూప్ వారసురాలిగా, చిన్న వయసులోనే వ్యాపార రంగంలో రాణించి, టర్కీ యువతలో ఎంతో పేరు తెచ్చుకున్న మీనా బషరన్ తన స్నేహితురాళ్లకు బ్యాచిలర్ పార్టీని ఇచ్చేందుకు షార్జాను ఎంచుకున్నారు. పార్టీ తరువాత విమానం తిరిగి ఇస్తాంబుల్‌కు పయనం కాగా, ఇరాన్ మీదుగా వెళుతున్న వేళ మంటలు చెలరేగాయి. విమానాన్ని కిందకు దించే ప్రయత్నాల్లో పైలట్ ఉండగానే, మంటలు చెలరేగి ఓ కొండను విమానం ఢీకొంది. ఈ ఘటనలో పైలట్, విమానంలోని 11 మంది అమ్మాయిలు మృత్యువాత పడ్డారు. విమాన ప్రమాదానికి ముందు మీనా తీయించుకున్న ఫోటోలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.

మొదటి పేజీ తరువాయి

నేపాల్‌లో ఘోరం



వారిలో 67 మంది ప్రయాణికులు బంగ్లాదేశ్‌కు చెందిన వారేనని తెలుస్తోంది. 17 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడగా మిగతా ప్రయాణికులను రక్షించేందుకు రెస్క్యూ టీమ్ ప్రయత్నిస్తోంది. ల్యాండ్ అయ్యే సమయంలో అదుపు తప్పి రన్‌వేకి ఢీ కొనడంతో విమానంలో మంటలు చెలరేగినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై మరింత సమాచారం అందాల్సి ఉంది.

నేపాల్ రాజధాని ఖాట్మండులో జరిగిన విమాన ప్రమాదంలో దాదాపు 50 మంది మృతి చెందారు. బంగ్లాదేశ్ నుంచి ప్రయాణికులతో వస్తున్న యుఎస్ బంగ్లాకు చెందిన విమానం ఖాట్మండులోని త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయంలోనే కుప్పకూలిపోయింది. విమానం ల్యాండ్ అవుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు ఎయిర్‌పోర్ట్ అధికార ప్రతినిధి ప్రేమ్‌నాథ్ ఠాకూర్ వెల్లడించారు. ఢాకా నుంచి బయలుదేరిన ఆ విమానం స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2.20 గంటలకు ల్యాండ్ కావలసి ఉంది. విమానం రన్‌వేపై దిగుతున్న సమయంలో ఒక్కసారిగా కూలిపోయి పక్కనే ఉన్న ఫుట్‌బాల్ మైదానంలో పడిపోయింది. ప్రమాదం కారణంగా విమానంలో మంటలు చెలరేగి దట్టమైన పొగలు అలముకున్నాయి. ప్రమాదంలో విమానం పూర్తిగా దగ్ధమైంది. నేపాల్ ఆర్మీ సిబ్బంది ఎయిర్‌పోర్టుకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. విమానంలో 67 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది ఉన్నారు. ప్రమాదంలో దాదాపు 50 మంది మృతి చెందగా పలువురు గాయపడ్డారు. క్షతగాత్రులను సమీపంలోకి ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సాంకేతిక కారణాలతోనే విమానం కూలిపోయి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదం నేపథ్యంలో ఎయిర్‌పోర్ట్‌లో విమానాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. విమానాశ్రయాన్ని మూసేశారు.

సాగని పార్లమెంట్



జై తెలంగాణ నినాదాలు చేశారు. అటు ఇతర పార్టీలు పిఎన్‌బి స్కాం, కావేరి నదీజలాల యాజమాన్య బోర్డ్ ఏర్పాటు అంశంపై సభను అడ్డుకున్నాయి. లోక్‌సభలో టిఆర్ఎస్, ఇతర పార్టీల ఎంపీల ఆందోళనతో ముందుగా సభ గంట పాటు వాయిదా పడింది. వాయిదా అనంతరం సభ ప్రారంభమైన తర్వాత టీఆర్ఎస్ ఎంపీలు ఆందోళన మరింత ఉధృతం చేశారు. జీరో అవర్‌ను అడ్డుకున్నారు. తమ డిమాండ్లను నెరవేర్చేదాకా ఆందోళన విరమించేది లేదన్నారు. ఇక చేసేదేమీలేక సభను మంగళవారానికి వాయిదా వేశారు స్పీకర్ సుమిత్రా మహాజన్. సభ వాయిదా పడ్డప్పటికీ టీఆర్ఎస్ ఎంపీలు తమ నిరసన ఆపలేదు. పార్లమెంట్ ఆవరణలో ప్లకార్డులతో ఆందోళన నిర్వహించారు. రిజర్వేషన్లపై అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపించినప్పటికీ పట్టించుకోవడం లేదని ఫైరయ్యారు. రిజర్వేషన్లపై ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పద్దతి ఉందన్నారు లోక్ సభలో టిఆర్ఎస్ పక్ష నేత జితేందర్ రెడ్డి. కేంద్రం తమ డిమాండ్లను నెరవేర్చే వరకు ఆందోళన విరమించేది లేదని తేల్చి చెప్పారు. మరోవైపు ప్రత్యేక హోదా కోరుతూ తెలుగుదేశం పార్టీ ఎంపీలు చేస్తున్న ఆందోళనతో పార్లమెంటు ఉభయసభలు వాయిదా పడ్డాయి. ఉదయం 11 గంటలకు ఉభయసభలు ప్రారంభం కాగానే తెలుగుదేశం ఎంపీలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళన చేపట్టారు. దీంతో లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ సభను 12 గంటల వరకు వాయిదా వేశారు. 12 గంటలకు సభ ప్రారంభమైన మళ్లీ అదే పరిస్థితి నెలకొనడంతో తిరిగి సభను వాయిదా వేశారు. అటు రాజ్యసభలోనూ ఎంపీలు ఆందోళన చేపట్టడంతో సభ ఛైర్మన్ వెంకయ్యానాయడు సభను వాయిదా వేశారు. రాజ్యసభ లోనూ పీఎన్‌బీ స్కాంతో పాటు పలు అంశాలపై విపక్షాలు ఆందోళనకు దిగాయి. దీంతో సభ గందరగోళంగా మారింది. సభ ప్రారంభం కాగానే విపక్షాలు ఆందోళన చేపట్టాయి. సభను రెండుసార్లు వాయిదా వేసినా పరిస్థితి అదుపులోకి రాలేదు. దీంతో మంగళవారం నాటికి రాజ్యసభను వాయిదా వేశారు.

ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించిన సీఎం రమేష్, కనకమేడల



విజయవాడ, సూర్య బ్యూరో : విజయవాడ పటమట ఎన్టీ ఆర్ సర్కిల్ వద్ద ఎన్టీఆర్ విగ్ర హానికి టీడీపీ రాజ్యసభ అభ్యర్థులు సీఎం రమేష్, కనకమేడల రవీంద్రకుమార్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎం రమేష్ మాట్లాడుతూ.. టీడీపీని ఆత్మ విశ్వాసంతో సీఎం చంద్రబాబు నాయుడు ముందుకు తీసుకువెళ్తున్నారని, తెలుగువారి అభ్యున్నతి కి టీడీపీ నీరంతరంగా పనిచేస్తుందని ఆయన అన్నారు. అనంతరం కనకమేడల మాట్లాడుతూ పార్టీకి నేను చేసిన సేవలను గుర్తించి రాజ్యసభకు అవకాశం ఇచ్చినందుకు సీఎం చంద్రబాబుకు కతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, గత రెండు దశాబ్దాలుగా పార్టీకి న్యాయ విభాగం తరువున సేవలు అందించానని ఆయన పేర్కొన్నారు. అందరి సహకారంతో పార్టీని బలోపేతం చేసేందుకు కషి చేస్తానన్నారు. రాష్టానికి కేంద్రం చేస్తున్న అన్యాయ పట్ల పార్లమెంట్ సాక్షిగా పోరాటం చేస్తానని, రాజకీయ నాయకుడిగా ఎదగడానికి ఇది మంచి అవకాశమని కనకమేడల అన్నారు.



ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ఆర్ సేవలు ఎనలేనివి

వరంగల్ రూరల్,మేజర్‌న్యూస్: ఉమ్మడి రాష్ట్రంలో స్వర్గీయ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సేవలు ఎనలేనివని వైఎస్ఆర్‌సిపి జిల్లా అధ్యక్షులు నాడెం శాంతికుమార్ అన్నారు.సోమవారం వైఎస్ ఆర్‌సిపి 12వ అవిర్భావ వేడుకలను ఘనంగా జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. వరంగల్‌రూరల్ జిల్లా దుగ్గొండి మండలం పిజి తండా పార్టీ అవిర్భావ వేడుకలకు ముఖ్య అధిదుదులుగా నాడెం శాంతికుమార్ హాజరైనారు.పార్టీ జెండాను ఎగరవేసి వైఎస్ఆర్‌కు నివాళులు అర్పించారు. ఈసందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు నూనవత్ రమేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో నాడెం శాంతికుమార్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా పదవి భాధ్యతలు చేపట్టిన సర్గీయ రాజశేఖర్‌రెడ్డి రైతుల రుణ మాఫి, విధ్యార్థులకు పీజురియాంబర్స్‌మెంటు , పేద ప్రజలకు మెరుగైన వైద్యం ఉచితంగా అందించడానికి ఆరోగ్యశ్రీ పథకాలతో పాటు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని గుర్తుకు చేశారు.ఆయన ఆశయాలను నెరవేర్చడానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్ఆర్ కాంగ్రేస్ పార్టీని స్థాపించారని, నేడు పార్టీలకతీతంగా వైఎస్ఆర్‌ను ప్రజలు గుర్తుకు చేసుకుంటున్నారని తెలిపారు.తెలంగాణలోని మారుమూల గ్రామాలలో అంతర్గత రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని నేటి టిఆర్ఎస్ పాలకులు ప్రజల గోడు పట్టించుకోవడం లేదని ఆరోపించారు.వచ్చే పార్టీ అవిర్భావ వేడుకలు వచ్చేవరకు వైఎస్ జగన్ ఆంధ్రలో ముఖ్యమంత్రి కావడం తప్పనిసరని వివరించారు.పార్టీ అభివృద్ధి కోసం ప్రతీ కార్యకర్త సైనికుడిలా పాటుపడాలని శాంతికుమార్ కోరారు.అనంతరం పార్టీ అవిర్భావ శుభాకాంక్షలు జిల్లా ప్రజలకు తెలిపారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాలతో భగీరథ నీటి శుద్ధి

- నీటి ప్రమాణాలపై ప్రజల్లో అవగాహన
- తప్పుడు ప్రచారం చేస్తున్న ఆర్వో ప్లాంట్ల యజమానులపై చర్యలు
- ఇఎన్‌సి సురేందర్‌రెడ్డి



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: రాష్ట్రంలో ఇంటింటికి తాగునీటిని సరఫరా చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన మిషన్‌భగీరథ నీటిని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాలతో నీటిని శుద్ధి చేసి ప్రజలకు సరఫరా చేయనున్నట్లు గ్రామీణ తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య విభాగం ఇంజనీర్–ఇన్–చీఫ్ బిజ్జుల సురేందర్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం నీటిని శుద్ధి చేయకుండా ప్రజలకు సరఫరా అవుతున్న నీరు ఆరోగ్యానికి అంత మంచిదికాదని స్పష్టం చేశారు. ఎర్రమంజిల్ లోని ఆర్‌డబ్ల్యూఎస్ ఇఎన్‌సీ కార్యాలయంలో నీటి నాణ్యత,పర్యవేక్షణ పై ఈ.ఎన్.సి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ అండ్ ఎస్ కెమిస్ట్ , మైక్రో బయాలజిస్ట్ లు, కన్సల్టెంట్లు హాజరయ్యారు. రివ్యూ మీటింగ్ లో ఈ.ఎన్.సి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ మిషన్ భగీరథ నాణ్యతను పరిరక్షించడంలో కెమిస్ట్, మైక్రో బయాలజిస్ట్ లదే కీలక పాత్ర అన్నారు. రాష్ట్రంలో ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ ఆస్తులను జియో ట్యాగ్ చేయాలని ఆదేశించారు. నీటి వినియోగం, ప్లాంట్ల నియంత్రణ కు సలహాలు ఇవ్వాలని కోరారు. తాగునీరు కలుషితం కావడంతో గతంలో హైదరాబాద్ తో పాటు ఇతర ప్రాంతాల్లో కొన్ని విషాద సంఘటనలు జరిగాయని, మిషన్ భగీరథతో అలాంటి వాటికి అడ్డుకట్ట వేయాలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశయమన్నారు. అందుకు అనుగుణంగా అత్యంత్య నాణ్యతతో తాగునీటిని సరాఫరా చేయాలని కోరారు. మిషన్ భగీరథ నీటి నాణ్యతపై దుష్ప్రచారం చేస్తున్న ఆర్వో ప్లాంట్ యాజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. త్వరలోనే ఇంటింటికి భగీరథ నీరు చేరుతుందని, గ్రామాల్లో ఉండే ఓహెచ్ఎస్ఆర్ ల దగ్గర కూడా నీటి నాణ్యత తగ్గకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. బాలిట్ నీళ్లు తాగకుండా ప్రజలను చైతన్యపరిచేందుకు గ్రామస్థాయి నుంచి విస్తృత ప్రచారం చేస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని, లోకల్ కేబుల్ ఛానల్స్, పత్రికల ద్వారా మిషన్ భగీరథ నీటి నాణ్యతను ప్రజలకు తెలియచేయాలన్నారు. మిషన్ భగీరథలోని ప్రతీ వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్ లోనూ అత్యాధునిక సదుపాయలతో నీటి నాణ్యతను పరీక్షించే కేంద్రాలను ఏర్పాటుచేశామన్నారు. ఆ ల్యాబ్ లతో సమన్వయం చేసుకుని పనిచేయాలన్నారు. ఉపరితల నీటి వనరుల నుంచి నీటిని తీసుకుంటున్నందున,ఆ నీళ్లలో పెస్టిసైడ్స్, ఫాస్పరస్ లాంటి రసాయనాలు ఏమైనా ఉన్నాయో లేదో తెలుసుకోవడానికి హైదరాబాద్ లోని ల్యాబ్ లో తరుచుగా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. సురక్షితమైన తాగునీటిని అందించడంతో పాటు సురక్షిత పద్దతుల్లో నీటిని ఉపయోగించుకునేలా విలేజ్ వాటర్ అండ్ శానిటేషన్ కమిటీలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఇందుకోసం రాష్ట్రంలోని ప్రతీ గ్రామపంచాయితీ నుంచి కనీసం ఇద్దర్ని ఎంపిక చేసి శిక్షణ ఇస్తామని ఈ.ఎన్.సి చెప్పారు. మిషన్ భగీరథతో ఇంటింటికి నల్లా నీళ్లు సరాఫరా అయినంక నీటి సంబంధిత వ్యాధులు లేని రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తుందన్న నమ్మకం తనకు ఉందన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు జ్ఞానేశ్వర్, చీఫ్ ఇంజనీర్లు కృపాకర్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, విజయపాల్ రెడ్డి తో పాటు కన్సల్టెంట్లు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర బంద్ వాయిదా: మందకృష్ణ



హైదరాబాద్, మేజర్‌న్యూస్: ఎస్సీ వర్గీకరణ కోసం తలపెట్టిన ఎమ్మార్పీఎస్ నేటి రాష్ట్ర బంద్ వాయిదా వేస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల పరీక్షల నేపథ్యంలో రాష్ట్ర బంద్ వాయిదా వేశామని ఆయన స్పష్టం చేశారు. మండల, జిల్లా కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం రాజీలేని పోరాటం చేస్తామని, వర్గీకరణ సాధించడమే తమ అంతిమ లక్ష్యమని మందకృష్ణ స్పష్టం చేశారు. కాగా.. ఎస్సీ వర్గీకరణకోసం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యాప్త బంద్‌కు పిలుపు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ బంద్ వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కనే ప్రమాదమున్నందున వాయిదా వేయాలని తెలంగాణ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి మంద కృష్ణకు సూచించిన నేపథ్యంలో..ఆయన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యాప్త బంద్‌ను వాయిదా వేసినట్లు ప్రకటించారు.

అసెంబ్లీలో కాంగ్రెస్ గూండాగిరికి దిగింది

ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్



హైదరాబాద్, మేజర్‌న్యూస్: బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైన తొలిరోజే కాంగ్రెస్ పార్టీ సభలో గూండాగిరికి దిగిందని ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. రాష్ట్ర ప్రథమ పౌరుడైన గవర్నర్ పై హెడ్‌ఫోన్స్ విసరడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. హెడ్‌ఫోన్స్ మండలి ఛైర్మన్‌కు తాకడం వల్ల ఆయన కళ్ళుకు గాయమయిందన్నారు. కళ్లు పోతే బాధ్యులు ఎవరని ప్రశ్నించారు. సభలో ప్రవర్తించిన తీరును చూసి ఎవరు హీరోలు కాలేరని జీరోలు మాత్రమే అవుతారన్నారు. కాంగ్రెస్ పార్టీకి దమ్ము ధైర్యం ఉంటే, అసెంబ్లీలో మాట్లాడాలంటూ సవాల్ చేశారు. గవర్నర్ ప్రసంగంపై మాట్లాడేందుకు సభలో అన్ని పార్టీలకు స్పీకర్ సమయాన్ని కేటాయిస్తామన్నారు. గవ్రర్నర్ ప్రసంగం సమయంలో కాంగ్రెస్ సభ్యులు కావాలనే గొడవకు దిగి బయటకు పోవాలని ప్లాన్ చేశారన్నారు. గవర్నర్‌పై ప్రసంగం సమయంలో దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బీహార్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రవర్తించినట్లు ఇక్కడ ప్రవర్తిస్తే కుదరదని హెచ్చరించారు.

ఘనంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం



భానుపురి, మేజర్‌న్యూస్: వై ఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమ వారం జిల్లా కేంద్రం లో ఘనంగా నిర్వ హించారు. ఈ కారయక్రమానికి ముఖ్యతిధిగా సూర్యాపేట నియోజకవర్గ ఇంచార్జి పిట్టా రాంరెడ్డి హజరయ్యారు. అనంతరం ఏరియా హస్పిటల్‌లో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డా. వైఎస్. రాజశేఖర్‌రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చేసిన సేవలు నేటికి స్థిరయిగా నిలిచి పోతాయని అన్నారు. 2019ఎన్నికల్లో అన్ని స్థానల్లో పోటి చేస్తుందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు డేగల రమేష్‌నాయుడు, జిల్లా మైనార్టి సెల్ అధ్యక్షులు ఎండి. ఎజాస్, మీసాల ప్రసాద్, లొడంగి గంగాధర్, మద్ది ఉపేందర్‌రెడ్డి, కొండా రవి, సైదులు, శాంతకుమార్, జాఫర్, షరీఫ్, వెంకట్రామయ్య, అరవింద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి నిర్వాసితులకు పరిహారం పెంచాలి : సుజాత

వెలగపూడి, సూర్య బ్యూరో : చింతలపూడి ఎత్తిపోతల నిర్వాసితులకు ఇచ్చే పరిహారం పెంచాలని ఎమ్మెల్యే పీతల సుజాత అన్నారు. శాసనసభ జీరో అవర్‌లో ఆవిడ మాట్లాడుతూ ప్రాజెక్టు వల్ల భూమి కోల్పోయిన వారికి నష్ట పరిహారం పెంచాలని ప్రస్తావించారు.

పరిశ్రమల పెట్టుబడులకు నిలయంగా తెలంగాణ



మహేశ్వరం,మేజర్‌న్యూస్: మండల పరిదిలోని రావిరాల గ్రామంలో ప్యాబ్‌సిటిలో ఏర్పాటుచేసిన అప్టికల్ ఫైబర్ ప్లాంటు పునాదిరాయి ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ ఐటి పరిశ్రమల శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు తో పాటు రవాణాశాఖమంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి ప్రిన్సిపల్‌సెక్రటరి శ్రీ జయేష్ రంజన్ లు పాల్గొని భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో కెటిఆర్ మాట్లాడుతూ తెలంగాణరాష్ట్రంలో అప్టికల్ ఫైబర్ తయారికి సంబందించి గ్రిన్‌ఫిల్డ్ ప్రాజెక్టును ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. హిమాచల్ ఫ్యూచరిస్టిక్ కమ్యూనికేషన్ ఆద్వర్యంలో నిర్వహించబోయే ప్లాంటు వ్యయం 260 కొట్లతో నిర్మించచున్నట్లు తెలిపారు. ఈ ప్లాంటులో సంవత్సర కాలంలో ఉత్పత్తి ప్రారంభించనున్నట్లు తెలిపారు. దశల వారిగా రెండు యూనిట్ల పూర్తిచేసి పూర్తిస్థాయిలో ఉత్పత్తిని పెంచడం జరుగుతుందన్నారు. భారత ప్రభుత్వం ప్రచారం చేస్తున్న మేక్ఇన్ ఇండియాకు, డిజిటల్ ఇండియాకు అనుగుణంగా వుందన్నారు. ఈ తయారి కేంద్రంలో అప్టికల్ ఫైబర్‌ను తయారుచేయనున్నారు. ఈ ఫైబర్‌ను టేలిక మ్యూనికేషన్, 4జి, 5 జి మరియు బ్రాడ్‌బ్యాండ్ , ఎప్.టి.టి.ఎక్స్ ను ఇండియా తో పాటుగా విధేశాలలో సైతం నేట్‌వర్క్ ఎర్పరచేందుకు వినియోగిస్తారు. ఈ కంపెని దాదాపు 20 ఎకరాల ప్లాంటును ఈ సదుపాయం ఏర్పాటుచేసేందుకు అనుమతులు పోందింది. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 4 వేల మందికి ఉపాధి కల్పించనున్నంది. ఈ ఉద్యోగాలు స్థానికులకే కేటాయించనున్నట్లు తెలిపారు. వచ్చె శతాబ్దంలో కుడా అంతర్జాతీంగా డిమాండ్ ఉండటంతో అంతర్జాతీయ వినియోగదారుల నడుమ డాటా వినియోగం బాగా పెరిగిందన్నారు. దినికి తోడు ప్రభుత్వ ప్రాజెక్టులయిన నేషనల్ అప్టికల్ ఫైబర్ నేట్‌వర్క్, నేట్‌వర్క్ పర్ స్పెక్ట్రం, నేషనల్ న్యాలేడ్జ్ నేట్‌వర్క్ , వైఫై అధారిత స్మార్టు నగరాల అభివృద్ధి, పోస్టల్ శాఖలో ఐటి అమలుచేయడం వంటివి ఈ డిమాండ్‌కు కారణాలన్నారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ మహెంద్ర ప్రతాప్‌శుక్ల, మేనేజింగ్ డైరెక్టర్ మహెంద్ర నహత్, సర్పంచ్ జెల్ల లక్ష్మయ్య, ఉపసర్పంచ్ జైపాల్‌రెడ్డి, ఎంపిటిసి లింగం సురేష్, మార్కెట్ కమిటి డైరెక్టర్ సురేష్, అరవింద్‌శర్మ, మోహన్‌రెడ్డి, కర్ణాకర్‌రెడ్డి, బిక్షపతి, చంద్రయ్య, పద్మ, రాఘవెందర్, బుడిద శ్రీకాంత్‌గౌడ్, వివిధ కంపెనిల డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి

రైతుసమన్వయసమితి అధ్యక్షుడు గుత్తా



హైదరాబాద్, మేజర్‌న్యూస్ : రాష్ట్రంలోని రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రైతు సమన్వయ సమితుల అధ్యక్షుడు గుత్తా సుఖేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. బషీర్‌బాగ్‌లోని వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో ఆయన నేడు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. రైతు సమన్వయ సమితుల్లోని సభ్యులందరూ తమకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి, తమ ముందున్న ఆశయాలను సాధించడమే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. వ్యవసాయానికి ఏడాదికి రూ. 8 వేల పెట్టుబడిని రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వబోతున్నదని చెప్పారు. . రైతులకు కనీస మద్దతు ధర కల్పించేందుకు వ్యవసాయ మార్కెట్ కమిటీలతో కలిసి కృషి చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ అధికారులకు సహకరించి పనులు చేయించుకోవాలన్నారు. కేసీఆర్ అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తే రైతులకు మేలు చేసిన వాళ్లం అవుతామన్నారు. యావత్ దేశంలోని రైతులకు, తెలంగాణ రైతులు దిక్సూచిగా నిలవాలని గుత్తా సుఖేందర్‌రెడ్డి చెప్పారు.

టీఆర్ఎస్ ద్వంధనీతి మానుకోవాలి

మాజీమంత్రి డీకే అరుణ



హైదరాబాద్, మేజర్‌న్యూస్ : టీఆర్ఎస్ ద్వంద్వ నీతి మానుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే డీకే.అరుణ అన్నారు. టీఆర్ ఎస్ సభ్యులు ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారని పేర్కొన్నారు. టీఆర్ ఎస్ సభ్యులు నీతులు చెప్పడం ఆపాలన్నారు. సభలోకి పోలీసులను చొప్పించరాని, ముందస్తు వ్యూహంతోనే చేశారని ఆరోపించారు. ప్రభుత్వ హామీల అమలు గురించి గవర్నర్ ప్రసంగంలో లేనే లేదన్నారు. సభలో నిరసన వ్యక్తం చేయడం సర్వసాధారణమని ఆమె అన్నారు. సస్పెన్షన్లకు భయపడమని తేల్చి చెప్పారు.

సభలో కాంగ్రెస్ సభ్యుల సస్పెన్షన్‌కు కుట్ర

మాజీ మంత్రి చిన్నారెడ్డి



హైదరాబాద్, మేజర్‌న్యూస్ : తమ పార్టీ సభ్యులను సస్పెండ్ చేసేందుకు టీసర్కార్ కుట్ర పన్నిందని కాంగ్రెస్ ఎమ్మెల్యే చిన్నారెడ్డి అన్నారు. విపక్షాలు సభలో ఆందోళన చేయడం, నిరసన తెలపడం సర్వ సాధారణమన్నారు. గతంలో, ప్రస్తుత శాసనసభా వ్యవహారాలశాఖమంత్రి హరీష్ రావు కూడా మైకును విరిశారని గుర్తు చేశారు. గవర్నర్ ప్రంగాన్ని అడ్డుకుని, పేపర్లను చించి పైకి విసిరారని వారా ఇప్పుడు మాకు నీతులు చెప్పేది ప్రశ్నించారు. మండలి చైర్మన్ స్వామిగౌడ్ కంటికి గాయం పేరుతో తమను సస్పెండ్ చేయాలని పన్నాంగ పన్నారని మండిపడ్డారు. ఎప్పుడూ ఇంతమంది పోలీసులను వెల్ లో చూడలేదన్నారు. చైనా వాల్ లాగా పోలీసులతో తమను అడ్డుకున్నారని పేర్కొన్నారు. ఇది పోలీసు రాజ్యంగా ఉందని విమర్శించారు.

ఆదుకోవాల్సిన కేంద్రం మాటలే చెప్తోంది: చంద్రబాబు

అమరావతి, సూర్య బ్యూరో : హోదా ఐదేళ్లు కాదు పదేళ్లు ఇస్తామని మేనిఫెస్టోలో పెట్టిన బీజేపీ ఇప్పుడు తమపై ఎదురుదాడి చేయడం సరికాదని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ఏపీని ఆదుకోవాల్సింది పోయి ఇప్పటికీ మాటలు మ్రామే చెబుతోందని ఆయన అన్నారు. తాము విభజన చట్టంలో ఉన్నవే అడుగుతున్నామని అన్నారు. హోదా, రాయితీలు ఇవ్వలేమని ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ నిర్మొహమాటంగా ప్రకటించారని, అందువల్లే తాము కేంద్రం నుంచి వైదొలిగామని చంద్రబాబు స్పష్టం చేశారు. వాజ్‌పేయి హయాంలో 29మంది ఎంపీలున్నా కేంద్రంలో చేరలేదని, ఏ షరతులు లేకుండా అప్పట్లో మద్దతిచ్చామని బాబు గుర్తు చేశారు. కేంద్రంలో పదవుల కోసం టీడీపీ ఎప్పుడూ ఆరాటపడలేదని అన్నారు. హోదా ఉన్న రాష్ట్రాలకు పారిశ్రామిక రాయితీలు పొడిగించారని, మరలాంటప్పుడు ఏపీకి పారిశ్రామిక రాయితీలు ఎందుకు ఇవ్వరని చంద్రబాబు ప్రశ్నించారు.



దేశంలో మత్స్య ఉత్పత్తుల్లో ఏపీ వాటా 46 శాతం : చంద్రబాబు




దేశంలో మత్స్య ఉత్పత్తుల్లో ఏపీ వాటా 46 శాతం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఏర్పాటు చేస్తోన్న ఆక్వా వల్ల రాష్ట్రానికి రూ.17 వేల కోట్ల విదేశీమారకద్రవ్యం వస్తోందని ఆయన అన్నారు. సోమవారం వన్నామి రొయ్యల బ్రూడ్ స్టాక్ మల్టిప్లికేషన్ సెంటర్, అక్వాటిక్ క్వారంటైన్ ఫెసిలిటీ సంస్థలకు సీఎం చంద్రబాబు అమరావతి నుంచి రిమోట్ లాకింగ్ విధానంలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్వా ఉత్పత్తులు ప్రపంచమంతా అమ్మేలా నాణ్యత పాటించాలని చెప్పారు. మన ఉత్పత్తుల్లో నాణ్యత లేకుంటే రైతులే నష్టపోతారని అన్నారు. ఆక్వా సాగులో సంస్కరణలు తీసుకొస్తున్నామని ఈ సందర్భంగా చంద్రబాబు పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి అభయం సర్వేల్లో ప్రతికూలం

- సిట్టింగ్‌ల్లో టెన్షన్... టెన్షన్
- ఇద్దరు ఫస్టు క్లాసులు ఐదుగురికి పాసు మార్కులు
- ముగ్గురు ఫెయిల్
- పాస్ మార్కుల్లోనే మంత్రి

(ఖమ్మం–సూర్యబ్యూరో): టిఆర్‌యస్ అధినేత రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు సిట్టింగ్‌లకు అభయమిచ్చాడు. ఒకరిద్దరు మినహ దాదాపు ఇప్పుడున్న వారే తిరిగి పోటిచేస్తారనే సంకేతాలు రావటంతో ఎమ్మెల్యేల్లో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమకే టిక్కెట్ వస్తుందన్న విశ్వాసం వారిలో పెరిగింది. కాని మరో ప్రభుత్వేతర సంస్థ నిర్వహించిన సర్వేల్లో చాలా మంది సిట్టింగ్‌లకు ప్రతికూలంగా ఉన్నట్లు తెలుస్తుంది. ముఖ్యమంత్రే స్వయంగా తాను రెండు సర్వేలు నిర్వహించగా ఒక దానిలో 103, మరో దాంట్లో 106 సీట్లు టిఆర్‌యస్‌కు వస్తున్నట్లు చెప్పారు. నిజంగా ముఖ్యమంత్రి చేయించిన సర్వేలో అంతే వచ్చినా రాకపోయినా పాలక పార్టీమీద కొంత వ్యతిరేకత ఉండటం సహజం. దాన్ని అధిగమించి తమకు సీట్లు వస్తాయని చెప్పటం ద్వారా తమ ఎమ్మెల్యేలకు భరోసా ఇవ్వటం ద్వారా తిరిగి మనమే అధికారంలోకి రాబోతున్నామని చెప్పారు.ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 10 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా తాజాగా ఒక అన్‌లైన్ మీడియా సంస్థ నిర్వహించిన సర్వేలో 7 గురు ఎమ్మెల్యేలు పాసుకాగా ముగ్గురు ఫెయిల్ అయ్యారు. 7 గురిలో ఇద్దరికి ఫస్టుక్లాసు మార్కులు రాగా ఐదుగురు పాసు మార్కులు పొందారు. ఐదుగురిలో అభివృద్ధిలో దూసుకుపోతున్న జిల్లా మంత్రి తుమ్మల నాగేశ్వరావుకు కూడా పాసు మార్కులు మాత్రమే రావటం గమనించదగ్గ విషయం.గత ఎన్నికల్లో ఒక్కసీటు మాత్రమే గెలిచిన టిఆర్‌యస్‌కు ఈ సారి ఐదు నియోజకవర్గాల్లో గెలిచే ఆవకాశాలు ఉన్నట్లు ఆ సర్వే తెలుపుతుంది. గతంలో కూడా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఐదుసీట్లు టిఆర్‌యస్‌కు వస్తాయని ఉస్మానియా విద్యార్థులు నిర్వహించిన సర్వేకూడా చెప్పింది. ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి గెలుపొంది టిఆర్‌యస్ తీర్దం పుచ్చుకున్న పువ్వాడ అజయ్ కుమార్‌కు గెలుపు శాతం 43 ఉండగా ఓటమిశాతం 48 గా ఉన్నట్లు ఆసర్వే సారంశం. ఏటు చెప్పలేని వారు 9 శాతంగా ఉన్నారు. మంత్రి తుమ్మల గెలుపు శాతం 45 ఉండగా ఓటమి శాతం 48 చెప్పలేమనే వారు 7శాతం ఉన్నారు. తెలుగుదేశంకు చెందిన డైనమిక్ లీడర సండ్ర వెంకటవీరయ్య గెలుపు శాతం 47 ఉండగా ఓటమి 46 శాతం ఉంది. చెప్పలేని వారు 7 శాతం ఉన్నారు. గత ఎన్నికల్లో టిఆర్‌యస్ తరుపున పోటిచేసి గెలిచిన ఏకైక శాసనసభ్యుడు జలగం వెంకట్రావు గెలుపు 44శాతం ఉండగా ఓటమి 46 చెప్పలేమనే వారు 10 శాతం ఉన్నారు. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య గెలుపు శాతం 40 మాత్రమే ఉండగా ఓటమిశాతం 50గా ఉంది. చెప్పలేని వారు 10 శాతం ఉన్నారు. మధిర నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న టిపిసిసి వర్కింగ్ ప్రసిడెంట్ మల్లుభట్టి విక్రమార్క గెలుపు శాతం 60 ఉండగా ఓటమి శాతం 33 గా ఉంది. చెప్పలేమనే వారి శాతం 7 మాత్రమే ఉంది. భద్రాచలం నుంచి సిపియం శాసనసభ్యుడుగా ఉన్న సున్న రాజయ్య జిల్లాలోనే అత్యధిక మార్కులతో 64 సంపాదించి టాఫర్‌గా నిలిచారు. ఆయన ఓటమిశాతం కేవలం 25 మాత్రమే ఉంది. చెప్పలేమనే వారి శాతం 11 ఉంది. ఇక వైకాపా నుంచి అధికార టిఆర్‌యస్ తీర్దం పుచ్చుకున్న ముగ్గురు శాసనసభ్యులకు ఫెయిల్ మార్కులు రావటం గమనార్హం. వీరిలో పినపాక ఎమ్మెల్యే పాయంకు 24 మార్కులు రాగా ఆశ్వారావుపేట ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లుకు 22 మార్కులు, వైరా ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్‌కు కేవలం 18 శాతం మార్కులు మాత్రమే వచ్చాయి. దీంతో సిట్టింగ్ అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. ఎన్నికల వాతావరణం నియోజకవర్గాల్లో చోటుచేసు కోవడంతో రాజకీయాల మరింత వేడుక్కుతున్నాయి. ఇప్పటికే ఆశావాహులు నియోజక వర్గాల్లో పర్యటనలు ప్రారంబించటంతో ప్రజల్లో వారి పట్ల పల్స్‌ను తెలుసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. సిట్టింగ్‌లకు తిరిగి ఎన్నిక కావటం ప్రతిష్టాత్మకం కాగా కొత్తగా వచ్చేవారు ఛాలంజ్‌గా తీసుకోనున్నారు. రానున్న ఎన్నికల్లో ఎదటి పార్టీ నుంచి ఎవరు తమకు ప్రత్యర్ది కాబోతున్నారంటూ కూఫీలాగుతున్నారు. ఎవరైతే తెలికగా బయట పడవచ్చో చూసుకుంటున్నారు. వారైతే బాగుంటుందనే అభిప్రాయంతో ఉన్నారు. ఇప్పటికే కొన్ని రాజకీయపార్టీల్లో మ్యాచ్‌ఫిక్సింగ్ రాజకీయాలు నడుస్తున్నాయి. తమ నియోజకవర్గంలో బలహీనమైన అభ్యర్దులను పెట్టెందుకు ముందుగానే మాట్లాడుకోవటం మీ పార్టీ నుంచి నువ్వ మాపార్టీ నుంచి నేనే గెలివాలనే సూత్రం పాటిస్తున్నట్లు గుసగుసలు బయలు దేరాయి. ఇది వారుకి ప్రయోజనం చేకూర్చినప్పటికి పార్టీకి మాత్రం తీరని నష్టం జరుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. దీనిపై కార్యకర్తలు ఆగ్రహంగా ఉన్నారు. పార్టీలు మారిన వారి పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. ప్రధానంగా వైకాపా నుంచి గెలిచి అధికార టిఆర్‌యస్‌లో చేరిన వారి పట్ల ఓటర్లు కసిగా ఉన్నట్లు తెలుస్తుంది. అయితే డబ్బు, ఇతర ప్రలోభాలు ఎంత వరకు పనిచేస్తాయి. ప్రతిపక్షాలు అధికార పార్టీ ఆవకాశాలను ఏవిందంగా ఎదుర్కొం టుంది. అనేదానిపై ఫలితాలు ఆధారపడి ఉంటాయి. సర్వేలు నిజమెంత ఉన్నా అభ్యర్దులు కష్టపడక పోతే ఇబ్బందులు తప్పవనే తెలస్తుంది. తమకు ఎన్నికోట్లు నిధులు తెచ్చి అభివృద్ధి చేశారనే దాని కన్నా తమ నియోజకవర్గ ప్రజల కష్టసుఖాల్లో ఏవిధంగా పాలు పంచుకున్నాడనే గీటురాయిగా ఉంటుంది. నిత్యం ప్రజలతో ఉండే వారినే ఆధరిస్తున్న సందర్బాలను మనం చూస్తున్నాం. అందుకే ఇటీవల కొందరు నేతలు నియోజకవర్గ సమస్యలపై స్పందిస్తున్నారు. కాలనీల్లో , గ్రామాల్లో పర్యటనలు చేపట్టారు. ఇవి ముందు ముందు మరింత పెరిగే ఆవకాశాలు ఉన్నాయి. ఏది ఏమైనా సర్వేల ఆధారంగా సిట్టింగ్‌లు తమ గెలుపు ఆవకాశాలను మెరుగు పరుచుకోకపోతే నష్టపోతారు.





అంతర్జాతీయ సర్వీసుల అంశం పరిశీలన

(అమరావతి, సూర్య ప్రధాన ప్రతినిధి) : సింగపూర్ విమానయాన సంస్థకు చెందిన సిల్క్ ఎయిర్ గన్నవరం విమానాశ్రయం నుంచి అంతర్జాతీయ సర్వీసులు నడిపేందుకు ఉన్న అవకాశాలపై దష్టి పెట్టింది. సిల్క్ఎయిర్ భారత ఉపాధ్యక్షుడి ఆధ్వర్యంలోని బందం విమానాశ్రయాన్ని తాజాగా సందర్శించింది. అంతర్జాతీయ సర్వీసులు నడిపేందుకు ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. సింగపూర్ నుంచి ఇక్కడికి నేరుగా విమాన సర్వీసులను నడిపేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించడానికే ఈ బందం విచ్చేసింది. అంతర్జాతీయ టెర్మినల్ భవనంలో ఉన్న ఏర్పాట్లు, రన్‌వే సహా అన్నింటినీ పరిశీలించారు. విమానాశ్రయంలో ఉన్న ఏర్పాట్లపై వారు సంత ప్తి వ్యక్తం చేసి వెళ్లారు. విజయవాడ నుంచి ముంబయికి ప్రస్తుతం నడుస్తున్న ఎయిరిండియా సర్వీసును దుబాయ్ వరకూ పొడిగించనున్నట్టు కేంద్ర విమానయానశాఖ ఇప్పటికే ప్రకటించింది. తాజాగా సిల్క్ఎయిర్ కూడా సానుకూలంగా స్పందించడం శుభపరిణామం. విజయవాడ నుంచి నేరుగా దుబాయ్, సింగపూర్ దేశాలకు విమాన సర్వీసులను తొలుత ప్రారంభించాలని స్థానిక పారిశ్రామిక, వాణిజ్య సంఘాలు చాలాకాలంగా కోరుతున్నాయి. ఆ రెండు దేశాలకు వెళ్లిపోతే ప్రపంచంలో ఎక్కడికైనా తేలికగా చేరుకునేందుకు విమాన కనెక్టివిటీ ఉంటుంది. అందుకే తొలుత కనీసం వారంలో రెండు మూడు రోజులైనా దుబాయ్, సింగపూర్‌లకు సర్వీసులను నడపాలని ఇక్కడి వాళ్లు కోరుతున్నారు. మార్చి 15 తర్వాత అంతర్జాతీయ సర్వీసులు నడిపేందుకు తాము సిద్ధంగా ఉంటామంటూ విమానాశ్రయం అధికారులు ఎయిరిండియాకు కొద్దిరోజుల కిందట లేఖను సైతం సమర్పించారు. విదేశీ సర్వీసును ప్రారంభించాలంటే కనీసం 45 రోజుల ముందు నుంచి టిక్కెట్లను విక్రయించేందుకు షెడ్యూల్‌ను విడుదల చేయాల్సి ఉంటుంది. అందుకే ముందస్తుగా ఎయిరిండియాకు విమానాశ్రయం తరఫున అనుమతి తెలియజేస్తూ లేఖను పంపించారు.

సేవలకు సిద్ధమైన సిబ్బంది

విజయవాడ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన 15 మంది సిబ్బంది గన్నవరం విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ సేవలు అందించేందుకు సిద్ధమయ్యారు. ఇమ్మిగ్రేషన్ సేవలను స్థానిక పోలీసుల ద్వారానే నిర్వహించేందుకు కేంద్ర హోంశాఖ నిర్ణయించింది. తొలి దశలో 15 మంది పోలీసు సిబ్బందికి గన్నవరం విమానాశ్రయంలో వారం రోజుల శిక్షణ అందించారు.

ఆక్వా హబ్‌గా ఏపీ సీ కోస్ట్

- విశాఖలో వన్నామి రొయ్యల బ్రడ్ స్టాక్ మల్టిప్లికేషన్ సెంటర్
- అక్వాటిక్ క్వారంటైస్ ఫెసిలిటీ కేంద్రాల నిర్మాణం
- సచివాలయంలో సీఎం చంద్రబాబు శంకుస్థాపన

(అమరావతి, సూర్య ప్రధాన ప్రతినిధి): నవ్యాంధ్ర సముద్రతీర ప్రాంతం ఆక్వా హబ్ గా రూపొందుతోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. చేపలు, రొయ్యల ఉత్పత్తిలో దేశంలోనే రెండో స్థానంలో నిలిచిన ఏపీ ఆక్వా రంగంలో డబుల్ డిజిట్ వ ద్ధి రేటు సాధించే దిశగా సాగుతోందన్నారు. విశాఖపట్నం జిల్లా పాయకరావుపేట నియోజకవర్గంలోని నక్కవాని పాలెం బంగారమ్మపేటలో వన్నామి రొయ్యల బ్రూడ్గ స్టాక్ మల్టిప్లికేషన్ సెంటర్, అక్వాటిక్ క్వారంటైస్ ఫెసిలిటీ కేంద్రాల నిర్మాణాలకు సచివాలయంలోని ఒకటో నెంబర్ బ్లాక్ గ్రీవెన్స్ సెల్ లో సీఎం చంద్రబాబునాయుడు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలోనే చేపలు, రొయ్యల ఉత్పత్తిలో ఏపీ 70 శాతం వాటాతో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. రొయ్యల ఉత్పత్తిలో ప్రపంచంలోనే మూడో స్థానంలో నిలిచిందన్నారు. 2016-17లో ఇండియా నుంచి రూ.37 వేల కోట్ల మత్స్య ఉత్పత్తులు ఎగుమతి జరిగితే వాటిలో ఏపీ వాటా రూ.17 వేల కోట్లని సీఎం చంద్రబాబునాయుడు తెలిపారు. 2015 మత్స్య విధానం ద్వారా 2016-17లో 27.66 లక్షల టన్నుల మత్స్య ఉత్పత్తి రాష్టంలో జరగ్గా, 2019-20 నాటికి రూ.42 లక్షల టన్నులను లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనిద్వారా స్థూల విలువ జోడింపు రూ.80 వేల కోట్లు సాధించే దిశగా ప్రణాళికలు రూపొందించుకున్నామన్నారు. రాష్ట్రంలో మత్స్యకార రైతులు... నాణ్యత కలిగి, వ్యాధుల్లేని రొయ్య పిల్లలను ఇంతవరకూ చెన్నై నుంచి దిగుమతి




చేసుకునేవారన్నారు. ఏపీలోని సముద్ర తీరం ఆక్వా హబ్ గా రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దీనిలో భాగంగా రాష్ట్రంలో బ్రూడ్గ స్టాక్ మల్టిప్లికేషన్ సెంటర్, అక్వాటిక్ క్వారంటైన్ ఫెసిలిటీ స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. వాటిద్వారా రైతులకు వ్యాధుల్లేని, నాణ్యత కలిగిన రొయ్య పిల్లను పంపిణీ చేయడానికి వీలుకలుగుతుందన్నారు. దీనివల్ల మత్స్యకార రైతుల ఆదాయం పెరగడమే కాకుండా రాష్ట్రంలో ఆక్వా సాగు విస్తరణకు అవకాశం కలుగుతుందన్నారు. ఇప్పటికే హార్టీకల్చర్ సాగులో ఏపీ దేశంలోనే నెంబర్ వన్ గా నిలిచిందన్నారు. హేచరీస్ నిర్వాహకులకు ఆదాయ పెంపుదలతోనే సరిపెట్టకుండా కాలుష్య నివారణకు గట్టిగా క షి చేయాలన్నారు. ఆక్వా ఉత్పత్తులు ప్రాసెసింగ్ సమయంలో కాలుష్యానికి పెద్దపీట వేయాలన్నారు. లేకుంటే చర్యలు తీసుకోవడానికి వెనుకాడేదిలేదని సీఎం చంద్రబాబునాయుడు హెచ్చరించారు. నాణ్యమైన ఆక్వా ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతుల చేయాలన్నారు. లాభాల కోసం హేచరీ యజమానులు నాణ్యతలేని ఆక్వా ఉత్పత్తులను ఎగుమతి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబునాయుడు హెచ్చరించారు. బ్రూడ్గ స్టాక్ మల్టిప్లికేషన్ సెంటర్ ను 30 ఎకరాల్లో రూ.48 కోట్లతో నిర్మిస్తున్నామన్నారు. అక్వాటిక్ క్వారంటైన్ ఫెసిలిటీని రూ.20.38 కోట్లతో నిర్మాణం చేపట్టామన్నారు. ఈ రెండింటినీ 9 నెలల్లో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సీఎం చంద్రబాబునాయుడు ఆదేశించారు.

50 ఏళ్లు దాటిన మత్స్యకారులకు పెన్షన్లు

మత్స్యకారుల సంక్షేమానికి తెలుగుదేశం ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని సీఎం చంద్రబాబునాయుడు తెలిపారు. 50 ఏళ్లు దాటిన మత్స్యకారులకు పెన్షన్లు అందజేయనున్నామన్నారు. సముద్రంలోని సుదూర ప్రాంతాల్లో చేపలు వేటాడేలా రాష్ట్రంలో సముద్రతీరంపై ఆధారపడే మత్స్యకారులకు యంత్రసాయంతో నడిచే బోట్లు ఇవ్వనున్నట్లు సీఎం తెలిపారు. విశాఖపట్నంలో వన్నామి రొయ్యల బ్రూడ్గ స్టాక్ మల్టిప్లికేషన్ సెంటర్, అక్వాటిక్ క్వారంటైస్ ఫెసిలిటీ కేంద్రాల నిర్మాణాల ద్వారా నాణ్యమైన రొయ్యలను దిగుమతి చేసుకునే కష్టాలు తీరుతాయని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యకార శాఖ మంత్రి సిహెచ్. ఆదినారాయణరెడ్డి తెలిపారు. తన నియోజకవర్గంలో ఆక్వా పరిశ్రమకు పెద్దపీట వేస్తూ, ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై పాయకరావుపేట ఎమ్మెల్యే అనిత, సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఆక్వా రంగంలో ఎదుర్కొంటున్న పలు సమస్యలను సీఎం చంద్రబాబునాయుడు హేచరీస్ యజమానులు వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ గోపాలకష్ణ ద్వివేది తదితరులు పాల్గొన్నారు.


‘బడి ఎగ్గొడితే ఫెయిలవుతారు’

ఎంపీ జేసీపై సీఎం చంద్రబాబు సెటైర్



(అమరావతి, సూర్య ప్రధాన ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ లాబీలో ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. పార్లమెంట్ సమావేశాలకు హాజరుకాకుండా తనను కలవడానికి వచ్చిన ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డిపై ముఖ్యమంత్రి చంద్రబాబు సెటైర్ వేశారు. జేసీ పార్లమెంట్ సమావేశాలకు హాజరుకాకపోవడంపై చంద్రబాబు స్పందిస్తూ “బడి ఎగ్గొడితే ఫెయిలవుతారు” అని సెటైర్ వేశారు. ముఖ్యమంత్రిని కలిసిన అనంతరం అసెంబ్లీ లాబీలో జేసీ మీడియాతో మాట్లాడారు. తాను ఎప్పుడూ ఫెయిల్ కానని ఈ సందర్భంగా చెప్పారు. “బడి ఎగ్గొట్టిన వారు... బ్యాక్ బెంచ్‌లో కూర్చున్న వారు... ఉన్నత స్థానానికి ఎదిగారు” అంటూ సీఎం వేసిన సెటైర్‌కు జేసీ జవాబిచ్చారు. తనకు రాజ్యసభకు వెళ్లాలనే ఆలోచన లేదంటూ ఓ రిపోర్టర్ అడిగిన ప్రశ్నకు బదులిచ్చారు. ఇదిలా ఉండగా, పార్లమెంట్ ఉభయ సభలు సోమవారం ప్రారంభం కాగానే టీడీపీ ఎంపీల ఆందోళనలతో ఉభయ సభలు దద్దరిల్లాయి. ఏపీని ఆదుకోవాలని, విభజన హామీలను అమలు చేయాలని డిమాండ్గ చేస్తూ ఉభయ సభల్లోనూ ఎంపీలు ఆందోళనకు దిగారు. ప్రశ్నోత్తరాల సమయం కొనసాగుతుండగా తెలుగు ఎంపీలు ప్లకార్డులతో పోడియం ముందుకు దూసుకు వెళ్లి నిరసన తెలిపారు. దీంతో సభా కార్యక్రమాలకు అంతరాయం ఏర్పడింది.


బిజెపితో పొత్తు ఉండదని జగన్ చెప్పగలడా? : మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట, సూర్య బ్యూరో : తెలుగుదేశం పార్టీ నుంచి ఇతర పార్టీల్లోకి ఎవరూ వెళ్లరని పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా చిలకలూరిపేట మార్కెట్ యార్డులో శనగల కొనుగోలు కేంద్రాన్ని ఈరోజు ఆయన ప్రారంభించారు. ఈ సంధ్భంగా మీడియాతో మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. పండించిన పంటలను నేరుగా మార్కెట్‌కే తెచ్చుకుని అమ్ముకుని లబ్ది పొందాలని సలహా ఇచ్చారు. రాష్ట్రాన్ని నాలుగు సంవత్సరాలుగా మోసం చేస్తున్న బిజెపిలోకి ఏ నాయకులూ చేరరని మంత్రి అన్నారు. బిజెపితో ఎన్నికలకు ముందు తర్వాత పొత్తు ఉండదని ఎస్సార్‌సీపీ అధినేత జగన్ చెప్పగలడా? అని సవాల్ చేశారు. ఎస్సార్‌సీపీ బిజెపితో లోపాయికారీ ఒప్పందం చేసుకుని రాజీనామా డ్రామాలు ఆడుతోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీసేలా ఎస్సార్‌సీపీ కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. ప్రతిపక్ష పార్టీకి ప్రజలు సమయం చూసి బుద్ధి చెబుతారన్నారు.

ఏపీని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చాలి

మంత్రి యనమల, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు





అమరావతి, సూర్య బ్యూరో : ఏపీ అసెంబ్లీలో మంత్రి యనమల, బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మధ్య ఆసక్తికర చర్చ జరిగింది. ఆర్థిక శాఖ మంత్రి వద్దే ఆరోగ్య శాఖ ఉంటే నిధుల విడుదలలో జాప్యం ఉండదని అన్నారు విష్ణుకుమార్ రాజు. ఏపీని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చాలని కోరారు. దీనికి స్పందించిన మంత్రి యనమల ఆరోగ్య శాఖ సీఎం వద్దే ఉందన్నారు. ఆయన సభలో లేనందున తాను సమాధానం చెబుతున్నానని చెప్పారు.

ఫొటోకెఎస్ఆర్1

యువశక్తి మనకున్న గొప్ప సంపద

స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు



(నరసరావుపేట, సూర్య ప్రత్యేక ప్రతినిధి): నరసరావుపేట డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంలో డాక్టర్ కోడెల సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్స్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువశక్తి మనకున్న గొప్ప సంపదని, యువతను సరైన దిశలో నడిపిస్తే గొప్ప దేశంగా తయారౌతుందన్నారు. దేశానికి, రాష్ట్రానికి యువత స్ఫూర్తిదాయకమన్నారు. ఉపాధ్యాయులు పాఠాలు బోధించడమే గాక మంచి విలువలు, అలవాట్లు నేర్పించాలన్నారు. విద్యార్థులు కేవలం చదువులే కాక వారిలో దాగివున్న నైపుణ్యం వెలికితీయడంలో నిపుణులుగా, గొప్ప క్రీడాకారులుగా తయారౌవాలని పిలుపునిచ్చారు. విదేశాల్లో పాఠశాల స్థాయి నుండే క్రీడాకారులను గుర్తించి పదును పెడతారని తద్వారా అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో పతకాలు సాధిస్తున్నారని అన్నారు. విద్యారంగంలో సాంకేతికత అందివుచ్చుకుంటూ డిజిటల్ క్లాస్ రూమ్‌లు ఏర్పాటు దిశగా అడుగులు వేస్తున్నట్లు వివరించారు. మానవ వనరుల్లో యువశక్తిని సద్వినియోగం చేసుకుంటే దేశాభివద్ధి సాధ్యమన్నారు. యువత సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేయకుండా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందన్నారు. యువతను సరైన విధంగా నడిపిస్తే అద్భుత విజయాలు సాధించవచ్చన్నారు. రాష్ట్ర జనాభాలో 35 శాతం యువత ఉందని తెలిపారు. ప్రభుత్వం కొత్త యువజన పాలసీ తెస్తున్నట్లు, యువత సమాజానికి ఉపయోగపడే విధంగా స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ కోడెల, మున్సిపల్ చైర్మన్ నాగసరవు సుబ్బరాయ గుప్తా, ఎంపీపీ ప్రభాకర్ ఇతర ఉన్నతాధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మొన్న స్కానియా నేడు ఓల్వో

- అమరావతి బ్రాండ్‌లో మరిన్ని
- రూ.13.50 కోట్ల వ్యయంతో 9 బస్సుల కొనుగోలు
- ప్రారంభించిన మంత్రి అచ్చెన్నాయుడు



(అమరావతి, సూర్య ప్రత్యేక ప్రతినిధి): రాజధానిలో రోడ్డు రవాణా సంస్థకు బ్రాండ్‌గా మారిన అమరావతి బస్సుల శ్రేణిలో నేడు మరికొన్ని బస్సులు చేరబోతున్నాయి. రూ.13.50 కోట్ల వ్యయంతో కొనుగోలు చేసిన 9 అమరావతి బస్సులను నేడు రాష్ట్ర రవా ణాశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు ప్రారంభించారు. తొలిదశలో స్వీడిష్ కంపెనీ స్కానియా బస్సులను అమరావతి శ్రేణిలో ఆర్టీసీ విజయవాడ డిపో నుంచి ప్రారంభించగా మలివిడతగా స్వీడిష్ దేశానికే చెందినవి అయినప్పటికీ ఈసారి ఓల్వో కం పెనీ బస్సులను అమరావతి శ్రేణిలో ప్రవేశ పెడుతున్నారు. నేడు ప్రారంభించిన తొమ్మిది బస్సులలో ఆరింటిని విజయవాడకు, మూడింటిని విశాఖకు కేటాయించారు. రాష్ట్రంలో విజయవాడ బస్ డిపో నుంచి అగ్రభాగం ‘అమరావతి’ బస్సులు నడుస్తున్నాయి. ఆర్టీసీ నడిపే హై ఎండ్గ సర్వీసులలో గరుడ ప్లస్, గరుడ, వెన్నెల, ఇంద్ర బస్సులు మంచి ఆదరణ కలిగి ఉన్నాయి. ఆర్టీసీ ప్రధాన పరిపాలనా కేంద్రం కూడా విజయవాడలోనే ఏర్పడింది. ఈ తరుణంలో ఆర్టీసీని బలోపేతం చేయటానికి హై ఎండ్గ శ్రేణిలో అత్యాధునిక బస్సుల కొనుగోలుకు సంస్థ నిర్ణయించింది. ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వటంతో స్వీడన్‌కు చెందిన అత్యాధునిక స్కానియా కంపెనీ బస్సులను కొనుగోలు చేశారు. హై ఎండ్గ శ్రేణిలో వీటికి ‘అమరావతి’ గా అప్పటి ఎండీ నం దూరి సాంబశివరావు నామకరణం చేశారు. అప్పటి నుంచి అమరావతి బ్రాండ్గ శ్రేణి ఏర్పడింది. అప్పటి వరకు గరుడ ప్లస్, గరుడ శ్రేణి బస్సులు కూడా అమరావతి ముందు ద్వితీయ స్థానానికి పరిమి తమైపోయాయి. అమరావతి బస్సులో సీటు అంటే హాటు కేకు! ఈ బస్సుల ద్వారా ఆర్టీసీ ఆర్జిస్తున్న మార్జిన్ అంతా, ఇంతా కాదు! సగటు ఆక్యుపెన్సీ 90 శాతం ఉంటున్నాయంటే ఈ బస్సులకు ఉన్న డిమాండ్గ ఏమిటో అర్థమై ఉంటుంది. ప్రైవేటు బస్సులను ఆశ్రయిం చేవారు కూడా ఆర్టీసీ అమరావతి బస్సుల్లో సీటు కోసం రిజర్వేషన్ చేయించుకుంటున్నారు. అమరావతి శ్రేణిలో ఇంతకుముందు కొనుగోలు చేసిన స్కానియా కంపెనీ బస్సులు, ప్రస్తుత ఓల్వో బస్సుల్లో అద్భుతమైన సౌ క ర్యాలు ఉంటాయి. ఆటోమేటిక్ గేర్స్, హై హార్స్‌పవర్ ఇం జన్, హై ఎయిర్ కండీషనింగ్ , సీసీ టీవీలు, వైఫై, ప్రతి సీటుకు టీవీ సదుపాయాలు ఈ బస్సుల్లో ఉన్నాయి. అమరావతి శ్రేణిలో మరిన్ని బస్సులను ప్రవేశపెట్టడంతో గరుడ శ్రేణి కంటే ఇప్పుడు వీటి వాటానే ఎక్కువగా ఉంది. అమరావతి బస్సులు ప్రస్తుతం 16 ఉన్నాయి. నేడు ప్రారంభించే వాటిలో 6 బస్సులు సమకూరటంతో వీటి మొత్తం సంఖ్య 22 కు చేరింది. గరుడ శ్రేణిలో 13, గరుడ ప్లస్ శ్రేణి 4 చొప్పున మొత్తం 17 బస్సులే ఉన్నాయి. వెన్నెల శ్రేణిలో 7 బస్సులు ఉన్నాయి. విజయవాడ బస్ డిపోలోని హైఎండ్గ బస్సులన్నింటిలోనూ ఇప్పుడు అమరావతి బస్సులే అగ్రభాగంగా మారాయి.

కోట్ల మంది ఏకం కావాల్సిన చరిత్రాత్మక అవసరం వచ్చిందిం : రఘువీరారెడ్డి



విజయవాడ, సూర్య బ్యూరో : రాజ్యాంగ బద్ధంగా మనకు సక్రమించిన హక్కులు కాపాడుకుద్దాం, మన జాతికి అవమానం జరుగుతుంటే భవిష్యత్ తరాలకు అన్యాయం జరుగుతున్నందున ఏకమవుదాం, అన్యాయంపై పోరాడేందుకు అందరు ఏకం కావాల్సిన చారిత్రాత్మక అవసరం వచ్చిందని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఎన్.రఘు వీరారెడ్డి పిలువు నిచ్చారు. రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో రఘువీరారెడ్డి మాట్లాడుతూ ఏప్రిల్ 5 తర్వాత మీ రాజకియాలు చేసుకోండి, రాష్ట్ర ప్రయోజనాల దష్ట్యా రాజకీయలకు అతీతంగా 25 రోజులు మీ రాజకీయాలను పక్కన పెట్టి పోరాడుద్దాం అన్నారు. ఇది చివరి బడ్జెట్ అని గుర్తు చేశారు. ఆ బడ్జెట్లోనే సవరణలు జరగాలి, ఏపికి ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీల అమలుకు పోరాడుదామని పిలువు నిచ్చారు. ఏఐసిసి అధ్యక్షులు రాహుల్ గాంధీ మాటా ఇచ్చారు. 2019లో కేంద్రంలో యూపిఏ ప్రభుత్వం అధికారంలో వస్తే తొలి సంతకం ఏపికి ప్రత్యేక హోదా కోసం అన్నారు, ఏపికి హోదా, విభజన చట్టంలోని హామీల అమలుకు అఖిల భారత కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. కాంగ్రెస్ ద్రోహం చేసిందిని అంటున్నారు. ఇది బాద్యత కలిగిన వ్యక్తులు మాట్లాడడం కరెక్ట్ కాదు అన్నారు. అనాడు రాష్ట్ర విభజనకు అందరూ బాధ్యులే అని గుర్తు చేశారు. దేశంలో థర్డ్ ఫ్రంట్ కు అవకాశం లేదని కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో 2019కి కేంద్రంలో యూపి సారధ్యంలో రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని ధీమా వ్యక్తం చేశారు.

అభిప్రాయాలు దాచుకోలేదు... సమస్యల నుంచి పారిపోలేదు

- అన్నీ పోగొట్టుకున్నా నేను భయపడలేదు
- ఇంటితో పాటు పార్టీ కార్యాలయం నిర్మించే ఆలోచన
- 14న మీ ప్రశ్నలకు సమాధానం చెబుతా
- జనసేన అధినేత పవన్‌కల్యాణ్
- ఇంటివాడైన జనసేనాని
- భవిష్యత్‌లో పార్టీ కార్యాలయం
- అత్యాధునిక సౌకర్యాలతో గృహ నిర్మాణం

(అమరావతి, సూర్య ప్రధాన ప్రతినిధి): తన అభిప్రాయాలను ఎప్పుడూ దాచుకోలేదని, ఏదైనా సమస్య నుంచి తాను ఎప్పుడూ పారిపోలేదని అన్నారు సినీ నటుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్. సోమవారం కాజ సమీపంలో టోల్‌గేట్ వద్ద నూతన ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ‘మా నాన్నగారు మంగళగిరిలో పోలీస్ కానిస్టేబుల ్గా పనిచేశారు. మా నాన్న పనిచేసిన ప్రాంతంలో ఇంటి నిర్మాణానికి శంకు స్థాపన చేయడం చాలా సంతోషంగా ఉంది. అభిమానులు ముందుకొచ్చి మంచి స్థలం చూపించారు. ఇంటితో పాటు పార్టీ కార్యాలయం నిర్మించే ఆలోచనలో ఉన్నాం. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అమరావతిది కేంద్ర స్థానం. ప్రజలకు చేరువయ్యేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రజలకు సంబంధించిన సమస్యలు తెలుసుకొని వాళ్లకు దగ్గర అవడానికి ఇక్కడ ఇల్లు నిర్మాణం చేపట్టాం. ఇంటి నిర్మాణానికి సహాయం చేస్తున్న వారందరికీ ధన్యవాదాలు’అని అన్నారు. అనంతరం విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు.

పార్టీ విస్తరణకు సంబంధించి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు?

పవన్‌కల్యాణ్: ప్రస్తుతం ఇంటి శంకుస్థాపన గురించి మాట్లాడతా. మార్చి 14 తర్వాత పూర్తి స్పష్టత ఇస్తా. ఒకదాని తర్వాత ఒకటి చేసుకుంటూ వెళ్తా.

నిజ నిర్ధారణ కమిటీ అన్ని విషయాలను తేటతెల్లం చేసింది. రాష్ట్రానికి జరిగిన అన్యాయానికి టీడీపీ కేంద్ర మంత్రి వర్గం బయటకు వచ్చింది. మీరెలాంటి నిర్ణయం తీసుకోనున్నారు?

పవన్‌కల్యాణ్: మార్చి 14న దీనిపై ఏం చెప్పబోతున్నానో నాకు స్పష్టత ఉంది. నా అభిప్రాయాలను ఎప్పుడూ దాచుకోలేదు. ఏదైనా సమస్య నుంచి పారిపోను. ఇవన్నీ నేను చాలా స్పష్టంగా మాట్లాడతా. దీనిపై ఇప్పుడే మాట్లాడవచ్చు. ఆవిర్భావ సభలో మాట్లాడితేనే బాగుంటుందని అనుకుంటున్నా. ఒకరోజే కాబట్టి మీరు సహనంతో ఉండాలి. ఇప్పటికే దీనిపై చాలా ట్రైలర్లు ఇచ్చాను. మొత్తం సినిమా ముక్కలు ముక్కలుగా ట్రైలర్‌లో చూసేస్తే ఏం బాగుంటుంది.

ఏపీకి కేంద్రం అన్యాయం చేసిందని మీకు అనిపిస్తోందా?

పవన్‌కల్యాణ్: నేను చాలా రోజుల నుంచి దీనిపై మాట్లాడుతున్నా. నేను ఎవరినీ వెనకేసుకురాను. వ్యక్తిగతంగా నాకు ఎవరితోనూ శత్రుత్వం ఉండదు. సాధ్యమైనంత వరకూ సయోధ్యతోనే వెళ్లేందుకు ప్రయత్నిస్తా. ప్రజా సమస్యల పట్టించుకోని పక్షంలో నా స్పందన బలంగా ఉంటుంది.

మార్చి 14 తర్వాత జనసేన ప్రజా ఉద్యమానికి వెళ్లబోతోందా?

పవన్‌కల్యాణ్: నేను ఇచ్చిన పిలువునకు స్పందించి అందరూ ముందుకు వచ్చారు. వారితో పంచుకుంటేనే బాగుంటుంది. రెండురోజుల్లో అన్నీ తెలుస్తాయి.

పార్టీ కార్యక్రమాలు ఏంటి?:

పవన్‌కల్యాణ్: ఉగాది పండగ వరకూ ఇక్కడే ఉండబోతున్నా. పార్టీకి సంబంధించిన పనులన్నీ జరుగుతాయి. ఇది రాజకీయ ఒత్తిడితో కూడుకున్నది. నిజంగా జనసేన నిర్ణయాలకు కట్టుబడి పనిచేసేవారు రావాలని కోరుకుంటున్నా. ప్రజా జీవనానికి ఇది దగ్గరదారి అనుకునేవాళ్లు నాకు నచ్చరు.



2007నుంచి రాజకీయాల్లో ఉన్నా. ఎన్నికల తర్వాత మనుషులు ఎలా మారారు? అన్నదానిపై అవగాహన ఉంది. నేను భావితరాలను దృష్టిలో పెట్టుకుని వస్తున్నా. వీళ్లకు బలమైన దిశానిర్దేశం చేయాలి. నాపై పెద్ద బాధ్యత ఉంది. ఒక రోజు ఆలస్యమైనా చాలా బలంగా అడుగులు వేస్తాం.

మీ పార్టీ కూడా మూస పద్ధతిలో కనిపిస్తోంది?

పవన్‌కల్యాణ్: ఒక పదో తరగతి విద్యార్థికి ఇంకో పదో తరగతి విద్యార్థి పాఠం చెప్పగలడా? ఉపాధ్యాయులే చెప్పాలి. వేలల్లో టీచర్లు ఉన్నారు. ఒక సీనియార్టీని కానీ, అనుభవన్ని కానీ తక్కువ చేయను. దీనికి కారణం అస్సాం గణ పరిషత్ విద్యార్థులతో నడిపించారు. ఉవ్వెత్తున కెరటంలా లేచి ఆ తర్వాత చల్లబడిపోయింది. యువత తాలూకు ఉడుకు నెత్తురు ఉండాలి. అలాగే పెద్దవారి తాలూకు సంయమనం, అనుభవం చాలా అవసరం. అయితే ఆ పార్టీ నుంచి, ఈ పార్టీ నుంచి మీరు వచ్చేయండని నేనెవర్నీ పిలవను.

ఇతర పార్టీల నుంచి వచ్చేవారిని ఆహ్వానిస్తారా?

పవన్‌కల్యాణ్: నాతో పాటు చాలా మంది కొత్తవారు ఉన్నారు. మీరు ఇద్దరు ముగ్గుర్ని మ్రామే చూపించి అడుగుతున్నారు. ఇది అన్యాయం.

ఎన్నికల ముందే ఆస్తుల ప్రకటిస్తారా?

పవన్‌కల్యాణ్: నా ఆస్తులన్నీ చాలా క్లియర్‌గా ఉంటాయి. ప్రజలు ప్రేమతో ఇచ్చినవి. రెండు దశాబ్దాలుగా నేను కష్టపడి సంపాదించాను. ఒకసారి అన్నీ పోగొట్టుకున్నా.మళ్లీ సంపాదించుకున్నా. ఆస్తులు వెల్లడించడానికి భయపడను. సమయం వచ్చినవ్పుడు చెబుతా.

తెలుగుదేశంలో మీరు అంతర్భాగమని, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం చంద్రబాబు చేస్తున్నారని వైకాపా ఆరోపణలు చేస్తోంది?

పవన్‌కల్యాణ్: అవునా! మరి వైకాపా వారికి నరేంద్రమోదీ దర్శకత్వం చేస్తున్నారా? ఒక మాట అనడం చాలా ఈజీ. నేను ఎలా ఆలోచిస్తానో ఎందుకు బయటకు చెబుతాను. సమయం, సందర్భం వచ్చినప్పుడు అన్నీ చెబుతా. నా పొలిటికల్ స్టాండ్గ చాలా సార్లు చెప్పా.

మార్చి 14 తర్వాత పార్టీ పరంగా ఏం జరగబోతోంది?

పవన్‌కల్యాణ్: చాలా మంది వచ్చారు. 40వేల మంది ఆలోచనా పరుల్ని తీసుకున్నాం. ప్రతీ జిల్లా నుంచి కొంతమందిని ఎంపిక చేసుకున్నాం. వారి నుంచి 12మంది సభ్యుల స్పీకర్‌ప్యానెల్ కూడా సిద్ధం చేశాం. వారిని త్వరలోనే ప్రకటిస్తాం. మా తండ్రిగారేమీ ముఖ్యమంత్రికాదు. మిగిలిన వాళ్లలా నేను త్వరగా అన్ని ఏర్పాట్లు చేసుకోవడం అంత ఈజీ కాదు. ప్రతీసారి నాకు ఎదురయ్యే శల్య పరీక్షకు గురి చేసే ప్రశ్నలను తట్టుకుని నిలబడి ప్రజల నమ్మకాన్ని సాధించి ముందుకు తీసుకువెళ్లడం కష్ట సాధ్యం. దానికి ఓపిక, సహనం కావాలి. ఆ రెండూ నాకున్నాయి. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రాజధాని అమరావతిలో నివాసమేర్పరుచుకున్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కాజా సమీపంలో సొంత ఇంటి నిర్మాణానికి సోమవారం ఉదయం ఆయన భూమిపూజ చేశారు. మురగన్ హోటల్ రోడ్డులోని సాహితీ వెంచర్‌లో ఈ ఇంటి నిర్మాణం చేపట్టనున్నారు. దీని కోసం కుటుంబ సమేతంగా ఆదివారం రాత్రి విజయవాడకు చేరుకుని ఓ ప్రైవేటు హోటల్‌లో పవన్‌బస చేశారు. అత్యంత సన్నిహితులు, పార్టీ ముఖ్య నాయకులకు మాత్రమే ఈ కార్యక్రమానికి ఆహ్వానం అందింది. భవిష్యత్తులో దీన్ని పార్టీ కార్యాలయంగానూ వినియోగించుకునే అవకాశముందని పార్టీవర్గాల సమాచారం. నవ్యాంధ్ర నూతన రాజధాని అమరావతికి అత్యంత సమీపంలో గుంటూరు, విజయవాడ నగరాల మధ్య జాతీయ రహదారిని ఆనుకుని కాజా గ్రామ సమీపంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్, తన సొంత ఇంటి నిర్మాణానికి ఈ ఉదయం వేద మంత్రాల మధ్య శాస్త్రోక్తంగా భూమిపూజ జరిపించారు. తన భార్య అన్నా లెజినోవా, ఇద్దరు బిడ్డలతో కలసి వచ్చిన ఆయన, హోమ క్రతువును తానొక్కరే పూర్తి చేశారు. ఇక రెండు ఎకరాల సువిశాల విస్తీర్ణంలో అన్ని ఆధునిక హంగులతో ఈ భవంతి నిర్మాణం సాగనుండగా, ఆరు నెలల వ్యవధిలో పూర్తి చేసి గహ ప్రవేశం చేయాలన్నది పవన్ అభిమతం. అమరావతిలో కాజ గ్రామ పరిధిలో పవన్ సొంత ఇల్లు ప్రత్యేకతలతో నిర్మించబడుతుంది. ఆధునిక హంగులతో సాగనున్న నిర్మాణం సాగుతుంది. చుట్టూ ఎనిమిది అడుగుల గోడ, దానిపై ఇనుప కంచె రక్షణగా ఉండే ఈ భవంతిలో 60 శాతం స్థలాన్ని పార్కింగ్, గార్డెనింగ్ కోసం విడిచిపెట్టనున్నారని తెలుస్తోంది. మొత్తం మూడు అంతస్థుల్లో ఉండే ఇంట్లో గ్రౌండ్ ఫ్లోర్ లో సమావేశపు మందిరంతో పాటు అతిథులు ఎవరైనా వస్తే బస చేసేందుకు గదులు, శాశ్వత పనివారి నివాసానికి గదులు ఉంటాయని సమాచారం. ఫస్ట్ ఫ్లోర్ లో మరో చిన్న మీటింగ్ హాల్‌తో పాటు కిచన్, డైనింగ్ హాల్, బెడ్ రూములు తదితరాలు ఉంటాయని, మూడో అంతస్థులో రెండు లేదా మూడు గదులను మాత్రమే నిర్మించి, మిగతాదంతా ఖాళీగానే ఉంచాలని పవన్ భావిస్తున్నట్టు పార్టీ వర్గాలు వెల్లడించాయి

స్వయంగా జనసేన సభ ఏర్పాట్లు పరిశీలించిన పవన్

అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు

మహిళలకు ఎలాంటి అసౌకర్యాయలు కలగకుండా ఏర్పాటు



(అమరావతి, సూర్య ప్రధాన ప్రతినిధి) : నాగార్జున యూనివర్శిటీ వద్ద ఈ నెల 14న నిర్వహించే జనసేన అవిర్భావ దినోత్సవ ఏర్పాట్లను ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పరిశీలించారు. సొంతింటి నిర్మాణం భూమి పూజ కోసం గుంటూరు జిల్లా కాజ వచ్చిన పవన్ కళ్యాణ్ సభా వేదిక ఏర్పాట్ల గురించి నేతలను అడిగి తెలుసుకున్నారు. సభావేదిక ఎక్కి ప్రత్యక్షంగా ఏర్పాట్లను పరిశీలించారు. అనంతపురం, కాకినాడ సభ అనంతరం జరిగిన అవాంఛనీయ సంఘటనలు ఇక్కడ పునరావతం కానివ్వొద్దని నేతలకు సూచించారు. సభకు వచ్చే కార్యకర్తల కోసం ఏర్పాటుచేసి సౌకర్యాలపై పవన్ ఆరా తీశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే మహిళలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలని దిశానిర్ధేశం చేశారు.

మంత్రి నారా లోకేష్ కలిసిన సీఎం రమేష్, కనకమేడల రవీంద్రకుమార్

అమరావతి, సూర్య బ్యూరో : రాజ్యసభ అభ్యర్థులు సీఎం రమేష్, కనకమేడల రవీంద్రకుమార్‌లు మంత్రి నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వారిద్దరినీ మంత్రి నారా లోకేష్ అభినందించారు.



నేనే 'చైనా'
చైనాయే నేను



చైనా పార్లమెంట్ సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. చైనా అధ్యక్షుడిగా కొనసాగే వ్యక్తికి కాల పరిమితిని తొలగిస్తూ చైనా పార్లమెంట్ సంచలన నిర్ణయం తీసుకుంది. సీపీసీ నిబంధనల ప్రకారం రెండు సార్లు కంటే ఎక్కువ సార్లు ఒకే వ్యక్తి అధ్యక్ష పదవిలో కొనసాగడానికి వీలు లేదు. అయితే ఇప్పుడు ఆ చట్టాన్ని సవరిస్తూ శాశ్వత కాలం జిన్ పింగ్ అధ్యక్ష పదవిలో కొనసాగడానికి వీలుగా ఆ పార్టీ ఒక నిర్ణయం తీసుకుంది. దీంతో చైనా అధ్యక్షుడుగా జిన్‌పింగ్ జీవితకాలం అదే అత్యున్నత పదవిలో కొనసాగనున్నారు. ఇందుకు అనుగుణంగా చైనా దేశ రాజ్యాంగ సవరణకు ఆ దేశ జాతీయ చట్ట సభ ఆమోదం తెలపడం విశేషం. 3 వేల మంది సభ్యులు ఉండే కాంగ్రెస్ పీపుల్స్ నేషనల్ (సీపీసీ)లో మెజారిటీ సభ్యులు ఈ నిర్ణయాన్ని ఆమోదించడంతో ప్రస్తుత అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ జీవితాంతం చైనా అధ్యక్షుడిగా కొనసాగేందుకు మార్గం సుగమమైంది.



భారత ప్రధాని నరేంద్ర మోడీతో



రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో



భార్యతో కలసి



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో



జపాన్ ప్రధాని షింజో అబేతో

చైనాలో మరో చరిత్రాత్మక పరిణామానికి శ్రీకారం చుట్టింది. అధ్యక్షుడు షి జిన్‌పింగ్‌కు అపరిమిత [illegible]

దక్షిణ చైనా మార్నింగ్ పోస్ట్ ప్రచురించిన వివరాల ప్రకారం ప్రకారం, చైనా లెజిస్లేచర్‌లో రాజ్యాంగ సవరణ స్వీయ మార్పులకు దాదాపు అందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలియజేసినట్లు తెలుస్తోంది. జిన్‌పింగ్‌ని దేశ శాశ్వత అధ్యక్షుడిగా చేసేందుకు 2,958 ఓట్లు అనుకూలంగా పడగా కేవలం రెండు ఓట్లు మాత్రమే వ్యతిరేకంగా పోలయ్యాయి అని తెలిపింది. కమ్యునిస్ట్ పార్టీకి చైనా లెజిస్లేచర్‌లో గట్టి బలమే ఉంది. కాబట్టి భారీగానే ఓట్లు పోలయ్యాయినట్లు కనిపిస్తోందని ఆ పత్రిక వెలువరించింది.

రెండు పర్యాయాలే

మావో జెడాంగ్ సాంస్కృతిక విప్లవం నేపథ్యంలో ప్రబలిన మితిమీరిన నియంతృత్వపు ధోరణి మళ్లీ ప్రబలకుండా నియంత్రించేందుకు చైనా సమున్నత నాయకుడు డాంగ్ షావ్‌పింగ్ 1982లో ఒక పద్ధతిని తీసుకొచ్చారు. ఒక వ్యక్తి జీవితాంతం అధ్యక్షపదవిలో ఉండడానికి వీల్లేకుండా రాజ్యాంగ నిబంధనలలో సవరణలు తీసుకొచ్చారు. వరుసగా రెండు సార్లకన్నా ఎక్కువసార్లు ఆ పదవిని చేపట్టడానికి వీల్లేకుండా చేశారు. ఇప్పుడు ఆయన కృషి మొత్తం బూడిదలో పోసిన పన్నీరయినట్లు ప్రపంచ కమ్యూనిస్టులు సైతం వాపోతున్నారు.

36 ఏళ్లకు మళ్లీ సవరణ

ఏ వ్యక్తి అయినా అధ్యక్ష పదవిని రెండుసార్లు మాత్రమే చేపట్టాలని చట్టం వచ్చిన ఆ తరువాత మళ్లీ 36 సంవత్సరాలకు జి జిన్‌పింగ్ ఆధ్వర్యంలోని ప్రభుత్వం ఈ రాజ్యాంగ సవరణ చేసేందుకు సిద్ధమైంది. మొత్తం 21 అంశాలను రాజ్యాంగంలో సవరించి చేర్చారు. రాజ్యంగ పీఠిక భాగంలో నాలుగు, ఉపాంగములో 17 సవరణలు చేసి, కొత్తవాటిని చేర్చారు. పరిమితులు అనే పదాన్ని రాజ్యాంగం నుండి తొలగించారు. కొత్త రాజ్యాంగ సవరణ ద్వారా యాంటీ-గ్రాఫ్ట్ సూపర్ ఏజెన్సీ, నేషనల్ సూపర్వైజరీ కమిషన్ ఏర్పాటుకు మార్గం సుగుమం అయ్యింది.

ఆది నుంచి అదే తంతు

జిన్‌పింగ్ 2012లో చైనా కమ్యూనిస్ట్ పార్టీ అధిపతిగా నియమితులయ్యారు. అప్పటి నుంచి ఆయన అధికారాన్నంతా తన గుప్పెట్లో ఉంచుకోవడానికి, గడచిన రెండు దశాబ్దాలుగా ఏర్పాటు చేసుకున్న సమష్టి నాయకత్వపు నిబంధలను ఉల్లంఘించడానికి ప్రయత్నిస్తూనే ఉన్నారు. అయితే అధికారంలోకి వచ్చాక జిన్‌పింగ్ దేశ ఆర్థిక వ్యవస్థని పటిష్టం [illegible]

ద్వారా దేశంలో ఉత్పాదకత పెంచారు. వ్యయసాయ ఉత్పత్తుల పై ప్రత్యేక దృష్టి సారించిన అధ్యక్షుడు, మార్కెటింగ్ సదుపాయాల్ని విస్తరించా రు. చైనా ఉత్పత్తులకు గిరాకీ పెంచేందుకు వీలుగా దేశ సరిహద్దుల వెంట ప్రధాన రహదార్లు నిర్మించారు. చైనాలో ఏ మూలన ఉత్పత్తన వస్తువునైనా విదేశాలకు సునాయాసంగా తరలించేలా ఏర్పాటు చేశారు. దీవుల్లో ఏర్పాటు చేసిన స్పెషల్ ఎకనమిక్ జోన్ల ద్వారా వ్యాపార వాణిజ్యాలను మరింత విస్తరించారు. ఈ చర్యలతో చైనా వ్యాపార, పారిశ్రామిక, సైనిక సంప త్తిలో తిరుగులేని శక్తి అనే సంకేతాల్ని ప్రపంచానికి ఇచ్చారు. భవిష్యత్తులోనూ డ్రాగన్ కంట్రీ అభివృద్ధిపథంలో దూసుకు వెళ్లేందుకు ప్రణాళికలు రూపొందించి అమలు, పాలనపై అపార నమ్మకంతో చైనా పీపుల్స్ నేషనల్ కాంగ్రెస్ రెండోసారి జిన్‌పింగ్‌కు అధ్యక్ష బాధ్యతలు అప్పజెప్పింది. వార్షిక పార్లమెంట్ సమావేశాలకు ముందు రక్షణ బడ్జెట్‌ను ప్రకటించే చైనా ఇటీవల కాలంలో తొలిసారి ఈ సంప్రదాయా న్ని విస్మరించింది. ప్రతి ఏటా నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ (ఎన్‌పీ సీ) అధికార ప్రతినిధి దేశ రక్షణ బడ్జెట్‌ను శాతం రూపంలో వెల్లడిస్తారు. ఎన్‌పీసీ అధికార ప్రతినిధి ఝూంగ్ యెసూయ్ మీడియాతో మాట్లాడుతూ చైనా సైనిక వ్యయం క్రమంగా పెరగ డాన్ని సమర్థించినా ఎంత శాతం పెరుగుదల ఉందో వెల్లడిం చలేదు. రక్షణ విధానం.. స్వభావ రీత్యా రక్షణాత్మకమని చెప్పి న ఝూంగ్.. చైనా అభివృద్ధి.. ఏ ఇతర దేశానికీ ముప్పు కాద న్నారు. చైనా గత ఏడాది రక్షణ బడ్జెట్‌ను దాదావు రూ. 9.81లక్షల కోట్లకు పెంచడం విశేషం.

సర్వత్రా ఆందోళన

ఇప్పటికే అధ్యక్షుడు జిన్‌పింగ్ జాతీయ భద్రత, ఆర్థికవ్యవస్థ, ఆర్థిక సంస్కరణలను, ఇతర ప్రధాన కార్యక్రమాలను పర్యవేక్షించే సంస్థలకు అధిపతిగా ఆయన తనను తానే నియమించుకున్నారు. ఈ క్రమంలో ఆయన పార్టీలో రెండో స్థానంలో ఉన్న ప్రధాని లీ కెచాంగ్‌ను సమర్థంగా పక్కనపెట్టేశారు. తాజా రాజ్యాంగ సవరణలతో జిన్‌పింగ్ జీవితాంతం అధికార పీఠంపై ఆసీనులయి ఉండటం ద్వారా గతంలో కమ్యూనిస్టు యోధానుయోదులు నిరంకుశత్వాన్ని అనుమతించకుండా నియంత్రించేందుకు దశాబ్దాల పాటు చేసిన ప్రయత్నాలు పనికి రాకుండా పోతాయన్న ఆందోళన వినిపిస్తోంది.

- సత్యగోపాల్, హైదరాబాద్



జిన్‌పింగ్‌ను శాశ్వత అధ్యక్షుడుగా కాంగ్రెస్ పీపుల్స్ నేషనల్‌లో ఆమోదిస్తూ హర్షాతిరేకాలు చేస్తున్న చట్టసభ సభ్యులు



1982లో డెంగ్ జియావోపింగ్ కాలంలో అప్పటి ప్రభుత్వం ఏ వ్యక్తి అయినా రెండుసార్లు మాత్రమే అధ్యక్ష పదవిని చేపట్టాలని చట్టం చేసింది. ఆ తరువాత మళ్లీ 36 సంవత్సరాలకు రాజ్యాంగ సవరణ చేశారు. మొత్తం 21 అంశాలను రాజ్యాంగంలో సవరించి చేర్చారు. రాజ్యంగ పీఠిక భాగంలో నాలుగు, ఉపాంగంలో 17 సవరణలు చేయటంతో పాటు, కొత్తవాటిని చేర్చారు. పరిమితులు అనే పదాన్ని రాజ్యాంగం నుండి తొలగించారు. కొత్త రాజ్యాంగ సవరణ ద్వారా యాంటీ-గ్రాఫ్ట్ సూపర్ ఏజెన్సీ, నేషనల్ సూపర్‌వైజరీ కమిషన్ ఏర్పాటుకు మార్గం సుగమం అయ్యింది. దీంతో స్థానిక సంస్థల ఉద్యోగులతో సహా అన్ని వ్యవహారాలలో దేశ అధ్యక్షుడు నేరుగా జోక్యం చేసుకునేందుకు అవకాశాలుంటాయి.

పూజా ఫ్యాన్స్ క్లబ్‌లో ప్రభాస్?



నాగచైతన్య, వరుణ్‌తేజ్, హృతిక్ రోషన్, అల్లు అర్జున్, సాయి శ్రీనివాస్, రామ్ చరణ్, ఎన్టీఆర్, మహేష్ బాబు మొదలగువారు మెంబర్స్‌గా ఉన్న 'పూజా హెగ్డే ఫ్యాన్స్ క్లబ్'లో తాజాగా ప్రభాస్ కూడా చేరుతున్నట్లు సమాచారం అందుతోంది!!

అక్కినేని నాగచైతన్య సరసన 'ఒక లైలా కోసం' సినిమా చేసినప్పుడు ఆమెను ఎవరూ అంత సీరియస్‌గా తీసుకోలేదు. 'ముకుంద'లో వరుణ్‌తేజ్‌తో జత కట్టినప్పుడు కూడా అంతే!

'ముకుంద' చేస్తున్న టైమ్‌లో బాలీవుడ్ సూపర్‌స్టార్ హృతిక్ రోషన్‌తో నటించే అవకాశం వచ్చినప్పుడు మాత్రం ఒకపరి ఆమె వంక తేరిపారా చూశారు. అయితే అప్పుడు కూడా ఆమెలో ఉన్న 'సూపర్ హీరోయిన్' మెటీరియల్‌ని ఎవరూ గుర్తించలేదు!

అల్లు అర్జున్‌తో ఈ అమ్మడు చేసిన 'దువ్వాడ జగన్నాథమ్' చూశాక మాత్రం.. 'ఈమెలో ఏదో ఉంది' అనుకున్నారంతా. అయినా సరే, ఈమెను వెతుక్కుంటూ అవకాశాలు రాలేదు!

దాంతో 'గుడ్డిలో మెల్ల' అనుకుంటూ.. బెల్లంకొండ సాయిశ్రీనివాస్ సినిమా 'సాక్ష్యం'కి సంతకం చేసింది. ఆ సినిమా ఇంకా షూటింగ్ దశలో ఉంది!

కానీ.. రామ్‌చరణ్-సుకుమార్ కలయికలో వస్తున్న 'రంగస్థలం'లో 'రగులుతోంది పొగలి పొద.. వగలమారి కన్నె ఎద' అన్నట్లుగా ఓ కత్తిలాంటి ఐటం సాంగ్ చేసేసరికి.. పూజా హెగ్డేని అవకాశాలు వెతుక్కుంటూ కాదు.. తన్నుకుంటూ వస్తున్నాయి!

మరి, 'రంగస్థలం'లో పూజా చేసిన స్పెషల్ సాంగ్‌ని స్పెషల్‌గా చూశారో ఏమో కానీ.. 'సాక్ష్యం' కానీ, 'రంగస్థలం' కానీ విడుదల కాకుండానే.. పూజా హెగ్డే కాల్షీట్స్ హాట్ కేక్‌లా సేల్ అయిపోతున్నాయి!

టాలీవుడ్ టాప్ హీరోలంతా.. పూజా హెగ్డే డేట్స్ కోసం తమ డైరెక్టర్స్‌తో పరుగులు తీయిస్తున్నారు!

త్రివిక్రమ్-ఎన్టీఆర్ కలయికలో త్వరలో సెట్స్‌కి వెళ్లనున్న చిత్రంలో హీరోయిన్‌గా ఎంపికైన పూజా హెగ్డే.. మహేష్‌బాబు 25వ చిత్రంలోనూ ఛాన్స్ కొట్టేసింది. వంశీ పైడిపల్లి దర్శకత్వంలో సి.అశ్వినీదత్-దిల్ రాజు ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు!

ఈ రెండు చిత్రాలు ఇంకా సెట్స్‌కి వెళ్లడానికి ముందే 'సాహో' అనంతరం 'జిల్' ఫేమ్ రాధాకృష్ణ దర్శకత్వంలో ప్రభాస్ నటించే ప్రతిష్టాత్మక చిత్రంలో నటించే సువర్ణావకాశం కూడా పూజా హెగ్డే సొంతమైనట్లు సమాచారం అందుతోంది. ప్రభాస్ పెదనాన్న కృష్ణంరాజు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు!

ఇందరు టాప్ హీరోలతో నటించే అవకాశాన్ని చేజిక్కించుకుంటుండడం వల్ల.. పూజా హెగ్డే నటిస్తున్న 'సాక్ష్యం' చిత్రానికి ఆటోమేటిక్‌గా యమా క్రేజ్ పెరిగిపోతోందని తెలుస్తోంది!!



సెట్స్‌కి వెళ్లే సన్నాహాల్లో నాగార్జునీయం



నాగార్జున-నాని కలయికలో వైజయంతి మూవీస్ పతాకంపై టి.శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో సి.అశ్వనీదత్ నిర్మిస్తున్న చిత్రం రెగ్యులర్ షూటింగ్ మార్చి 18, ఉగాది రోజు నుంచి మొదలుకానుంది. ఈ చిత్రం మ్యూజిక్ సిట్టింగ్స్ అమెరికాలో జరగనున్నాయి!

సి.అశ్వనీదత్ మాట్లాడుతూ.. 'మా వైజయంతి బేనర్‌లో మణిశర్మ చేసిన సినిమాలన్నీ మ్యూజికల్‌గా పెద్ద హిట్స్ అయ్యాయి. ఈ సినిమాని కూడా మ్యూజికల్‌గా బిగ్గెస్ట్ హిట్ చెయ్యాలని ఫుల్‌గా కాన్‌సన్‌ట్రేట్ చేస్తున్నారు. ప్రస్తుతం అమెరికాలో ఈ సినిమా కోసం సాంగ్స్‌ని మణిశర్మ కంపోజ్ చేస్తున్నారు' అన్నారు. ఈ చిత్రానికి స్క్రిప్ట్ అడ్వైజర్: సత్యానంద్, సినిమాటోగ్రఫీ: శ్యామ్‌దత్, ఎడిటింగ్: ప్రవీణ్‌పూడి, మాటలు: వెంకట్ డి.పట్టి, శ్రీరామ్ ఆర్.ఇరగం, కో-డైరెక్టర్: తేజ కాకుమాను, ప్రొడక్షన్ కంట్రోలర్: మోహన్!!

శివ-హ్యాపీడేస్ చిత్రాలను మిక్సీలో వేస్తే అదే కిర్రాక్ పార్టీ


-అనిల్ సుంకర

తెలుగు చిత్రసీమలో ప్రత్యేక పరిచయవాక్యాలు అవసరం లేని నిర్మాతల్లో అనిల్ సుంకర ఒకరు. ఒకవైపు భారీ చిత్రాలను నిర్మిస్తూనే.. మరొకవైపు మీడియం బడ్జెట్ చిత్రాలు కూడా తెరకెక్కిస్తుంటారు. సినిమాను అమితంగా ప్రేమించే అనిల్ సుంకర ఏకే ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై నిర్మించిన తాజా చిత్రం 'కిరాక్ పార్టీ'. నిఖిల్ హీరోగా శరన్ కొప్పిశెట్టి డైరెక్ట్ చేసిన ఈ సినిమా ఈ నెల 16న విడుదల కానుంది. ఈ సందర్భంగా అనిల్ సుంకర మీడియాతో మాట్లాడారు. ఎలాంటి ఔట్‌పుట్ రావాలనుకున్నామో అలాంటి ఔట్‌పుట్ వచ్చింది. తీయగలిగినంతలో మంచి సినిమా తీశాం. అందుకే ఈ చిత్రం సాధించబోయే విజయంపై నమ్మకంగా ఉన్నాను. నాకు ఎప్పటి నుండో 'శివ' లాంటి సినిమా చేయాలని ఆశ. 'కిరిక్ పార్టీ' కంటెంట్ దానికి ఎంతో కొంత దగ్గరగా ఉండటంతో దాన్ని రీమేక్ చేశాను. 'శివకి హ్యాపీడేస్‌ని మిక్స్ చేస్తే ఎలా ఉంటుందో ఈ చిత్రం అలా ఉంటుంది.

ముందు దర్శకుడిగా రాజుసుందరం అనుకున్నాం. కానీ ఆయన తెలుగు, తమిళం రెండు భాషల్లో చేద్దాం అన్నారు. కానీ రెండు భాషల్లో ఒకేసారి అంటే ఫోకస్ చేయలేమని వద్దనుకున్నాం. ఆ తర్వాత అప్పటికే సినిమాకి పనిచేస్తున్న శరన్ కొప్పిశెట్టికి అవకాశం ఇచ్చాను. సినిమాను నిఖిల్‌కు చూపించేప్పుడు సుధీర్ వర్మ, చందూ మొండేటి కూడా వచ్చారు. వాళ్ళు కూడ సినిమా చూసి ఇంప్రెస్ అయ్యారు. శరన్ వాళ్ళ దగ్గర గతంలో పనిచేసి ఉండటంతో ఎలాంటి హెల్ప్ కావాలన్నా చేస్తామని అన్నారు. వీరందరి సహకారంతో సినిమా చాలా బాగా వచ్చింది. అందుకే 90 శాతం వరకు మేమే రిలీజ్ చేస్తున్నాం. మిగతాది వేరేవాళ్ళు డిస్ట్రిబ్యూట్ చేస్తున్నారు. ఒరిజినల్ కన్నడ వెర్షన్ 2 గంటల 45 నిముషాలు ఉంటుంది. దాన్ని మన వాళ్ల అభిరుచికి తగ్గట్టు మార్పులు చేసి 2 గంటల 25 నిముషాలకు కుదించాం. రెండు పాటలు తీసేస్తే ఇంకా 8 పాటలు మిగిలాయి.

నేను దర్శకుడిని అవ్వాలనే ఇండస్ట్రీకి వచ్చాను. కానీ ఫెయిలయ్యాను. నిర్మాతగా సక్సెస్ అయ్యాను. కాబట్టి నిర్మాతగా కొనసాగడానికే మొగ్గు చూపుతున్నాను. చాలామంది కుర్రాళ్ళు పల్లెటూరి నుండి ఇంజనీరింగ్ చేయడానికి వస్తారు. మొదటి సంవత్సరంలో చాల భయంభయంగా ఉండే ఆ కుర్రాళ్ళు సెకండ్ ఇయర్‌కి వచ్చేప్పటికి కొంత మారుతారు. చివరి సంవత్సరానికి పూర్తిగా మారిపోతారు. దీన్ని ఇంతకుముందు ఏ సినిమాలో కూడ పూర్తిగా చూపించలేదు. కానీ మా సినిమాలో చూపించాం. అదే ఈ సినిమాలో పెద్ద ప్లస్ పాయింట్!!

ఆలోచింపజేసే అనువంశిక ప్రేమకథ



సంతోష్ రాజ్, నేహాదేశ్ పాండే జంటగా కౌండిన్య మూవీస్ పతాకంపై రమేష్ ముక్కెర దర్శకత్వంలో తాళ్లపెల్లి దామోదర్ గౌడ్ నిర్మిస్తోన్న చిత్రం 'అనువంశికత'. 'జెనిటిక్ లవ్ స్టోరీ' అనేది ఉపశీర్షిక . అశ్విత, క్రాంతి కుమార్ సమర్పకులు. సీనియర్ నటుడు సుమన్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమా ఆడియో ఆవిష్కరణ ప్రసాద్ ల్యాబ్స్‌లో ఘనంగా జరిగింది.

సుమన్ మాట్లాడుతూ.. 'రక్త సంబంధీకులను పెళ్లి చేసుకుంటే వచ్చే పరిణామాలు ఎలా ఉంటాయి అనే పాయింట్‌ను ఆధారంగా చేసుకుని దర్శకుడు చక్కగా సినిమా చేశాడు. మంచి సందేశాత్మక చిత్రమిది. పాటల్లో కూడా మంచి సందేశం ఉంది. కొన్ని సన్నివేశాలు సరిగ్గా రాలేదని మళ్లీ రీషూట్ కూడా చేశారు. అంటే దర్శక, నిర్మాతలకు సినిమా పట్ల ఎంత ఫ్యాషన్ ఉందో అర్థమవుతోంది' అన్నారు.

పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. 'సినిమా చేయడం అంటే చిన్న విషయం కాదు. ఎన్నో సమస్యలు ఎదురవుతాయి. వాటన్నింటిని తట్టుకుని నిలబడి దామోదర్ సినిమా చేశారు' అన్నారు.

దర్శకనిర్మాతలు తాళ్ల పెల్లి దామోదర్ గౌడ్- రమేష్ ముక్కెర మాట్లాడుతూ.. 'సినిమా కోసం టీమ్ అంతా చాలా కష్టపడ్డాం. మా తొలి ప్రయత్నాన్ని తెలుగు ప్రేక్షకులంతా ఆదరిస్తారని ఆశిస్తున్నాం' అన్నారు.

నిధి లభ్యం కావడం తథ్యం!



రాజేంద్రప్రసాద్ ప్రధాన పాత్రలో జెబి క్రియేషన్స్ పతాకంపై శ్రీమతి భాగ్యలక్ష్మి నిర్మించిన సినిమా 'ఊ.పె.కు.హ'. ఊళ్ళో పెళ్ళికి కుక్కల హడావుడి అనేది కాప్షన్. సాక్షీ చౌదరి కథానాయిక. 'నిధి' ప్రసాద్ దర్శకుడు. అనూప్ రూబెన్స్ సంగీతం అందించిన ఈ సినిమా ఆడియో సోమవారం హైదరాబాద్‌లో విడుదలైంది. బిగ్ సీడీని జెమిని కిరణ్ విడుదల చేశారు. ఆడియో సీడీలను రాజేంద్ర ప్రసాద్ విడుదల చేశారు.

దర్శకుడు నిధి ప్రసాద్ మాట్లాడుతూ.. 'అనూప్ రూబెన్స్ చాలా మంచి మ్యూజిక్ ఇచ్చారు. తనని నా సినిమాకు సంగీతం చేయమని అడిగే సమయంలో తను చాలా బిజీగా ఉన్నాడు. అయినా కూడా నేను అడిగానని సినిమాకు మ్యూజిక్ అందించారు. పెద్ద మ్యూజిక్ డైరెక్టర్ కదా.. ఎక్కడ ఆలస్యం అవుతుందోనని టెన్షన్ పడ్డాను. కానీ ఆయన అనుకున్న సమయం కంటే ముందుగానే ఆడియో కంప్లీట్ చేసిచ్చారు. మా సినిమా కోసం విలువైన సమయాన్ని వెచ్చించారు. అందుకు అనూప్‌కి థాంక్స్' అన్నారు.

అనూప్ రూబెన్స్ మాట్లాడుతూ.. 'ఇంతకు ముందు నిధి ప్రసాద్‌గారు వర్క్ చేసిన సినిమాకు నేను కీ బోర్డ్ ప్లేయర్‌గా పనిచేశాను. ఆయనతో అప్పటి నుండి మంచి పరిచయం ఉంది. చాలా మంచి మనిషి. ఆయతో ఉన్న స్నేహం కారణంగా.. ఆయన అడగ్గానే మ్యూజిక్ అందించాను. ఈ సినిమా హిట్ అయ్యి నిధి ప్రసాద్‌గారు మరిన్ని సినిమాలు చేయాలని కోరుకుంటున్నాను' అన్నారు.

జెమిని కిరణ్ మాట్లాడుతూ.. 'నిధి ప్రసాద్- రాజేంద్ర ప్రసాద్‌లతో ఎప్పట్నుంచో మంచి అనుబంధం ఉంది. సినిమా యూనిట్‌కు ఆల్ ది బెస్ట్' అన్నారు.

రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. 'నేను రాజ్-కోటిలతో కలిసి పనిచేసేటప్పుడు దిలీప్ అనే కీబోర్డ్ ప్లేయర్ ఉండేవాడు. అతనే ఆ తర్వాత ఎ.ఆర్.రెహమాన్ అయ్యారు. తనతో అప్పట్నుంచి ఉన్న అనుబంధం ఇప్పటికీ కొనసాగుతోంది. అలాగే ఇప్పుడు అనూప్ కూడా గతంలో కీ బోర్డ్ ప్లేయర్‌గా చేసి ఇప్పుడు టాప్ మ్యూజిక్ డైరెక్టర్ కావడం ఆనందంగా ఉంది. నిధి ప్రసాద్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంతో నిర్మాతలకు నిధి లభ్య కావడం తథ్యం' అన్నారు!!

సాయిపల్లవిపై పగబట్టిన పురుషపుంగవులెవరు?



పళ్లున్న చెట్లకే రాళ్ల దెబ్బ' అన్న సామెత గురించి అందరికీ తెలిసిందే. అలాంటిది.. హీరోలకు సరిసమానమైన ఫాలోయింగ్ కలిగిన సాయిపల్లవిపై వరస బెట్టి రూమర్స్ వెలువడుతుండడంలో ఆశ్చర్యమేముంది?

కాకపోతే.. అవి మరీ శ్రుతి మించుతుండడంతో అందరికీ ఇప్పుడు వేరే అనుమానాలు వస్తున్నాయి. సాయిపల్లవి పాపులారిటీ చూసి తట్టుకోలేకపోతున్న కొందరు పురుషపుంగవులు పనిగట్టుకొని ఆమెపై లేనిపోని వదంతులు వ్యాప్తి చెందేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారని తెలుస్తోంది!

ఒక మినిస్టర్ (గంటా శ్రీనివాసరావు) తనయుడు, మరో మినిస్టర్ మరియు ప్రముఖ విద్యాసంస్థల అధినేత (నారాయణ) అల్లుడు అయిన గంటా రవితేజతో సాయిపల్లవి ఎఫైర్ నడుపుతోందంటూ ఇటీవల ఓ రేంజ్‌లో రూమర్స్ వెలువడ్డాయి. వాటిని స్వయంగా మినిస్టర్ గంటా శ్రీనివాసరావు ఖండించాల్సి వచ్చింది!

'జయదేవ్' అనే చిత్రం ద్వారా గంటా రవి హీరోగా పరిచయమయ్యాడు. ఆ చిత్రం అట్టర్ ఫ్లాప్ అయ్యింది. అలాంటి హీరోతో సాయిపల్లవికి అక్రమ సంబంధం అంటగడుతూ వార్తలు వెలువడడం సహజంగానే చర్చనీయాంశమవుతోంది! సాయిపల్లవి అంటే కిట్టని వాళ్లు కావాలనే ఇవన్నీ చేయిస్తున్నారని పరిశీలకులు భావిస్తున్నారు. ఇది కూడా ఒకరకంగా సాయిపల్లవి పాపులారిటీకి సూచికే అయినప్పటికీ.. ఇటువంటిని సాయిపల్లవి ఎప్పటికప్పుడు ఖండించడం ఎంతైనా అవసరమని వారు అభిప్రాయపడుతున్నారు!!

మాంచి మిఠాయి లాంటి సినిమా!



రెడ్ యాంట్స్ పతాకంపై కమల్ కమరాజు, రవివర్మ, రాహుల్ రామకృష్ణ, ప్రియదర్శి, శ్వేతావర్మ, భూషణ్ కళ్యాణ్ , అజయ్ ఘోష్ తదితరులు నటిస్తోన్న డార్క్ కామెడీ ఎంటర్‌టైనర్ 'మిఠాయి'. ప్రశాంత్‌కుమార్ దర్శకనిర్మాణంలో సినిమా రూపొందుతోంది. ప్రత్యేకంగా వికారాబాద్‌లో వేసిన సెట్‌లో.. ఈ సినిమా తొలి షెడ్యూల్ పూర్తయ్యింది. అలాగే ఈ సినిమాతో పరిచయం కానున్న అర్ష పోస్టర్‌ను రిలీజ్ చేశారు.

దర్శక నిర్మాత ప్రశాంత్‌వర్మ మాట్లాడుతూ.. 'ఈ నెల 17న సినిమా రెండో షెడ్యూల్ ప్రారంభం కానుంది. 'పెళ్ళిచూపులు' సినిమాకు సంగీతం అందించిన వివేక్ సాగర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తుండటం విశేషం. డార్క్ కామెడి జోనర్‌లో విభిన్నమైన క్యారెక్టర్స్ నడుమ సాగే సినిమా ఇది' అన్నారు!!

విశ్వదాభిరామ చిత్రం శీను విలన్ అయ్యాడ్రా మామ!



సోలో స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సురేంద్ర కమల్ (సురేంద్ర వంటిపులి) నిర్మిస్తోన్న థ్రిల్లర్ 'విశ్వదాభిరామ'. 'సురేష్ కాశీ-సురేంద్ర కమల్-అశోక్ చక్రం' త్రయం (ముగ్గురు) ఈ చిత్రానికి దర్శకులు కావడం విశేషం. చిత్రం శ్రీను ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో భువన్ తేజ్, అనిల్, ఆనంద్, సహస్ర, రాజారెడ్డి, మానస లీడ్ రోల్స్ ప్లే చేస్తున్నారు.

దర్శకుడు మాట్లాడుతూ.. 'కొండవీటి కోట నేపథ్యంలో జరిగే డెత్ గేమ్ థ్రిల్లర్ విశ్వాదాభిరామ. ఇప్పటివరకు కామెడీ పాత్రల్లో అలరించిన చిత్రం శీను తొలిసారి విలన్‌గా నటిస్తున్నారు. తెలుగు ప్రేక్షకులకు ఇదొక సరికొత్త థ్రిల్ కలిగిస్తుంది. చిత్రీకరణ పూర్తయింది. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి' అన్నారు!



భారత్‌ను చూసి నేర్చుకోవాలి

- చైనా అధికారిక మీడియాలో కథనం
- యోగాను విశ్వవ్యాప్తం చేసిన తీరుపై ప్రశంసలు

బీజింగ్ : తరచుగా భారత్‌పై అక్కసు వెళ్లగక్కే, హెచ్చరికలతో కూడిన కథనాలను ప్రచురించే చైనా అధికారిక మీడియా 'గ్లోబల్ టైమ్స్' ఈసారి భారత్‌ను ఆకాశానికి ఎత్తేసింది. అది కూడా యోగా విషయంలోనే. భారత తన సంస్కృతిని ఎంత తెలివిగా ప్రపంచానికి ఎగుమతి చేస్తుందో చూడండని ఆ కథనంలో సూచిం చింది. చైనా ప్రభుత్వ సాయంతో విదేశాల్లో నడుస్తున్న కార్యక్రమాల కంటే కూడా, భారత్ తన యోగాను మరింత ఆమోదనీయంగా మార్చిన తీరును ప్రశంసించింది.

దీనిని చూసి చైనా నేర్చుకోవాలని షాంఘై ఇన్‌స్టిట్యూట్స్ ఫర్ ఇంటర్నేషనల్ స్టడీస్ డైరెక్టర్ జావో గాన్ చెంగ్ వ్యాఖ్యలను ఉదహరిస్తూ 'గ్లోబల్ టైమ్స్' సూచించింది. సాధారణంగా సామాజిక సందేశాత్మక చిత్రాలకు పరిమితమయ్యే బాలీవుడ్ సైతం యోగాను విశ్వవ్యాప్తం చేయడంలో తమవంతు పాత్రను పోషించినట్టు ఆ కథనంలో పేర్కొంది.

ఈ సందర్భంగా యోగా చైనాలో ఎలా విస్తరిస్తున్నదీ 'గ్లోబల్ టైమ్స్' పేర్కొంది. గత రెండు సంవత్సరాల్లో చైనా పట్టణాల్లో యోగా క్లబ్‌లు విస్తరిస్తున్న తీరును వర్షాల తరువాత పుట్టగొడుగులు పుట్టుకువచ్చిన మాదిరిగా ఉన్నట్టు పేర్కొంది. కేవలం పెద్ద పట్టణాలకే పరిమితం కాకుండా, నాలుగు, ఐదో శ్రేణి పట్టణాల్లోనూ యోగాకు క్రేజ్ పెరుగుతుండడాన్ని తెలియజేసింది.

వాతావరణ మార్పులతో మహిళలకే అధిక చేటు

- 80 శాతం మంది మహిళలకు ఇబ్బందులు
- అందుకే '2015 ప్యారిస్ ఒప్పందం'లో వారికి పెద్ద పీట
- 'హరికేన్ కత్రినా' తరువాత మహిళలకు
- లోపభూయిష్టమైన పునరావాస ఏర్పాట్లు



న్యూయార్క్ : వాతావరణంలో రోజు రోజుకూ చోటు చేసుకుంటున్న మార్పులతో పెను ప్రభావాలను మనం ఇప్పటికే చవిచూస్తున్నాం. రుతులు గతులు తప్పుతున్నాయి. ఫలితంగా అకాల వర్షాలు, వడగళ్ల వానలు, సునామీలు, సముద్రాల్లో భూకంపాలు... ఇలా కొన్నేళ్లుగా చిత్రమైన రీతిలో ప్రమాదాలు మానవులను కబళిస్తున్నాయి. వాతావరణంలో కర్బన ఉద్గారాల శాతం స్థాయిని మించిపోవడంతో శ్వాసకోశ సంబంధిత వ్యాధులు మనుషులను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. వాతావరణంలోని మార్పుల ప్రభావం పురుషుల కంటే మహిళలపైనే అధికంగా ఉంటుందని ఐక్యరాజ్య సమితి (యుఎన్) తన తాజా నివేదికలో హెచ్చరించింది. ఆ నివేదిక ప్రకారం, వాతావరణ మార్పు వల్ల 80 శాతం మంది మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని బీబీసీ తెలిపింది. 'ఈ కారణంగా పర్యావరణ పరిరక్షణకు ఉద్దేశించిన 2015 నాటి ప్యారిస్ ఒప్పందంలో మహిళల సాధికారతకు పెద్దపీట వేశారు. మధ్య ఆఫ్రికాలోని 'లేక్ చాద్' సరస్సు 90 శాతం మేర ఎండిపోయింది. పర్యవసానంగా ప్రత్యేకించి దేశవాళీ సంచార జాతుల బతుకులు ప్రమాదంలో పడ్డాయి. సరస్సులోని నీరు ఇంకిపోవడంతో స్థానిక మహిళలు తాగునీటి కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. నీటి ఎద్దడి తలెత్తిన సమయాల్లో పురుషులు సమీపంలోని పట్టణాలకు వలస వెళతారు. ఆ సమయంలో ఇంటి బాధ్యతలను మహిళలు నిర్వర్తిస్తారు' అని అసోసియేషన్ ఆఫ్ ఇండీజినస్ విమెన్ అండ్ పీపుల్ ఆఫ్ చాద్ (ఏఎఫ్‌పీఏటీ) సమన్వయకర్త హిందౌ ఒమరౌ ఇబ్రహీం బీబీసీకి తెలిపారు. మరో వైపు 'హరికేన్ కత్రినా' బీభత్సం తరువాత బాధితుల పునరావాసం కోసం ఏర్పాటు చేసిన 'ది సూపర్‌డోమ్'ను ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఇందులో పునరావాసం పొందిన మహిళలకు తగిన పారిశుద్ధ్య వసతులు కల్పించలేదు.



అందువల్ల పర్యావరణ మార్పుల ప్రభావాల విషయంలో మహిళలకు తగిన ప్రాధాన్యం కల్పించాల్సి ఉందని ఐరాస అభిప్రాయపడింది. మరో వైపు పర్యావరణ మార్పులపై చర్చలకు సంబంధించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో పని చేస్తున్న సంస్థల్లోనూ మహిళలకు తగినంత ప్రాతినిధ్యం లేదు. వారి ప్రాతినిధ్యం 30 శాతం కంటే తక్కువగా ఉందని సమితి ఆందోళన వ్యక్తం చేసింది. మహిళలకు సామాజిక, ఆర్థిక సాధికారత ఉన్న దేశాల్లో పరిస్థితి ఇందుకు కాస్త భిన్నంగా ఉందని మరో అధ్యయనం తెలిపింది.

దళిత మహిళలను దూషించిన బీజేపీ ఎమ్మెల్యే

దాడిని ఖండించిన రాజ్ కుమార్ తక్రాల్
దళిత మహిళలపై దాడికి దిగిన వీడియో సోషల్ మీడియాలో వైరల్



డెహ్రాడూన్ : దళిత మహిళలపై ఇద్దరు బీజేపీ నేతలతో కలసి ఎమ్మెల్యే దాడి చేసిన ఘటన సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దాని వివరాల్లోకి వెళితే, ఉత్తరాఖండ్‌లోని రుద్రపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే రాజ్‌కుమార్ తక్రాల్ దళిత మహిళలను కులం పేరుతో దూషించడమే కాకుండా, వారిపై దాడికి తెగబడ్డారు. దీనిపై సదరు మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేయగా, అవి పూర్తిగా అసత్య ఆరోపణలని ఆయన కొట్టిపడేశారు. అయితే, ఆ ఘటనకు సంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు, ఎమ్మెల్యే రాజ్ కుమార్‌పైన మరి ఇద్దరు బీజేపీ నేతలపైన ఐపీసీ 323, 504 సెక్షన్లు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేశారు.

చెన్నై ట్రాఫిక్ పోలీసులపై ట్విట్టర్‌లో సినీ నటి ఆగ్రహం



చెన్నై : గర్భిణి మృతి ఘటన తరువాత చెన్నై ట్రాఫిక్ పోలీసులంటే భయం వేస్తోందని సినీ నటి సాయి గాయత్రి తెలిపింది. ట్రాఫిక్ పోలీసులు అకారణంగా తన కారు ఆపి డబ్బులు డిమాండ్ చేశారని మండిపడింది. తమిళనాడు రాజధానిలో ట్రాఫిక్ పోలీసుల ఆగడాలు పెరిగిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేసింది. దాని వివరాల్లోకి వెళితే చెన్నైలో ఇంటి నుంచి బయటకు వెళుతున్న సమయంలో కారణం లేకుండా ట్రాఫిక్ కానిస్టేబుల్ తన కారు ఆపారని సాయి గాయత్రి తెలిపింది. సిగ్నల్ క్రాస్ చేశావంటూ 300 రూపాయలు డిమాండ్ చేశారని పేర్కొంది. దీంతో తాను మీ పేరు చెప్పండి అని అడగడంతో సర్లే 100 ఇవ్వు అని డిమాండ్ చేశారని తెలిపింది.


రాహుల్ వ్యాఖ్యలతో రాజీవ్ గాంధీ హత్యపై అనుమానాలు

- సుపారీ ఇచ్చి చంపించి ఉంటారు: సుబ్రహ్మణ్య స్వామి
- మాజీ ప్రధానిని చంపిన వారి పట్ల దయ ఎందుకు?
- శిక్ష విధించింది మాజీ ప్రధానిని హత్య చేసిన వారికి
- రాజీవ్ గాంధీ హత్యపై దర్యాప్తు జరిపించాలని డిమాండ్

న్యూఢిల్లీ : బీజేపీ నేత సుబ్రహ్మణ్య స్వామి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ సారి మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్యోదంతాన్ని ప్రస్తావించారు. తన తండ్రి రాజీవ్ గాంధీ హంతకులను పూర్తిగా క్షమించామని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రకటించిన నేపథ్యంలో, సుపారీ హత్య లేదా పథకం ప్రకారం ఆర్థిక ప్రయోజనాలు పొందాలనే ఉద్దేశంతో చంపించినట్టు అనుమానాలు తలెత్తుతున్నాయని సుబ్రహ్మణ్యస్వామి పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ హత్యపై దర్యాప్తు



జరిపించాలని సుబ్రహ్మణ్య స్వామి డిమాండ్ చేశారు. రాజీవ్ గాంధీ హంతకులను క్షమిస్తున్నట్టు రాహుల్ చేసిన ప్రకటన దేశభక్తి లేకపోవడానికి నిదర్శనమని సుబ్రహ్మణ్య స్వామి అన్నారు. 'ఆయన (రాజీవ్ గాంధీ) అచ్చమైన జాతీయ వాది. ఆయన హత్యకు బాధ్యులైన వారిలో ఏ విధేయతా లేదు. మన మాజీ ప్రధానిని హత్య చేసేందుకు విదేశీయులతో కలసి పని చేసిన వారి పట్ల ఎందుకు సానుకూలత చూపించాలో నాకు అర్థం కావడం లేదు. రాహుల్ ప్రకటన దేశభక్త రహితమే. మాజీ ప్రధాని హంతకులకు శిక్ష విధించారని రాహుల్ అర్థం చేసుకోవాలి. ఆయన తండ్రికి అని కాదు' అని సుబ్రహ్మణ్య స్వామి పేర్కొన్నారు.



50 వేల మంది రైతులు నడుస్తూ ముంబయి చేరుకున్న వేళ...



ముంబయి : సుమారు 50 వేల మంది రైతులు తమ కష్టాలను తీర్చాలని డిమాండ్ చేస్తూ పాదయాత్రగా ముంబయి చేరుకోవడంతో ఏమి జరుగుతుందోనన్న ఆందోళనలో పడింది ఫడ్నవీస్ సర్కార్. అఖిల భారత కిసాన్ సభ ఆధ్వర్యంలో పంట రుణాల మాఫీ ప్రధాన డిమాండ్‌గా గిట్టుబాటు ధర కల్పించాలని, పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, ఎరువులు, పురుగు మందులను సబ్సిడీకి ఇప్పించాలని డిమాండ్ చేస్తూ, వేలాది మంది రైతులు నేడు విధానసభ ముట్టడికి నగరం చేరుకున్నారు. ముంబయి నగరాన్ని పోలీసులు తమ అధీనంలోకి తీసుకుని భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. అసెంబ్లీ వైపు దారి తీసే మార్గాల్లో ట్రాఫిక్‌ను నిలుపుదల చేశారు. రైతుల ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని వారి సమస్యలను పరిష్కరిస్తామని ఫడ్నవీస్ ప్రకటించారు. రైతుల ఆందోళనకు మహారాష్ట్ర ప్రతిపక్షాలు, శివసేన తదితర పార్టీలు మద్దతు ప్రకటించడంతో ఏ క్షణం ఏమి జరుగుతుందోనన్న ఆందోళన నెలకొంది.



తమిళనాడులో పెను విషాదం

- ట్రెక్కింగ్‌కు వెళ్లి కార్చిచ్చులో చిక్కుకున్న విద్యార్థుల బృందం : 9 మంది మృతి
- కురంగణి పర్వత ప్రాంతాల్లో ఘటన

చెన్నై : ఆదివారం తమిళనాడులో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. పర్వతారోహణకు వెళ్లిన విద్యార్థుల బృందంలో 9 మంది కార్చిచ్చుకు బలయ్యారు. మున్నార్ ప్రాంతంలోని సూర్యనెల్లికి చెందిన 37 మంది విద్యార్థినులు రెండు బృందాలుగా తమిళనాడులోని థెని జిల్లా కురంగణి ప్రాంతంలో పర్వతారోహణ శిక్షణ కోసం వచ్చారు. వారు ట్రెక్కింగ్ చేస్తున్న సమయంలో అకస్మాత్తుగా కార్చిచ్చు రేగడంతో వారంతా మంటల్లో చిక్కుకున్నారు. విద్యార్థులు భయంతో పరుగులు తీశారు. మంటల నుంచి కొందరు తప్పించుకోగా చిక్కుకుపోయిన ఐదుగురు విద్యార్థినులు అగ్నికి ఆహుతి అయ్యారు. ఆ తరువాత మరి ముగ్గురు ఆసుపత్రిలో మరణించారు. మరి 15 మంది విద్యార్థినులను హెలికాప్టర్ల సాయంతో రక్షించినట్టు రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. మరికొందరు గల్లంతయ్యారు. ఈ ప్రాంతంలో వెలుతురు తక్కువగా ఉండడంతో సహాయ కార్యక్రమాలకు ఆటంకం ఏర్పడినట్టు మదురై సర్కిల్ కన్జర్వేటర్ ఆర్కే జగేనియా తెలిపారు. మంటలు వేగంగా నలు వైపులా వ్యాపిస్తుండడంతో అటవీ సిబ్బంది, సమీప గ్రామాల ప్రజలు అక్కడికి చేరుకుని సహాయ చర్యల్లో పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్, రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు ఘటన స్థలానికి చేరుకుని సహాయ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. చెన్నైకి చెందిన ఓ ట్రెక్కింగ్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థుల బృందం పశ్చిమ కనుమల్లోని బోడికి చేరుకుంది. శుక్రవారం ట్రెక్కింగ్ ప్రారంభం కాగా శనివారం కేరళ వైపు అడవుల్లోకి చేరుకున్నారు. ఆదివారం కురంగణి నుంచి ట్రెక్కింగ్ ప్రారంభించారు. ఆదివారం సాయంత్రానికి వారు తిరిగి బోడి చేరుకుని చెన్నైకి తిరుగు ప్రయాణం కావలసి ఉండగా అంతలోనే ఈ ఘోర ప్రమాదం చోటు చేసుకుంది.

మద్యం మత్తులో యువతి డ్రైవింగ్

కారులోని ఇద్దరు విద్యార్థులు దుర్మరణం
డ్రైవింగ్ చేస్తున్న యువతి మద్యం సేవించిందన్న డీసీపీ
12 తెల్లవారు జామున 2.45 గంటల ప్రాంతంలో ఘటన



న్యూఢిల్లీ : వాయువ్య ఢిల్లీలోని ముఖర్జీ నగర్ ప్రాంతంలో మద్యం మత్తులో ఓ యువతి కారు నడపడంతో అందులోని ఇద్దరు స్టూడెంట్లు దుర్మరణం చెందారు. డ్రైవర్ సహా ముగ్గురు యువతులు తీవ్రంగా గాయపడ్డారు. సోమ వారం తెల్లవారు జామున 2.45 గంటలకు సంభవించిన ఈ దుర్ఘటన గురించి పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే, మద్యం మత్తులో ఉన్న యువతి కారుపై నియంత్రణ కోల్పోయింది. దాంతో హడ్సన్ లైన్స్ వద్ద ఉన్న ఓ ట్రాఫిక్ సిగ్నల్ స్తంభాన్ని ఢీకొట్టింది. అందులో ప్రయాణిస్తున్న 20 ఏళ్ల ప్రాయంలో ఉన్న ఇద్దరు స్టూడెంట్లు రితేశ్ దహియా, సిద్దార్థ్ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. కారులోని డ్రైవర్ సహా ముగ్గురు యువతులు తీవ్రంగా గాయపడ్డారు. స్తంభాన్ని ఢీకొట్టిన తరువాత కారు రెండు పల్టీలు కొట్టింది. డ్రైవింగ్ చేస్తున్న యువతి మద్యం మత్తులో ఉన్నట్లు డీసీపీ (వాయువ్య ఢిల్లీ) అస్లాం ఖాన్ తెలిపారు. ప్రాథమిక చికిత్స అనంతరం నిందితురాలిని అరెస్టు చేశామని ఆయన చెప్పారు. కారు దహియా తండ్రిది. ఈ ప్రమాదానికి కారకురాలైన యువతికి లెర్నర్ లైసెన్స్ ఉంది. వారంతా నోయిడాలోని అమిటిలో పార్టీ చేసుకుని తిరిగి వస్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. దహియా శ్రీ వెంకటేశ్వర కళాశాల విద్యార్థి కాగా, సిద్ధార్థ్ మహారాజా సూరజ్‌మల్ శిక్షా సంస్థాన్ విద్యార్థి. మిగిలిన ముగ్గురు యువతులు నోయిడాలోని అమిటి యూనివర్శిటీ విద్యార్థులు.

ప్రధాని ఇంటిముందే ఆత్మహత్య చేసుకుంటా

హెచ్చరించిన తమిళనాడు రైతు నేత




ఈరోడ్ : ప్రధాని నివాసం ముందు ఆత్మహత్యకు పాల్పడతానని దక్షిణ భారత రాష్ట్రాల నదుల అనుసంధాన రైతు సంఘం అధ్యక్షుడు అయ్యాకన్ను హెచ్చరించారు. ఈరోడ్‌లో ఆయన మాట్లాడుతూ, ఆరు వారాలలోపు కావేరీ నిర్వాహక మండలిని ఏర్పాటుచేయాలన్న సుప్రీంకోర్టు ఉత్తర్వులకు కేంద్ర ప్రభుత్వం కొత్త భాష్యాలు చెబుతూ తమిళనాడు రైతులను మోసం చేస్తోందని ఆరోపించారు. తక్షణం కావేరీ జల నిర్వాహక మండలిని ఏర్పాటు చేయని పక్షంలో ఢిల్లీలోని ప్రధాని ఇంటి ముందు ఆత్మహత్యకు పాల్పడతానని హెచ్చరించారు.

అక్కడి స్కూళ్లలో స్టూడెంట్లతో డాన్సులు నిషిద్ధం



లాహోర్ : విద్యార్థులతో బలవంతంగా నృత్యాలు చేయించే పాఠశాలల లైసెన్సులు రద్దు చేస్తామని పాకిస్తాన్ పరిధిలోని పంజాబ్ ప్రావిన్స్ ప్రభుత్వం స్పష్టం చేసింది. పాఠశాలకు సంబంధించిన వివిధ కార్యక్రమాల్లో నృత్యాలను నిషేధించినట్లు 'ది ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్' పత్రిక కథనం పేర్కొంది. కథనం ప్రకారం, స్కూళ్లలో డాన్సులు చేయడం మత విలువలకు, సూత్రాలకు, సిద్ధాం తాలకు విరుద్ధం. విద్యార్థులతో బలవంతంగా డాన్సులు చేయించడం లేదా అలాంటి అనైతిక కార్యక్రమాల్లో వారు పాల్గొనేలా చేసే స్కూళ్ల లైసెన్సులు రద్దు చేస్తామంటూ ప్రభుత్వం ఓ నోటీసు జారీ చేసింది. డాన్సులపై విధించిన నిషేధాజ్ఞలను టీచర్లు, విద్యా సంస్థల అధిపతులు సహా పాటించని వారిపై తగు చర్యలు తీసుకుంటారు. ఈ నిషేధాజ్ఞలు పంజాబ్ ప్రావిన్స్‌లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు రెండింటికీ వర్తిస్తాయి. నిషేధం సక్రమంగా అమలయ్యేలా చూడాలని ప్రావిన్స్ సంబంధిత జిల్లా విద్యాశాఖ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

పోర్షె కారు కొన్న 10 నిమిషాలకే సీజ్



మెల్‌బోర్న్ : లగ్జరీ బ్రాండ్ అయిన పోర్షె కారు కొంటే ఎలా ఉంటుంది? రయ్ రయ్ మని అందులో ఎప్పుడెప్పుడు తిరుగుదామా, కొత్త కారులో ఊరంతా చుట్టేద్దామా అనిపిస్తుంది. అయితే, ఆస్ట్రేలియాలోని ఓ వ్యక్తికి మాత్రం చేదు అనుభవం ఎదురైంది. పోర్షె కారు కొనుక్కున్న అతడు మెల్‌బోర్న్‌లోని ఆల్బర్ట్ పార్క్‌లో ఎంచక్కా జాయ్ రైడ్‌కు వెళ్లాడు. తన మొదటి రైడ్ గుర్తుండిపోవాలని మొబైల్ ఫోన్‌లో వీడియో కూడా తీసుకుంటున్నాడు. కానీ పది నిమిషాల్లో అతడి సంతోషం ఆవిరైపోయింది. కారులో బయలుదేరిన పది నిమిషాలకే పోలీసులు అడ్డుకుని కారును స్వాధీనం చేసుకున్నారు. మెల్‌బోర్న్‌లోని గ్రాండ్ ప్రి సర్క్యూట్ రోడ్డులో ప్రయాణిస్తున్న అతడు కారులో గంటకు 40 కిలో మీటర్లు మాత్రమే ప్రయాణించాల్సిన ప్రాంతంలో 100 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తున్నాడని పోలీసులు అతడిని అడ్డుకున్నారు. పోలీసులు వాహనాన్ని 30 రోజులపాటు స్వాధీనంలో ఉంచుకోనున్నారు. అక్కడి పోలీసులు ఈ విష యాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. మెల్‌బోర్న్‌కు చెందిన సదరు 37 ఏళ్ల వ్యక్తిపై పోలీసులు అతివేగం, డ్రైవింగ్‌లో ఉండగా ఫోన్ వాడడంపై అభియోగాలు నమోదు చేయనున్నారు.

జరిగితే అద్భుతం జరుగుతుంది..



- కిమ్‌తో భేటీపై ట్రంప్
- నిన్న మొన్నటి వరకు యుద్ధ నాదం చేసిన కిమ్, ట్రంప్
- స్నేహ గీతం పాడుతున్న కిమ్, ట్రంప్
- కిమ్‌తో భేటీపై ముందుగా ఫలితం ఊహించలేం

వాషింగ్టన్ : నిన్న మొన్నటి వరకు అణ్వాయుధాలతో సర్వనాశనం చేస్తామని హెచ్చరికలు జారీ చేసుకున్న అమెరికా, ఉత్తర కొరియా చర్చలకు సముఖత వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఈ రెండు దేశాధినేతల మధ్య చర్చలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికాలో రిపబ్లికన్ పార్టీ నేత రిక్ సాకోన్ నిర్వహిస్తున్న ర్యాలీలో పాల్గొన్న ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'కిమ్ జాంగ్ ఉన్‌తో జరిగే సమావేశంలో ఎలాంటి ఒప్పందమూ జరగక పోవచ్చు. లేదా ప్రపంచం మొత్తానికి మేలు జరిగే నిర్ణయం తీసుకోవచ్చు' అని ట్రంప్ పేర్కొన్నారు. కిమ్‌తో చర్చల్లో ఇది జరగవచ్చని ముందుగా ఫలితాన్ని ఊహించలేమని ఆయన అన్నారు. అయితే, ఆ చర్చలు ఎలాంటి ఫలితాన్నీ ఇవ్వని పక్షంలో తాను వెంటనే బయలుదేరి వచ్చేస్తానని ఆయన చెప్పారు. గత నవంబర్ నుంచి ఉత్తర కొరియా ఎలాంటి అణ్వాయుధ పరీక్షలూ నిర్వహించడం లేదని, ఇకపై కూడా వారు ఆ పరీక్షలు నిర్వహించరని ఆశిస్తున్నానని ట్రంప్ తెలిపారు. కాగా, ఆ దేశంపై ఆంక్షలు కొనసాగుతున్నాయని ఆయన స్పష్టం చేశారు.

కిమ్‌తో ట్రంప్ సమావేశం ఏప్రిల్‌లోనా? మే లోనా? అనేది ఇప్పుడే చెప్పలేం: వైట్ హౌస్

ఉత్తర కొరియా నియంత కిమ్ జాంగ్ ఉన్‌తో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చర్చలపై వైట్ హౌస్ అధికార ప్రతినిధి రాజ్ షా అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా కిమ్ జాంగ్ ఉన్‌తో చర్చలు జరిపేది ఏప్రిల్‌లోనా లేక మేలోనా అన్నది ఇప్పుడే చెప్పలేమని ఆయన పేర్కొన్నారు. చర్చలకు సిద్ధమని ప్రకటించడమే పెద్ద ముందడుగు అని ఆయన తెలిపారు. దీంతో ఎలాంటి అదనపు షరతులు విధించలేదని అన్నారు. అణ్వాయుధ పరీక్షలు నిలిపేస్తామని, దక్షిణ కొరియా, అమెరికా సంయుక్తంగా నిర్వహించుకునే సైనిక విన్యాసాలపై విమర్శలు చేయబోమని ఉత్తర కొరియా చెప్పిందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో దౌత్యపరమైన అంశాలే ఉంటాయని ఆయన అన్నారు. సమావేశ ముఖ్య లక్ష్యంపై తమ అధ్యక్షుడికి పూర్తి స్పష్టత ఉందని ఆయన చెప్పారు. తమ భాగస్వామ్య దేశాలతో పాటు ఐక్యరాజ్య సమితిలో సభ్యత్వం గల దేశాల నుంచి చేసిన ఒత్తిడి సత్ఫలితం ఇచ్చిందని ఆయన అన్నారు.

110 మందితో వస్తున్న విమానం హైజాక్

- వెంటనే కూల్చివేయమని రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆదేశం
- 2014 ఫిబ్రవరి 7న సోచీలో ప్రారంభమైన ఒలింపిక్స్
- విమానంతో దాడి చేయనున్నారని పుతిన్‌కు సమాచారం



మాస్కో : రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పేరిట ఓ డాక్యుమెంటరీని తయారు చేసి ప్రదర్శించగా, అందులో చూపిన ఓ ఘటన ఇప్పుడు వైరల్ అవుతోంది. 2014లో ఫిబ్రవరి 7న సోచిలో ఒలింపిక్స్ ప్రారంభం కాగా, ప్రారంభ వేడుకలను తిలకించేందుకు సుమారు 40 వేల మంది హాజరయ్యారు. ఆ కార్యక్రమంలో పాల్గొనేందుకు పుతిన్ బయలుదేరుతున్న వేళ ఓ ఫోన్ కాల్ వచ్చింది. ఖర్కివ్ నుంచి ఇస్తాంబుల్‌కు వెళుతున్న పీగాసస్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన బోయింగ్ 737–800 విమానాన్ని ఉగ్రవాదులు హైజాక్ చేసి ఓ ప్రయాణికుడికి బాంబు అమర్చారని, దానిని సోచి వైపు తీసుకు వస్తున్నారని అధికారులు తెలపడంతో, ఒక్కసారిగా ఆందోళనకు గురైన పుతిన్ అధికారులతో సమావేశమై ఆ విమానాన్ని గాలిలోనే కూల్చివేయాలని ఆదేశించారట. ఒలింపిక్స్ చూసేందుకు వచ్చిన 40 వేల మందిని కాపాడాల్సిన బాధ్యత తనపై ఉందని చెప్పిన ఆయన 110 మంది ప్రాణాలు పోయినా ఫర్వా లేదని స్పష్టం చేసి ప్రారంభ వేడుకల్లో తాను కూడా పాల్గొంటానని చెబుతూ వెళ్లిపోయారట. ఆపై కాసేపటికి వచ్చిన మరో ఫోన్ కాల్‌లో, తొలుత వచ్చిన ఫోన్ సమాచారం తప్పు అని, విమానంలో ఓ వ్యక్తి తాగి అల్లరి చేశాడని, సదరు విమానం ఇస్తాంబుల్ వైపుగానే వెళుతోందని అధికారులు చెప్పడంతో పుతిన్ ఊపిరి పీల్చు కున్నారట. ఈ ఘటనను పుతిన్ ప్రభుత్వంలోని అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ సైతం ధ్రువీక రించడం గమనార్హం.


ఇళ్లకు 11కేవీ సప్లయ్

బాంబుల్లా పేలిన టీవీలు, ఫ్రిడ్జిలు : బీటెక్ విద్యార్థి మృతి



మీరట్ : సాధారణంగా ఇళ్లకు 230 ఓల్టుల సింగిల్ ఫేజ్ విద్యుత్‌ను సప్లయ్ చేస్తుంటారు. కానీ, ఉత్తర ప్రదేశ్ మీరట్‌లోని ఇంచోలీ గ్రామం, కువాన్ పట్టి ప్రాంతంలోని దాదాపు 110 ఇళ్లకు ఉన్నట్లుండి 11 కేవీ విద్యుత్ సరఫరా కావడంతో వాటిలోని టీవీలు, ఫ్రిడ్జిలు ఒకటి తరువాత మరోటి బాంబుల్లా పేలాయి. ఆస్తి నష్టం వాటిల్లడంతో పాటు 20 ఏళ్ల బీటెక్ విద్యార్థి కూడా మృత్యువాత పడ్డాడు. ముగ్గురు మహిళలు సహా నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. ఓ ఇల్లు మంటలకు ఆహుతైంది. ఈ ప్రమాదంతో కోపోద్రిక్తులైన సదరు గ్రామస్థులు తమకు సమీపంలోని 119 నంబరు జాతీయ రహదారిని దిగ్బంధించారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ప్రభుత్వాధి కారులు అక్కడికి చేరుకున్నారు. ఆందోళనకారులను వారించే ప్రయత్నం చేశారు. మరో వైపే విద్యుత్ శాఖ బాధితుడి కుటుంబానికి నష్టపరిహారం కింద రూ. 5 లక్షల చెక్కును అందజేసింది. ఈ ఘటనపై దర్యాప్తుకు ఆదేశించామని, ప్రమాదానికి కారణమేమిటో ఇంకా తెలియడం లేదని పశ్చిమాంచల్ విద్యుత్ వితరన్ నిగమ్ లిమిటెడ్ (పీవీవీఎన్ఎల్) చీఫ్ ఇంజనీర్ ఎస్‌బీ యాదవ్ తెలిపారు.

రెండుగా చీలిన లష్కరే తోయిబా



ఇస్లామాబాద్ : పాకిస్తాన్ కేంద్రంగా నడుస్తున్న ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా రెండుగా చీలిపోయింది. అంతర్జాతీయ ఉగ్రవాదిగా ముద్ర పడిన హాఫీజ్ సయీద్‌పై పాకిస్తాన్ నిషేధం విధించిన నేపథ్యం, ఆ సంస్థకు నిధులను నిలిపివేయడంతోనే లష్కరే తోయిబా విడిపోయినట్టు తెలుస్తోంది. లష్కరే సహ వ్యవస్థాప కుడు మౌలానా అమీర్ హంజా ఇకపై జైష్ – ఏ– మన్ ఖాఫా పేరిట కొత్త కుంపటి పెట్టుకున్నాడు. హాఫీజ్ సయీద్‌కు ప్రధాన అనుచరుడిగా ఉన్న అమీర్ హంజా ముంబయి ఉగ్ర దాడి వెనుక సూత్రధారి కూడా. సయీద్ నడిపే జమాతే ఉద్ దవా, ఫలాహ్ ఏ ఇన్సానియత్ నుంచి ఆయనకు నిధులు అందుతున్నాయని తెలుస్తోంది. ఇటీవల హాఫీజ్ బ్యాంకు ఖాతాలను పాక్ స్తంభింపజేయడంతో ఉగ్ర సంస్థను నిర్వహించేందుకే మరో సంస్థను ఏర్పాటు చేసుకున్నట్టు సమాచారం.

శ్రీలంకకు భారీ ఎదురుదెబ్బ

- కెప్టెన్ చండీమల్‌పై నిషేధం
- బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్
- నిర్ణీత సమయానికి నాలుగు ఓవర్లు తక్కువగా వేసిన వైనం
- మ్యాచ్ ఫీజులో 60 శాతం కోత

కొలంబో : శ్రీలంక జట్టుకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు కెప్టెన్ దినేశ్ చండీమల్‌పై ఐసీసీ రెండు మ్యాచ్‌ల నిషేధం విధించింది. దీంతో సోమవారం భారత్‌తో జరిగిన కీలక మ్యాచ్‌కు చండీమల్ అందుబాటులో లేకుండా పోయాడు. బంగ్లాదేశ్‌తో శనివారం జరిగిన మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా ఐసీసీ ఈ నిషేధాన్ని విధించింది. నిర్ణీత సమయానికి నాలుగు ఓవర్లు తక్కువగా వేసినందుకు గాను చండీమల్‌పై వేటు పడగా జట్టు సభ్యులకు మ్యాచ్ ఫీజులో 60 శాతం కోత విధించినట్టు ఐసీసీ తెలిపింది. అలాగే నిర్ణీత సమయానికి ఒక ఓవర్ తక్కువగా వేసిన బంగ్లాదేశ్ జట్టుకు కూడా జరిమానా విధించారు. కెప్టెన్ మహ్మదుల్లాకు మ్యాచ్ ఫీజులో 20 శాతం, జట్టు సభ్యులకు 10 శాతం కోత విధిస్తూ ఐసీసీ నిర్ణయం తీసుకుంది.



ప్రతీకారం తీర్చుకున్న భారత్

- శ్రీలంకపై ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం
- 153 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన భారత్
- మూడు ఫోర్లు, ఒక సిక్సర్‌తో పాండే 41 పరుగులు

శ్రీలంక: నిదహాస్ ముక్కోణపు సిరీస్‌లో భాగంగా శ్రీలంకతో జరుగుతున్న నాలుగో టీ-20లో భారత్ ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 153 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ 17.3 ఓవర్లలో కేవలం 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేధించింది. రోహిత్ శర్మ 11, శిఖర్ ధావన్ 8, కేఎల్ రాహుల్ 18, సురేశ్ రైనా 27 పరుగులు చేసి అవుటయ్యారు. మూడు ఫోర్లు, ఒక సిక్సర్‌తో పాండే 41 పరుగులు చేశాడు, కార్తీక్ 29 పరుగులు చేశాడు. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 19 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 152 పరుగులు చేసింది. శ్రీలంక ఆటగాళ్లలో గుణతిలక 17, మెండిస్ 55, పెరీరా 3, తరంగ 22, శంకర 19 పరుగులు చేశారు. భారత బౌలర్లలో ఠాకూర్‌కు 4 వికెట్లు, వాషింగ్టన్ సుందర్ 2, చహల్, శంకర్, ఉనద్కత్ తలా ఒక వికెట్ తీశారు. మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 19 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 152 పరుగులు చేసింది. ఆ జట్టులో ఓపెనర్ మెండీస్ (55) అర్ధశతకంతో రాణించాడు. తరంగ (22), శనక (19) గుణరత్న(17) పరుగులు చేశారు. భారత బౌలర్లలో శార్దూల్ ఠాకూర్ (4/27), వాషింగ్టన్ సుందర్ (21/2) రాణించారు. తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంకకు శుభారంభం లభించింది. తొలి రెండు ఓవర్లలో 24 పరుగులు లభించాయి. అయితే స్వల్ప వ్యవధిలోనే గుణరత్న(), కుశాల్ పెరెరా() వికెట్ల కోల్పోవడంతో జట్టు కష్టాల్లో పడింది. ఈ దశలో మెండీస్-తరంగ జోడీ మూడో వికెట్ కీలకమైన 60 పరుగుల భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. దీంతో శ్రీలంక భారీ స్కోరు సాగేలా కనిపించింది. కానీ.. వరుసగా వికెట్ల కోల్పోవడంతో భారత్ పట్టుబిగించింది. తొలుత ప్రమాదకరంగా పరిణమిస్తున్న మెండిస్- తరంగ జోడీని విజయ్ శంకర్ విడదీశాడు. అతడి బౌలింగ్‌లో తరంగ బౌల్డయ్యాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన తిశారా పెరీరా(15) సైతం ఎక్కువ సేపు నిలవలేదు. శార్దూల్ ఠాకూర్ బౌలింగ్‌లో చాహల్ క్యాచ్ పట్టడంతో పెవిలియన్ చేరాడు. అతని స్థానంలో క్రీజులోకి వచ్చిన జీవన్ మెండిస్‌ను వాషింగ్టన్ సుందర్ బౌల్డ్ చేశాడు. కొద్దిసేపటికే ఓపెనర్ మెండిస్ సైతం చాహల్‌కు చిక్కాడు. ఆఖర్లో శనక(19) కాస్త వేగంగా ఆడటంతో జట్టు స్కోరు 150 మార్కును దాటింది. భారత బౌలర్లలో శార్దూల్ ఠాకూర్ కీలక సమయాల్లో వికెట్లు తీస్తూ శ్రీలంక పతనంలో కీలక పాత్ర పోషించాడు. ఉన్కదత్, చాహల్, విజయ్ శంకర్ తలో వికెట్ తీశారు. ముక్కోణపు టీ20 సిరీస్‌లో భాగంగా భారత్-శ్రీలంక మధ్య జరుగుతున్న టీ20 మ్యాచ్ వర్షం కారణంగా ఆలస్యమైంది. మైదానంలో తొలుత చిరుజల్లులతో మొదలైన వర్షం కాస్త పెద్దదిగా మారింది. దీంతో ఔట్ ఫీల్డ్ చిత్తడిగా మారింది. మైదాన సిబ్బంది పిచ్‌పై కవర్లు కప్పేశారు. ఈ సిరీస్‌లో రెండేసి మ్యాచ్‌లు ఆడిన మూడు జట్లూ ఓ మ్యాచ్ నెగ్గి మరో మ్యాచ్ ఓడి సమాన స్థితిలో నిలిచాయి.



సోషల్ మీడియాలో ఫోటోలు పెట్టవద్దు

- విరుష్క దంపతులకు ఫ్యాన్స్ సూచన
- ముంబయిలోని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న విరుష్క దంపతులు
- అనుబంధాన్ని చెబుతూ సోషల్ మీడియాలో ఫోటోలు
- ఇకపై ఫోటోలు పెట్టవద్దంటున్న ఫ్యాన్స్



ముంబయి : టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ, సినీ నటి అనుష్క శర్మ దంపతులు తమ అనుబంధాన్ని సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకుంటున్నారు. టూర్లు, షూటింగ్‌లతో నిత్యం బిజీగా ఉండే వీరిద్దరూ హాలీడేని ఇంటిలో ఎంజాయ్ చేస్తున్నారు. శ్రీలంక టూర్‌కు విశ్రాంతి తీసుకుని కోహ్లీ ఇంటిలో ఉండగా, 'సూయిధాగా' సినిమా షూటింగ్ విరామంతో అనుష్క ఇంటికి చేరింది. దీంతో వారిద్దరూ ఇంటిలో సేద తీరుతున్నారు. ఈ సందర్భంగా తీసుకున్న ఫోటోలను అప్‌లోడ్ చేస్తూ ఆకట్టుకుంటున్నారు. తాజాగా అనుష్క కోహ్లీని ముద్దాడుతున్న ఫోటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. ఈ ఫోటో పెట్టిన క్షణాల్లో వైరల్‌గా మారింది. ఆ ఫోటోను చూసిన ఫ్యాన్స్ ఇకపై అలాంటి ఫోటోలు పెట్టవద్దని, ఆ జంట అనుబంధాన్ని చూసి కన్నుకుట్టేవాళ్లు కూడా ఉంటారని, అందుకే ఇకపై ఫోటోలు పెట్టవద్దని హార్డ్ కోర్ ఫ్యాన్స్ ఆ జంటకు సూచిస్తున్నారు.

కూర్చుని మాట్లాడుకుందాం

- భార్యతో చర్చలకు ముందుకొచ్చిన టీమిండియా పేసర్ షమీ
- వివాదాన్ని కోర్టు బయట పరిష్కరించుకునేందుకు రెడీ
- హసీన్ తరఫు లాయర్‌ను కలిసిన షమీ కుటుంబ సభ్యులు
- తప్పు ఒప్పుకుంటే కలిసి ఉండేందుకు సిద్ధమేనన్న హసీన్



కోలకతా : టీమిండియా పేసర్ మహమ్మద్ షమీ ఎట్టకేలకు ముందుకు వచ్చాడు. భార్య హసీన్ జహాన్ తనపై చేస్తున్న ఆరోపణల నేపథ్యంలో వివాదాన్ని పరిష్కరించుకునేందుకు తొలి అడుగు వేశాడు. కోర్టు బయట సమస్యను పరిష్కరించుకునే ఉద్దేశం ఉన్నట్టు చెప్పాడు. ఈ మేరకు షమీ కుటుంబ సభ్యులు ఆదివారం హసీన్ జహాన్ లాయర్ జకీర్ హుస్సేన్‌ను కలిసి మాట్లాడారు. కోర్టు వెలుపల సమస్యను పరిష్కరించుకుందామని తెలిపారు. ఈ విషయాన్ని ధ్రువీకరించిన హుస్సేన్ అంతకు మించి మాట్లాడేందుకు నిరాకరించారు. ఇరు కుటుంబాల మధ్య చర్చలు పురోగతిలో ఉన్నట్టు పేర్కొన్నారు. హసీన్ కూడా ఇదే విషయాన్ని వెల్లడించారు. షమీ కుటుంబ సభ్యులు తమ లాయర్‌ను కలిసినట్టు పేర్కొన్న హసీన్ తనకైతే ఇప్పటి వరకు ఎటువంటి కాల్స్ రాలేదన్నారు. 'అతడు కనుక నిజంగా మారాలనుకుంటే నేను నా కుటుంబాన్ని కాపాడుకోవడం గురించి కూడా సీరియస్‌గా ఆలోచిస్తా' అని హసీన్ చెప్పారు. షమీ కూడా ఇంచుమించు ఇలాగే స్పందించాడు. చర్చల ద్వారా సమస్య పరిష్కారమవుతుందనుకుంటే అంతకు మించి కావాల్సిందేమీ లేదని, తాను సిద్ధమని పేర్కొన్నాడు. సమస్యను పరిష్కరించుకోవడం తమకు, తన కెరీర్‌కు, తన కుమార్తె భవిష్యత్తుకు ఎంతో ముఖ్యమని వివరించాడు. కాగా, షమీ మోసగాడని, పలు దేశాల్లోని మహిళలతో అతడికి సంబంధాలు ఉన్నాయని, తనను మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నాడని హసీన్ కోలకతా పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఆమె ఫిర్యాదుపై పోలీసులు పలు సెక్షన్ల కింద షమీపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేశారు.

బీసీసీఐ నిర్ణయాన్ని తప్పు పట్టిన వసీం అక్రమ్


- టీమిండియా ఆటగాళ్ల వార్షిక వేతనాన్ని సవరించిన బీసీసీఐ పాలక మండలి
- ఐదుగురు ఆటగాళ్లను ఏ ప్లస్ కేటగరీలో చేర్చిన బీసీసీఐ పాలక మండలి
- ఏ ప్లస్ కేటగరీపై బీసీసీఐ పాలక మండలి నిర్ణయాన్ని తప్పు పట్టిన వసీం అక్రమ్



లాహోర్: టీమిండియా క్రికెటర్ల వార్షిక వేతన కాంట్రాక్ట్‌ను పునరుద్ధరిస్తూ బీసీసీఐ భారీగా వేతనాలు పెంచిన సంగతి తెలిసిందే. ఏ ప్లస్ గ్రేడ్‌లో ఐదుగురు ఆటగాళ్లకు స్థానం కల్పించిన బీసీసీఐ పాలక మండలి వారికి ఏడాదికి ఏడు కోట్ల వేతనం ఇస్తామని ప్రకటించింది. దీనిపై పాకిస్తాన్ దిగ్గజ ఆటగాడు వసీం అక్రమ్ ఆసక్తికర అభిప్రాయం వెల్లడించాడు. శిఖర్ ధావన్, రోహిత్ శర్మలకు ఈ జాబితాలో స్థానం కల్పించడం పట్ల పెదవి విరిచాడు. బీసీసీఐ నిర్ణయం సరైనది కాదని పేర్కొన్నాడు. టెస్ట్ స్పెషలిస్ట్ బ్యాట్స్‌మన్ ఛతేశ్వర్ పుజారా, స్పిన్నర్లు రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజాలను కాదని, పరిమిత ఓవర్ల క్రికెట్‌కు పరిమితమైన రోహిత్ శర్మ, శిఖర్ ధావన్‌కు చోటు కల్పించడం సరి కాదని అన్నాడు. టెస్ట్ క్రికెట్ ద్వారానే ఆటగాళ్లలో అత్యుత్తమ ప్రతిభ బయటపడుతుందని చెప్పిన అక్రమ్ అందులో నిరూపించుకోని ఆటగాళ్లను ఏ ప్లస్ జాబితాలో చేర్చడం ఆశ్చర్యంగా ఉందని పేర్కొన్నాడు. టెస్ట్ క్రికెట్ చాలా కఠినమైనదని, అక్కడ నిరూపించుకున్న ఆటగాడు ఎక్కడైనా నిరూపించుకోగలడని, వారికే ఎక్కువ పారితోషికం అందించాలని అక్రమ్ స్పష్టం చేశాడు. అక్రమ్ అభిప్రాయంపై క్రికెట్‌లో చర్చ జరుగుతోంది.

ముంబయిలో కోహ్లీ దంపతులకు కొత్త ఫ్లాట్

- అద్దె ఎంతో తెలిస్తే అవాక్కే
- వోర్లీలోని రహేజా లెజండ్స్ అపార్ట్‌మెంట్‌లో విరాట్ ఫ్లాట్ కొనుగోలు
- ఇందులో రెండేళ్లు మాత్రమే ఉండేలా తాత్కాలిక ఏర్పాటు
- నెలకు రూ. 15 లక్షల అద్దె చెల్లింపు



ముంబయి : టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ- బాలీవుడ్ బ్యూటీ అనుష్క శర్మ ద్వయం ముంబయిలోని వోర్లీలో కొత్తగా కొనుగోలు చేసిన 'ప్రేమగూటి'లోకి త్వరలోనే వెళ్లనున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ ఇల్లు తాత్కాలికమైన ఏర్పాటేనని, ఇందులో వారు రెండు సంవత్సరాల పాటు మాత్రమే ఉంటారని సమాచారం. 'రహేజా లెజండ్స్' అపార్ట్‌మెంట్‌లోని 40వ అంతస్తులో ఓ ఫ్లాటును విరాట్ కొనుగోలు చేసినట్లు తెలిసింది. ఈ ఫ్లాటు విస్తీర్ణం 2675 చదరపు అడుగులు. అయితే, ఈ ఫ్లాటుకు నెలకు అద్దె కింద వారు కళ్లు చెదిరిపోయే మొత్తాన్ని కట్టనున్నారు. విరాట్ దంపతులు దీనికి నెలకు రూ. 15 లక్షల రెంట్‌ను చెల్లించనున్నారట. కోహ్లీ ఈ ఫ్లాట్‌కు డిపాజిట్ కింద రూ. 1.5 కోట్లను, ఒప్పంద రిజిస్ట్రేషన్ కోసం మరో రూ. 1.01 లక్షలు చెల్లించినట్లు తెలిసింది. కాగా, 2017 డిసెంబర్ 11న తమ కుటుంబ సభ్యులు, సన్నిహితుల మధ్య విరాట్- అనుష్క జంట మూడు ముళ్ల బంధంతో ఒక్కటైన సంగతి తెలిసిందే.



పరిశుభ్ర ఇంధనంతో ఆర్థిక వ్యవస్థ ముందంజ

- ప్రపంచంలోనే అత్యధిక జీడీపీ రేటు సాధించిన భారత్
- రానున్న రోజుల్లో భారత్‌లో మరింత యువశక్తి
- అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో భారత్ భాగస్వామ్యం మెరుగు
- మేకిన్ ఇండియా కోసం పరిశుభ్రమైన విద్యుత్ అవసరం



హైదరాబాద్: ప్రాంతీయ ఆర్థిక శక్తిగా తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించిన భారత్, ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మందగమనం చోటుచేసుకున్నా వాటిని అధిగమించి ప్రపంచంలోనే అత్యధిక జీడీపీ రేటు సాధించి అంతర్జాతీయంగా కీలక శక్తిగా ఎదుగుతోంది. ఈ వేగం వెనుక అనేక కారణాలున్నాయి. భారీ స్థాయిలో ఉన్న మధ్య తరగతి జనాభా దేశీయంగా డిమాండ్‌కు ఆధారమవుతూ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోంది. 127 కోట్ల భారత జనాభాలో మూడో వంతు 35 ఏళ్ల లోపు వాళ్లే కావడంతో రానున్న రోజుల్లో భారత్ మరింత యువశక్తిని పొందనుంది. 2020 నాటికి సగటు భారతీయుడి వయస్సు 29 ఏళ్లు ఉండబోతోంది. అదే సమయంలో చైనా వారి సగటు వయస్సు 37గా, జపానీయులదిగా 48గా ఉండబోతోంది. పెద్ద సంఖ్యలో ఉన్న విద్యావంతులైన యువ జనాభా భారత ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపించేందుకు గొప్ప శక్తిగా అవతరించి భారత్‌లో తయారీ రంగాన్ని మరింత విస్తరించేందుకు అంతర్జాతీయ సహకారాన్ని విస్తృతపరుచుకొని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకునేందుకు అవకాశం కల్పిస్తుంది. అంతర్జాతీయ స్థాయిలో తయారీ కేంద్రం ఎదిగేందుకు భారత్‌కు పుష్కలంగా అవకాశాలున్నాయి. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో భారత్ భాగస్వామ్యాన్ని ఇది ఇబ్బడిముబ్బడిగా పెంచడమే కాదు మేకిన్ ఇండియాకు ఆధారమైన ఆర్థిక రంగంలో అనేక ఉపాధి అవకాశాలు సృష్టిస్తుంది. ఈ మహోన్నత లక్ష్యాన్ని చేరుకునేందుకు కావాల్సింది అందుబాటులో విద్యుత్. విద్యుత్ ఉత్పత్తిని భారత్ పెంచుకోవాల్సిన అవసరముంది. ఎందుకంటే కచ్చితమైన విద్యుత్ సరఫరా ఉందంటేనే దేశంపై దీర్ఘకాలిక ఆలోచనలు చేసేందుకు అంతర్జాతీయ సంస్థలు ముందుకొస్తాయి. మేకిన్ ఇండియా కోసం పరిశుభ్రమైన, వేగవంతమైన మరింత విద్యుత్ మనకు అవసరం. ఈ కల సాకారం కావాలంటే ప్రస్తుతం మనకు అందుబాటులో ఉన్న ఇంధన వనరులపై దృష్టి సారించాలి. శిలాజ ఇంధన నిల్వలు మన దగ్గర చాలా తక్కువున్నాయి. హైడ్రోకార్బన్లు చాలా మటుకు దిగుమతి చేసుకుంటున్నాం. దేశీయంగా దొరికే బొగ్గు, దిగుమతి చేసుకుంటున్న బొగ్గు ద్వారానే భారత్‌లో ఎక్కువ విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. గ్లోబల్ వార్మింగ్, మనుషుల ఆరోగ్యంపై కాలుష్యం చూపుతున్న ప్రభావాలను పరిగణనలోకి తీసుకొని మనం విద్యుత్ ఉత్పత్తి కోసం బొగ్గుపై ఆధారపడటమన్నది క్రమంగా తగ్గించుకోవాల్సిన అవసరముంది. ఈ మధ్య ముగిసిన ప్రపంచ పర్యావరణ సదస్సు 23 లో శిలాజ ఇంధనం ముఖ్యంగా బొగ్గు వాడకంపై తీవ్రస్థాయిలో ప్రతికూలత వ్యక్తమైంది. జనవరి 2018 నాటికి ప్రపంచంలో అత్యధిక విద్యుత్ ఉత్పత్తి 334.39 ఉత్పత్తి చేస్తున్న మూడో పెద్ద దేశం భారత్. వీటిలో థర్మల్ విద్యుత్ వాటా 219.8 , జలవిద్యుత్ వాటా 44.9 . అణువిద్యుత్ వాటా 6.78 మాత్రమే. ఆ లెక్కన అణువిద్యుత్ రంగం ఎదిగేందుకు, తద్వారా ఆర్థిక ప్రగతికి దోహదపడేందుకు, విద్యుత్ డిమాండ్, సరఫరాకు మధ్య అంతరం తగ్గించేందుకు అవకాశాలు అపారంగా ఉన్నాయి. లిక్విఫైడ్ గ్యాస్, చమురును భారీ స్థాయిలో దిగుమతి చేసుకుంటున్న దేశం భారత్. దేశీయంగా ఉండే పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం పెంచడం, అణువిద్యుత్ పై భారత్ దృష్టి సారిస్తే దిగుమతి చేసుకుంటున్న ఎంతో ఖరీదైన శిలాజ ఇంధనాలపై ఆధారపడటం తగ్గుతుంది. అంతే కాదు శిలాజ ఇంధనాల వినియోగ వాడకం తగ్గించుకోవాలన్న పర్యావరణ లక్ష్యం కూడా భారత్ ముందుంది. ఈ సవాల్ ను అధిగమించాలంటే సంప్రదాయ ఇంధన వనరులపై ఆధారపడటం తగ్గించుకోవాలి. పరిశుభ్రమైన, సుస్థిరమైన విద్యుత్తే భవిష్యత్ లో ఉండబోతుంది. భారత్ ముందున్న శుభ్రమైన ఇంధన అవకాశాల్లో అణు విద్యుత్ ఒకటి. 1969లో మహారాష్ట్రలోని తారాపూర్ అణువిద్యుత్ కేంద్రంలో వాణిజ్యపరంగా అణు విద్యుత్ ఉత్పత్తి మొదలైన నాటి నుంచి గడిచిన 48 ఏళ్లుగా అణువిద్యుత్‌కు భారత్‌లో మచ్చలేని భద్రతా రికార్డుంది. అణుశక్తి నుంచి పరిశుభ్రమైన విద్యుత్ ఉత్పత్తి మరింత పెంచేందుకు సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన దేశీయంగా రూపొందించిన ప్రెషరైజ్డ్ హెవీ వాటర్ రియాక్టర్లను రానున్న రోజుల్లో భారత్ మరిన్ని ఏర్పాటు చేయబోతోంది. అంతర్జాతీయ సహకారంలో భాగంగా ప్రపంచ భాగస్వాముల లైట్ వాటర్ రియాక్టర్స్ సాంకేతిక పరిజ్ఞానం దీనికి అదనంగా జతకూడనుంది. ఈ అదనపు చేయూతతో భారత్‌లో దేశీయ రియాక్టర్ల నిర్ధారిత అణు విద్యుత్ ఉత్పత్తి 2-3 దశాబ్దాల్లో అనేక రెట్లు పెరుగుతుంది. భారత్ - రష్యా సహకారంతో ఏర్పాటు చేసిన కూడంకుళం అణువిద్యుత్ ప్రాజెక్టు ఈ క్రమంలో మొదటిది. విద్యుత్ ఉత్పత్తిని పెంచడం, ముఖ్యంగా డిమాండ్, సరఫరాలో ఉన్న ప్రస్తుత లోటును భర్తీ చేయడంపై భారత ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారిస్తోంది. ఆ తర్వాత విద్యుత్ ఉత్పత్తిని పెంచనుంది. ఈ లక్ష్యంలో భాగంగా అణు శక్తిని శాంతియుత ప్రయోజనాల కోసం ప్రత్యేకంగా విద్యుత్ ఉత్పత్తి కోసం ఉపయోగించుకునేందుకు అంతర్జాతీయ సహకారం కోరుతూ భారత్ అనేక దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకుంటోంది. స్వదేశీ పరిజ్ఞానంతో 10 అణు రియాక్టర్లు నిర్మించాలన్న భారీ ప్రతిపాదనకు మే, 2017లోనే ఒకే దఫాలోనే కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇవన్నీ పూర్తయితే, 700 మెగావాట్ల 10 రియాక్టర్లు దేశీయ అణుపరిశ్రమకు అవసరమైన చేయూతను అందిస్తాయి. అంతే కాదు అణు సామర్థ్య విస్తరణతో రానున్న రోజుల్లో దేశీయంగా ప్రైవేట్ రంగంలో తయారీకి ఊతం లభిస్తుందని చెప్పడంలో అతిశయోక్తి లేదు. భారత్ దేశం ఆర్థిక శ్రేయస్సుకు ఈ భారీ ప్రాజెక్టులు అండగా నిలవడమే కాదు, సుస్థిర అభివృద్ధి, ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధించి, వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు ప్రపంచవ్యాప్తంగా చేపడుతున్న చర్యల్లో భారత నిబద్ధతను చాటిచెబుతాయి.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2-293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO 22, DOOR NO 8-2- 293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS HYDERABAD-33, TELANGANA. PUBLISHED AT SPR PUBLICATIONS PVT LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2- 293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044.